ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM ఖమ్మం fb.com/vaartha Digital

Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

25-4-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 84 పేజీలు: 8+16 వెల: 6.50



మిలీనియం మార్చ్ కేసులో కెసిఆర్, కెటిఆర్, హరీష్‌లకు ఊరట 2లో

ఆర్థికరంగానికి 'క్లాడ్ మిథోస్' ముప్పు 5లో


## కొత్త డిజిపిగా ఆనంద్?



### 30న డిజిపి శివధర్ రెడ్డి పదవీ విరమణ

#### శాంతిభద్రతల ప్రభుత్వ సలహాదారుగా నియమించే అవకాశం

**హైదరాబాద్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** రాష్ట్ర నూతన డిజిపిగా హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా వున్న సి.వి ఆనంద్‌ను నియమించేందుకు సర్కారు నిర్ణయించినట్లు తెలిసింది. హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిపోస్టులో శిఖా గోయల్‌ను శుక్రవారం సర్కారు నియమించింది. ఆనంద్‌కు ఇంకా ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. ఈ నెల 30వ తేదీన పదవీ విరమణ చేస్తున్న శివధర్ రెడ్డి స్థానంలో ఆనంద్‌ను డిజిపిగా సర్కారు ఖరారు చేసినట్లు సమాచారం. యుపిఎస్‌సి పంపిన జాబితాలో ఆనంద్ పేరు మొదటి స్థానంలో వుండడంతో దీనిపై ఒకటి రెండురోజుల్లో ఉత్తర్వులు వెలువడే అవకాశాలున్నాయి. ఆనంద్ డిజిపిగా నియమితులయితే తెలంగాణ నుంచి >>2

## ఏడుగురు సీనియర్ ఐపిఎస్‌ల బదలీ


డి.ఎస్.చౌహాన్


మహంతి


శిఖా గోయల్


సుమతి


తరుణ్ జోషి

### హోం ముఖ్య కార్యదర్శిగా శిఖా గోయల్

#### విజిలెన్స్ డిజిగా చౌహాన్, ఫ్యూచర్ సిటీ కొత్వాల్‌గా తరుణ్ జోషి, మల్కాజ్‌గిరి సిపిగా సుమతి 2లో

# ఆర్టీసీ చర్చలు సఫలం

## జెఎసి నేతల డిమాండ్లకు ప్రభుత్వం సానుకూలం

### 10శాతం పిఆర్‌సి ఇచ్చేందుకు అంగీకారం

### ప్రభుత్వంలో విలీనం, ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్

### 3 దఫాలుగా 13గంటలుపైగా సాగిన చర్చలు


శుక్రవారం హైదరాబాద్‌లో ఆర్టీసీ జెఏసి నేతలతో చర్చలు జరుపుతున్న డి.సిఎం భట్టి, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం, అడ్లూరి లక్ష్మణ్

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఏప్రిల్ 24:** గత మూడు రోజులుగా సమ్మె చేస్తున్న ఆర్‌టీసీ జేఏసీ నాయకులతో ప్రభుత్వం శుక్రవారం ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు 13 గంటలకు పైగా చర్చలు చేసింది. ఆర్టీసి బస్సు చక్రాలు తిరిగేలా చర్చలు సఫలం అయ్యాయి. ప్రభుత్వం నుంచి వచ్చే స్పష్టమైన హామీల మేరకు సమ్మె విరమణ దిశగా జేఏసీ నేతలు అడుగులు వేశారు. సచివాయంలో ఉదయం అధికారులతో ఆర్టీసి జేఏసీ నేతలు చర్చలు చేశారు. మధ్యాహ్నం తర్వాత రెండు దఫాలు డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో మంత్రివర్గ కమిటీతో ఆర్టీసి జెఏసీ నేతలు చర్చలు చేశారు. ఆర్‌టీసీ ప్రభుత్వంలో విలీనం, వేతన సవరణ, ఆర్‌టీసీలో యూనియన్‌లకు గుర్తింపు ఎన్నికలు ప్రధాన డిమాండ్లతో పాటు మొత్తం 32 డిమాండ్లతో ఆర్‌టీసీ కార్మికులు గత మూడు రోజులుగా సమ్మె చేసిన విషయం తెలిసిందే. చర్చలు ప్రారంభ సమయంలోనే మంత్రుల బృందం శంకర్‌గౌడ్ మృతికి సంతాపం ప్రకటించారు. తర్వాత సుదీర్ఘంగా చర్చలు చేశారు. చర్చల్లో ప్రధానంగా ఆర్‌టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, వేతన సవరణపై సంఘాలు పట్టుపట్టాయి. జేఏసీ ప్రభుత్వం ముందుంచిన 32 డిమాండ్లలో సుమారు 29 సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం, యాజమాన్యం సుముఖత వ్యక్తం చేయగా.. ప్రధానమైన మూడు డిమాండ్ల కోసం జేఏసీ పట్టుపట్టింది. ఈ నేపథ్యంలోనే చర్చలు రాత్రి పొద్దుపోయే వరకు కొనసాగాయి. ఆర్‌టీసీ కార్మికుల డిమాండ్ల పరిష్కారంలో భాగంగా ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన సచివాలయంలో జేఏసీ నేతలతో మంత్రుల బృందం భేటీఅయింది. ఈ సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వివేక్, అడ్లూరి లక్ష్మణ్‌తోపాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ప్రత్యేక సీఎస్ వికాస్‌రాజ్‌లు హాజరయ్యారు. అంతకుముందు జేఏసీ నేతలతో సీనియర్ ఐఏఎస్ అధికారుల కమిటీతో భేటీ >>2

## శంకర్ గౌడ్ కుటుంబానికి రూ.10 లక్షలు సాయం

### ఇందిరమ్మ ఇల్లు, ఒకరికి ఉద్యోగం


మరణించిన డ్రైవర్ శంకర్ గౌడ్(ఫైల్)

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఏప్రిల్ 24:** ఆత్మహత్య చేసుకొని మరణించిన ఆర్‌టీసీబస్ డ్రైవర్ శంకర్ గౌడ్ కుటుంబానికి రూ. 10 లక్షల ఆర్థికసాయం ప్రకటించారు. ఆర్థికసాయంతోపాటు ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇస్తామని, అలాగే వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ >>2

## హెజ్బొల్లాకు సాయం నిలిపివేస్తేనే ఇరాన్‌తో శాంతి ఒప్పందం 2లో

### అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కొత్త మెలిక

## హుగ్లీ నదిలో ప్రధాని మోడీ హుషారుగా పడవ షికారు 2లో

### మార్నింగ్ వాకర్లతో ముచ్చట్లు.. ప్రకృతి అందాలు కెమెరాలోకి



## ప్రజాస్వామ్య పద్ధతిలో 'హిల్ట్' పాలసీ అమలు

### నగరాన్ని, రాష్ట్రాన్నిఅభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యం

### మే మొదటివారం నుంచి సవరించిన భూముల విలువ అమలు

### కేబినెట్ సబ్‌కమిటీ భేటీలో డి.సిఎం భట్టి విక్రమార్క


శుక్రవారం హైదరాబాద్‌లో కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న డి.సిఎం భట్టి, మంత్రులు ఉత్తమ్, శ్రీధర్‌బాబు, జూపల్లి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఏప్రిల్24:** హైదరాబాదు నగరంతో పాటు, రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ప్రజా ప్రభుత్వం తీసుకొచ్చిన హిల్ట్(హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్) తీసుకు వచ్చిందని, ఈ పాలసీని ప్రజాస్వామ్య పద్ధతిలో అమలు చేయడమే ప్రభుత్వ లక్ష్యం అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు స్పష్టం చేశారు. శుక్రవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో రెవెన్యూ రిసోర్స్ మొబలైజేషన్ క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం కమిటీ చైర్మన్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తో పాటు కమిటీ సభ్యులు, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావులు పాల్గొన్నారు. హిల్ట్ పాలసీపై సమీక్ష సమావేశంలో ఇండస్ట్రియల్ ఎస్టేట్స్ ప్రతినిధులు సైతం పాల్గొని వారి అభిప్రాయాలు తెలిపారు.ఎయిర్ పొల్యూషన్ ఇండెక్స్ గణనీయంగా పెరిగిపోతున్న తరుణంలో కాలుష్యకారక పరిశ్రమలు అన్నిటిని ఓఆర్ఆర్ అవతలికి తరలించాలని కంపల్సరీ చేస్తే అందరూ వెళ్ళిపోతారని కొందరు ఇండస్ట్రియల్ ఎస్టేట్ల ప్రతినిధులు స్వయంగా చెప్పినప్పటికీ, మేం >>2

## కాంగ్రెస్ సర్కార్ మెడలు వంచుతాం

### ప్రాణభయంతో హుజూరాబాద్ ప్రజలు

#### డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా నిప్పులు: కేంద్రమంత్రి బండి సంజయ్


శుక్రవారం హుజురాబాద్‌లో జరిగిన ప్రజా ఆందోళనలో పాల్గొన్న కేంత్రి మంత్రి బండి సంజయ్

**జమ్మికుంట/ హుజురాబాద్, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రజలు పలు రకాల సమస్యలతో వారి జీవితాలు సతమతమవుతుంటే.. కరీంనగర్ జిల్లా హుజురాబాద్ మున్సిపాలిటీలోని ప్రజలు కొంతకాలంగా ప్రాణభయంతో జీవిస్తున్నారని, నిద్రలులేని రాత్రులు గడుపుతున్నారని, మన బువ్వ, మన నీరు.. మనం తిని, త్రాగే పరిస్థితులు లేవని కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత విధానాల వల్ల లక్షలాది ప్రాణాలకు ముప్పు పొంచి ఉన్నదని, తక్షణమే డంపింగ్ యార్డు హఠావో, హుజురాబాద్ బచావో.. నినాదంతో కాంగ్రెస్ సర్కారు మెడలు వంచి డంపింగ్ యార్డు ఏర్పాటు జివో రద్దును ముఖ్యమంత్రి చేత, ఆయన నోట చెప్పించాలని నియోజకవర్గంలోని సబ్బండ వర్గాల ప్రజలు రాజకీయాలకు అతీతంగా కలిసిరావాలని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం రాత్రి ప్రజా ఆందోళన సభలో భాగంగా హుజురాబాద్ చేరుకున్న బిజెపి నేత బండి సంజయ్ అశేశంగా తరలివచ్చిన బిజెపి అఖిలపక్ష సంఘాల నేతలతో కలిసి ఆయన నిరాహారదీక్ష వేదికపై కూర్చున్నారు. ఆయనతో పాటు జిల్లా బిజెపి అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, స్థానిక బిజెపి నేతలతో కలిసి ఆయన డంపింగ్ యార్డు నిర్మాణానికి వ్యతిరేకంగా రాష్ట్ర సర్కారుపై ఆయన నిప్పులు చెరిగారు.

హుజురాబాద్ మున్సిపాలిటీ అన్న విషయం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలుసా ? ఆయనకు నివేదికలు ఇచ్చిన నాయకులు ఎవరు ? అధికారులు ఎవరు..? ప్రజల ప్రాణాలు ముఖ్యమా ? నాలుగు జిల్లాల చెత్త చెదారం, జంతువులు కలేబరాలను తీసుకువచ్చి ఈ ప్రాంత ప్రజలను సమాధి చేస్తారా..? కబర్దార్ కాంగ్రెస్ నేతల్లారా తక్షణమే వాస్తవిక స్థితిగతులను ఈ ప్రాంత ప్రజల మనోభావాలను స్థానిక కాంగ్రెస్ నేతలు రాష్ట్ర ప్రభుత్వానికి వివరించండి. వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌ను జన సాంద్రత లేని సుదూర ప్రాంతానికి తరలించండి అంటూ బండి సంజయ్ కుమార్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కాంగ్రెస్ నేతలు నిర్లక్ష్యం చేస్తే.. మీ ఇండ్ల ముందు చెత్తకుప్పలు, కుల్లిపోయిన జంతువుల కలేబరాలను మీవాకిళ్లలో వేస్తాం.. అడుగడుగున రోడ్లపై మీరు తిరగకుండా అడ్డుకుంటాం అంటూ బండి సంజయ్ హెచ్చరించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే రెండు రోజుల్లో తెలంగాణ రాష్ట్ర గవర్నర్‌ను ఎస్సి, ఎస్టి, బిసి కమిషన్లను కలిసి నివేదికలు ఇస్తామన్నారు. గత నెల 15రోజులుగా ఈ ప్రాంత ప్రజలు మండుతున్న ఎండల్లో నిరాహారదీక్షలు చేస్తున్న రాష్ట్ర సర్కార్ నుండి కన్నెత్తి అయిన చూడని నాయకులు రేపు ఏ మొఖం పెట్టుకుని హుజురాబాద్ ప్రజల ముందుకు వస్తారని బండి సంజయ్ సూటిగా ప్రశ్నించారు. ప్రజల ప్రాణాలను నిర్లక్ష్యం చేస్తే.. కాంగ్రెస్ పార్టీ తీవ్ర పరిణామాలను ఎదుర్కొవల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. హుజురాబాద్‌లో వాయుకాలుష్యం, భూగర్భ జలాల కాలుష్యం రసాయనాల వాసనలతో ప్రజలు, పశుపక్షాదులు అనారోగ్యాలకు గురై ప్రాణాలు పోతాయని మీ ఆస్తులు అమ్మిన మందులు రావాని, మీ ఆస్తులు కొనే నాథుడు కూడా ఉండడని ప్రజలు ఇండ్ల నుండి ఉద్యమంలోకి తరలిరావాలని కేంద్ర మంత్రి ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రజా ఆందోళన కార్యక్రమానికి బిజెపి పార్టీ కట్టుబడి ఉందన్నారు.



## 'ఆప్'కు భారీ షాక్

### రాఘవ్ ఛద్దా, మరో ఆరుగురు ఎంపీలు గుడ్‌బై

### బిజెపిలో చేరిక

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 24:** ఆప్ రాజ్యసభ సభ్యుడు రాఘవ్‌ఛద్దా పార్టీకి రాజీనామాచేసారు. పార్టీ నాయకత్వంతో నెలకొన్న విభేదాలు, పార్లమెంటులో తనను మాట్లాడనీయకుండా అణగదొక్కిన వైఖరి వంటి వాటితో నొచ్చుకున్న రాఘవ్ పార్టీకి రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నారు. అంతేకాకుండా తనతోపాటు మరో ఆరుగురు ఎంపిలతో కలిసి బిజెపిలో చేరేందుకు నిర్ణయించుకకున్నట్లు తెలిపి ఆప్‌హైకమాండ్‌కు భారీ షాక్ ఇచ్చారు. ఈమేరకు మీడియా మీట్ నిర్వహించి వివరాలు చెప్పారు. వెనువెంటనే ఏడుగురు సభ్యులతోకూడిన లేఖను బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ సింహాకు ఇచ్చి బిజెపిలో చేరుతున్నట్లు ప్రకటించారు. అలాగే పార్టీకి రాజీనామా లేఖలు, ఏడుగురు ఎంపిలు తాము పార్టీమారే ప్రణాళికలు, అందుకు సంబంధించిన డాక్యుమెంట్లను >>2

## ఈసారి ముందే నైరుతిపవనాలు!



### మే చివరికే దక్షిణాదిలో వర్షాలు కురిసే అవకాశం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 24:** ఏప్రిల్ మాసం ముగింపు దశకు చేరుకుంటున్న తరుణంలో, దేశంలోని చాలా ప్రాంతాలు తీవ్రమైన వేడితో అల్లాడుతున్నాయి. ఉత్తర, మధ్య, తూర్పు భారతదేశంలోని కొన్ని ప్రాంతాలలో ఉష్ణోగ్రతలు 43-44 డిగ్రీల సెల్సియస్‌కు చేరుకున్నాయి. రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండి) హెచ్చరించింది. ఈ క్రమంలోనే దేశ ప్రజలకు మరో చల్లని శుభవార్త కూడా చెప్పింది. గతంతో పోల్చుకుంటే ఈసారి నైరుతి రుతుపవనాలు ముందే దేశాన్ని చేరుకుంటాయని తెలిపింది. ఈ రుతుపవనాల ప్రభావంతో మే చివరి నాటికే దక్షిణ భారతదేశంలో వర్షాలు కురిసే అవకాశాలున్నాయని స్పష్టం చేసింది. యూరోపియన్ సెంటర్ ఫర్ మీడియంరేంజ్ వెదర్ ఫోర్కాస్ట్స్ అంచనాల ప్రకారం, ఈసారి నైరుతి రుతుపవనాలు ముందస్తుగానే పలకరించే అవకాశం ఉందని తెలుస్తోంది. మే చివరి నాటికే దక్షిణ భారతదేశంలో వర్షాలు కురిసే సూచనలు కనిపిస్తున్నాయి. మే 18 నుండి 25 మధ్య నైరుతి రుతుపవనాలు అండమాన్ - నికోబార్ దీవుల్లోకి ప్రవేశించే అవకాశం ఉందని అంచనాలు చెబుతున్నాయి. ఈ ప్రాంతంలో సాధారణం కంటే 30 నుండి 60 మి.మీ ఎక్కువ వర్షపాతం నమోదయ్యే సూచనలు ఉన్నాయిని స్పష్టం చేశాయి. ఇక మే 25 నుండి జూన్ 1 మధ్య ఈ రుతుపవనాలు పశ్చిమ దిశగా కదిలి కేరళ తీరాన్ని, తమిళనాడులోని దక్షిణ జిల్లాలను తాకవచ్చని వాతావరణ శాఖ పేర్కొంది. రుతు పవనాల ప్రభావంతో అండమాన్ ఉత్తర ప్రాంతంలో ఒక ఉష్ణమండల వ్యవస్థ ఏర్పడే >>2

## ప్రజల పక్షాన ఆలోచించండి



### ఆర్టీసి కార్మికులు, ప్రభుత్వం పట్టుదలకు పోవద్దు

### సీడ్స్ ద్వారానే తాలు సమస్య: కౌన్సిల్ చైర్మన్ సుఖేందర్ రెడ్డి

**నల్గొండ టౌన్ ఏప్రిల్ 24, ప్రభాత వార్త:** నల్గొండ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పత్రిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ .టి. సి. కార్మికులు, ప్రభుత్వం పట్టుదలతో వెళ్లకుండా ప్రజల పక్షాన ఆలోచనచేసి , సమ్మెను విరమించే దిశగా ఆలోచన చేయాలని అన్నారు.ఆర్టీసీ కార్మికుడు శంకరయ్య గౌడ్ ఆత్మహత్య చేసుకోవడం చాలా బాధాకరమని, వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి, సంతాపం వ్యక్తం చేస్తున్నానని తెలిపారు. చర్చల ద్వారా మాత్రమే సమస్యలకు పరిష్కారం అవుతాయని, ఆత్మహత్యల వలన కుటుంబాలు నష్టపోతాయని అన్నారు. యసంగి కొనుగోళ్ల విషయంలో కొనుగోళ్లు వేగంగా సాగుతున్నాయని, ఈసారి తాలు సమస్య ప్రధానంగా ఇబ్బంది ఉందని అన్నారు. సీడ్స్ ద్వారానే తాలు సమస్య వస్తుందని అధికారులు తెలిపారు. ధాన్యాన్ని మిల్లులు తరలించే కార్యక్రమాన్ని వేగంగా చేయాలని కోరుతున్నామని, అకాల వర్షాలతో రైతులు నష్టపోయే అవకాశం ఉందని అన్నారు.సంపూర్ణంగా రైతు బంధు రాలేదు అనే అసంతృప్తి రైతుల్లో ఉన్నారని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామని, రైతు బోనస్, రైతు బంధు ద్వారా ప్రభుత్వానికి ఆర్థిక భారం ఉన్న విషయం వాస్తవమని అన్నారు. రైతు బంధు, సన్నాలకు బోనస్, ఈ రెండు పథకాల విషయంలో ప్రభుత్వం ఆలోచన చేసి ఏదో ఒక పథకాన్ని సంపూర్ణంగా అమలు చేస్తే బాగుంటుందని ఆయన అన్నారు.మిగతా రాష్ట్రాల్లో పండిన ధాన్యాన్ని ప్రభుత్వాలు కొనడం లేదని అందువల్ల మిగిలిన రాష్ట్రాల రైతులు తెలంగాణ రాష్ట్రానికి వచ్చి అక్కడి కన్నా ఎక్కువ రేట్ కి తెలంగాణ లో అమ్ముకొని వెళుతున్నారు. ఇది తెలంగాణ రాష్ట్ర రైతాంగానికి నష్టం చేసేలా ఉందన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లు కేంద్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలువిషయంలో సాయం చేయాలని కోరారు.వాస్తవాలను పక్కన పెట్టి ప్రతిపక్షాలు రాజకీయం చేయడం తప్పని ప్రజలను రెచ్చగొట్టి ప్రయోజనం పొందాలి అని చూడొద్దన్నారు. కాళేశ్వరంలో పిసిఘోష్ కమిషన్ విషయంలో ఎవరికి హైకోర్ట్‌క్లిన్‌చిట్ ఇవ్వలేదని సెక్షన్ 8 ప్రకారం నోటీసులు ఇవ్వలేదుకాబట్టి హరీష్‌రావు, కేసీఆర్‌లపై చర్యలు వద్దని హైకోర్ట్ తెలిపిందన్నారు.



శుక్రవారం హైదరాబాద్‌లో న్యూఢిల్లీకి చెందిన సీనియర్ న్యాయవాది పి.పి.రవీంద్రన్ లోక్‌భవన్‌లో తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లాను కలిసిన దృశ్యం

# ఏడుగురు సీనియర్ ఐపిఎస్‌ల బదలీ

## హోం ముఖ్యకార్యదర్శిగా శిఖాగోయల్, విజిలెన్స్ డిజిగా చౌహాన్, ఫ్యూచర్ సిటీ కొత్వాల్‌గా తరుణ్‌జోషి, మల్కాజిగిరి సిపిగా సుమతి

**హైదరాబాద్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఏడుగురు సీనియర్ ఐపిఎస్ అధికారులను బదిలీ చేస్తూ చీఫ్ సెక్రటరీ రామకృష్ణా రావు శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. హోం శాఖ ముఖ్య కార్యదర్శిగా సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరక్టక్‌గా వున్న శిఖా గోయల్‌ను నియమించారు. హోంశాఖ తో పాటు సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరక్టక్‌గా ఆమెకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. హోం శాఖ ముఖ్య కార్యదర్శిగా తొలిసారిగా ఓ మ హిళా అధికారి నియమితులవడం తెలుగు రాష్ట్రాల్లో ఇదే తొలిసారి. కాగా మల్టీ జోన్ 2, పర్సనల్ విభాగం అదనపు డిజిగా వున్న దేవేంద్ర సింగ్ చౌహాన్‌ను విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిజిగా నియమించారు. డ్రగ్స్ కంట్రోల్ విభాగం డైరక్టర్‌గా వున్న షా నవాజ్ ఖాసీంను మల్టీ జోన్ 2 ఐజిగా నియమించారు. దీంతో పాటు పర్సనల్ విభాగం అదనపు డిజిగా ఆయనకు పూర్తి బాధ్యతలు అప్పగించారు. ఎసిబి డైరక్టర్‌గా వున్న డాక్టర్ తరుణ్ జోషిని కొత్తగా ఏర్పాటు చేసిన ఫ్యూచర్ సిటీ కమిషనర్‌గా నియమించారు. మల్కాజిగిరి పోలీసు కమిషనర్‌గా వున్న అవినాష్ మొహంతి డ్రగ్స్ కం ట్రోల్ విభాగం డైరక్టర్‌గా నియమించారు. దీంతో పాటు అబ్కారీ విభాగం డైరక్టర్‌గా కూడా ఆయన విధులు నిర్వహిస్తారు. నిఘా విభాగంలో ఎస్‌ఐ బి ఐజిగా వున్న బి.సుమతిని మల్కాజిగిరి పోలీసు కమిషనర్‌గా నియమించారు.

ఆమె స్థానంలో నిఘా విభాగంలో ఐజిగా వున్న కార్తికేయకు పూ ర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. కాగా హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా వున్న సి.వి ఆనంద్‌కు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. డిజిపి శివ ధర్ రెడ్డి ఈ నెల 30వ తేదీన పదవీ విరమణ చేస్తుండడం తెలిసిందే. ఆయన తరువాత డిజిపి పోస్టు కోసం యుపిఎస్‌సి ఎంపిక చేసిన లిస్టులో వున్న ఇద్దరు అధికారుల్లో ఆనంద్ కూడా వుండడం గమనార్హం. కాగా ఈ నెల 30వ తేదీన పదవీ విరమణ చేస్తున్న ఫ్యూచర్ సిటీ కమిషనర్ గొట్టె సుధీర్ బాబును డిజిపి కార్యాలయానికి అటాచ్ చేశారు.

## ఈసారి ముందే నైరుతిపవనాలు!

>> అవకాశం ఉందని, దీని కారణంగా రుతుపవనాలు మరింత వేగంగా ముందుకు కదులుతాయని స్పష్టం చేసింది. గతేడాదిలో కూడా రుతుపవనాలు అంచనా వేసిన దానికంటే ముందే కేరళ తీరాన్ని తాకాయి. ఈ ఏడాది కూడా అదే పరిస్థితి పునరావృతమైతే, మే 25 నాటికే రుతుపవనాలు భారత్‌లోకి ప్రవేశించవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇదే జరిగితే, ఎండలతో అల్లాడుతున్న కోట్లాది మంది ప్రజలకు ఉపశమనం లభించడమే కాకుండా, వ్యవసాయ పనులు కూడా త్వరగా ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

# మిలీనియం మార్చ్ కేసులో కెసిఆర్, కెటిఆర్, హారీశ్‌రావులకు హైకోర్టులో ఊరట

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఏప్రిల్24:** హైదరాబాద్ నగరంలో 2011లో జరిగిన మిలీనియం మార్చ్ కేసుకు సంబంధించి తాజాగా కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో అప్పటి టీఆర్ఎస్ (ప్రస్తుతం బీఆర్ఎస్) నేతలు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులపై నమోదైన క్రిమినల్ కేసులను తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. ఈ తీర్పుతో వారికి న్యాయపరంగా పెద్ద ఊరట లభించింది.
2011 మార్చిలో హైదరాబాద్ ట్యాంక్ బండ్ వద్ద మిలీనియం మార్చ్ పేరుతో పెద్ద ఎత్తున ఆందోళన జరిగింది. ఈ నిరసన కార్యక్రమం సమయంలో కొన్ని మీడియా వాహనాలు, కెమెరాలు, ఓబీ వ్యాన్లు ధ్వంసం అయ్యాయని ఆరోపణలు వచ్చాయి.
ఈ ఘటనలపై పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు సమయంలో ఆ ఉద్యమంలో పాల్గొన్న నేతలపై కూడా ఆరోపణలు వచ్చాయి. ఈ కేసు దర్యాప్తులో భాగంగా కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులను నిందితులుగా చేర్చారు. ఈ కేసు రాజకీయంగా కూడా పెద్ద చర్చకు దారి తీసింది. అయితే, వీరు ప్రత్యక్షంగా ఘటనల్లో పాల్గొన్నారని చెప్పేందుకు తగిన ఆధారాలు లేవని వారి తరఫు న్యాయవాదులు వాదించారు.

ఈ కేసులో న్యాయవాది రమణారావు వాదనలు వినిపిస్తూ, పిటిషనర్లకు ఈ ఘటనలతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. వారు ఆందోళనకు నాయకత్వం వహించినా, ఆస్తి నష్టం జరిగిన ఘటనలకు ప్రత్యక్ష బాధ్యత లేదని న్యాయస్థానానికి తెలిపారు. దీర్ఘకాల విచారణ అనంతరం, ఆయా ఆధారాలను హైకోర్టు పరిగణనలోకి తీసుకుంది. తాజా తీర్పులో, కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులపై నమోదైన కేసులను హైకోర్టు కొట్టివేసింది. ఈ కేసులో వారికి ఎలాంటి క్రిమినల్ బాధ్యత లేదని స్పష్టం చేసింది. ఈ తీర్పుతో వారికి చట్టపరంగా పెద్ద ఊరట లభించింది.

# నేడు కల్వకుంట్ల కవిత రాజకీయ పార్టీ ఆవిర్భావ సభ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, ఏప్రిల్24:** కల్వకుంట్ల కవిత రాజకీయ పార్టీ ఆవిర్భావ సభకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శనివారం మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లోని అద్వయ కన్వెన్షన్ హాల్‌లో సభ జరగనుంది. పార్టీ ప్రకటన సభకు ప్రొఫెసర్ జయశంకర్ ప్రాంగణంగా నామకరణం చేశారు. గన్‌పార్క్‌లో అమరవీరులకు నివాళులర్పించిన తరువాత కవిత మునీరాబాద్ బయల్దేరనున్నారు.

ఉదయం 10 గంటలకు పార్టీ పేరు ప్రకటన, జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుంది.

# హుగ్లీ నదిలో ప్రధాని మోడీ పడవ షికారు!

**కోల్‌కత్తా, ఏప్రిల్ 24:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ శుక్రవారం ఉదయం కోల్‌కతాలోని హుగ్లీ నదిలో పడవ ప్రయాణం చేశారు. పడవ నడిపేవారితో, మార్నింగ్ వాక్ చేసే వారితో ఆయన కాసేపు ముచ్చటించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను ఆయన సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. హుగ్లీ నదిలో బోట్ రైడ్ చేసిన మోడీ, కెమెరా చేతబట్టి నది అందాలను క్లిక్‌మనిపించారు. హుగ్లీ నది బెంగాల్ సంస్కృతిలో ముడిపడి ఉందని మోడీ పేర్కొన్నారు. బెంగాలీల జీవితాల్లో గంగానదికి ప్రత్యేక స్థానం ఉందని, దాని జలాలు ఒక ప్రాచీన నాగరికత స్ఫూర్తిని మోసుకువెళ్తున్నాయని పేర్కొన్నారు. ఉదయం కొద్దిసేపు హుగ్లీ నది తీరంలో గడిపినట్లు పేర్కొన్నారు. పడవ నడిపే వారితో, ఉదయపు నడకకు వచ్చిన వారితో కాసేపు ముచ్చటించినట్లు తెలిపారు. పడవ నడిపేవారి శ్రామిక శక్తిని మోదీ ప్రశంసించారు. ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే తమ ప్రభుత్వం పశ్చిమ బెంగాల్ అభివృద్ధికి, ప్రజల శ్రేయస్సు కోసం కృషి చేస్తుందని అన్నారు. హుగ్లీ నది ఒడ్డున తాను వెచ్చించిన సమయం చాలా ప్రత్యేకమైనదని మోడీ మరో పోస్టులో పేర్కొన్నారు. చారిత్రాత్మక విద్యాసాగర సేతు, హౌరా వంతెనను దగ్గరగా చూడటం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. బెంగాలీలకు గంగా నది ఓ ప్రత్యేక స్థానం అని, బెంగాలీ ఆత్మలో గంగా నది ప్రవహిస్తుందని అంటారని, ఆ పవిత్ర నది ఈ దేశ నాగరికత స్ఫూర్తిని ప్రతిబింబిస్తుందని అన్నారు. ఇవాళ ఉదయం కోల్‌కతాలోని హూగ్లీ నది తీరంలో కొంత సమయం వెచ్చించానని, గంగా నదికి కృతజ్ఞత చెప్పే సందర్భం ఇది అని తన ఎక్స్‌లో రాశారు.

# ప్రజాస్వామ్య పద్ధతిలో 'హిల్ట్' పాలసీ అమలు

>> అందరి అభిప్రాయాలు పరిగణలోకి తీసుకొని ప్రజాస్వామ్య పద్ధతిలో ముందుకు పోతున్నామని డిప్యూటీ సీఎం వివరించారు. యుడిఎల్ (అన్ డెవలప్డ్ ల్యాండ్) పాలసీ కింద భూములను అభివృద్ధి చేసే కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, ఇండస్ట్రియల్ పార్కుల ప్రతినిధులు కలిసి అభివృద్ధి చేసుకునే ఆలోచన చేయాలి అన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రోడ్డు మధ్య ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేస్తే మంచిదని, చైనా తరహాలో ప్రత్యేకంగా పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేయాలని ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రతినిధులు సూచించారు ఈ సూచనలను స్వాగతిస్తున్నాం, పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. ఎవరిని ఇబ్బంది పెట్టాలన్న ఆలోచన తమకు లేదని నగరాన్ని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకోవడమే సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ఈ క్యాబినెట్ లక్ష్యం అన్నారు. ఓఆర్ఆర్ లోపల ఉన్న అన్ని ఇండస్ట్రియల్ అసోసియేషన్‌తో కూర్చొని చర్చించి హిల్ట్ పాలసీ అమలు ను వేగవంతం చేసుకుందాం అని డిప్యూటీ సీఎం సూచించారు. హిల్ట్ పాలసీ గైడ్లైన్స్ రూపొందించే ముందు ఇండస్ట్రియల్ ఎస్టేట్ల ప్రతినిధుల ఆలోచనలకు చోటు కల్పించే ప్రయత్నం చేస్తామని డిప్యూటీ సీఎం తెలిపారు. రాష్ట్రంలో పరిశ్రమలు బాగా నడవాలి, కాలుష్యం ఉండకూడదు హిల్ట్ పాలసీలో రాష్ట్ర ప్రభుత్వం చాలా ఓపెన్‌గా ఉందని కమిటీ సభ్యుడు మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. కొత్త ఇండస్ట్రియల్ పాలసీలో కార్మికుల కోసం డార్మెటరీలు తప్పనిసరి చేశామని మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. హిల్ట్ పాలసీని స్వాగతిస్తున్నామని చర్లపల్లి ఇండస్ట్రీస్ అసోసియేషన్ అధ్యక్షుడు డి శ్రీనివాస్ రెడ్డి సమావేశంలో తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం పాలసీని ఇష్టారాజ్యాంగా అమలు చేసుకుంటూ పోతే మా బిఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక ఇబ్బంది పడతారని కొంతమంది నాయకులు మమ్ములను పిలిచి చెప్పారు, అయితే ఇది ప్రభుత్వ నిర్ణయం, జీవో ప్రకారం అమలు జరుగుతుంది, ప్రస్తుతం మేము ఉంటున్న భూములను 30 సంవత్సరాల క్రితమే ఆనాటి ప్రభుత్వం నుంచి కొనుగోలు చేశాం, మా వద్ద సేల్‌డీడ్లు సైతం ఉన్నాయని వివరించినట్టు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

కన్వర్షన్ చార్జీలను రోడ్డు విస్తీర్ణాన్ని బట్టి 30శాతం నుంచి 50శాతం వరకు నిర్ణయించారు హిల్ట్ పాలసీ అమలులో ఎక్కడ క్యాష్ ట్రాన్స్‌ఫర్ లేదు కాబట్టి ఎవరికి ఎటువంటి అనుమానాలు అవసరం లేదని ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రతినిధిగా మేము వారికి స్పష్టం చేశామని క్యాబినెట్ సబ్ కమిటీకి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు రీజినల్ రింగ్ రోడ్డు వద్ద ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు, యుడిఎల్ పాలసీ కింద భూములను అభివృద్ధి చేసి పారిశ్రామికవేత్తలకు సహకరించాలని శ్రీనివాస్ రెడ్డి కోరారు. ఔటర్ రింగ్ రోడ్డు బయట ఏర్పాటు చేసే ఇండస్ట్రియల్ పార్కుల్లో కనీస సౌకర్యాలు అయినా కార్మికులు, ఉద్యోగులకు వసతి సౌకర్యాలు కల్పించాలని కోరారు.



శుక్రవారం అమరావతిలో పదవీవిరమణ చేసిన ఎపి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ వీడ్కోలు సమావేశం దృశ్యం. కొత్త సిజె లీసా గిల్ కూడా చిత్రంలో ఉన్నారు.

# కొత్త డిజిపిగా ఆనంద్?

>> ఈ పోస్టుకు ఎంపికైన మూడవ అధికారి అవుతారు. ఇంతకు ముందు ఖమ్మంకు చెందిన మహేందర్ రెడ్డితో పాటు రంగారెడ్డి నుంచి శివధర్ రెడ్డి డిజిపిగా పనిచేశారు. ఒకవేళ ఆనంద్‌ను డిజిపిగా నియమిస్తే రంగారెడ్డి నుంచి మరో అధికారి ఆ పోస్టుకు చేరిన వారవుతారు. రాష్ట్రంలో ఇంతకు ముందు అనురాగ్ శర్మ, మహేందర్ రెడ్డి, అంజనీ కుమార్, రవి గుప్తా, జితేందర్‌లు డిజిపిగా పనిచేయగా ప్రస్తుతం శివధర్ రెడ్డి ఆ పోస్టులో వున్నారు.

**ప్రభుత్వ సలహాదారుగా శివధర్ రెడ్డి:** ఇదిలావుండగా పదవీ విరమణ చేస్తున్న డిజిపి శివధర్ రెడ్డిని ప్రభుత్వం శాంతి భద్రతలకు సంబంధించిన సలహాదారుగా నియమిస్తున్నట్లు తెలిసింది. గతంలో అనురాగ్ శర్మను అప్పటి బిఆర్ఎస్ సర్కారు నియమించడం తెలిసిందే.

## ఏడుగురు సీనియర్ ఐపిఎస్‌ల బదలీ

**హైదరాబాద్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఏడుగురు సీనియర్ ఐపిఎస్ అధికారులను బదిలీ చేస్తూ చీఫ్ సెక్రటరీ రామకృష్ణా రావు శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. హోం శాఖ ముఖ్య కార్యదర్శిగా సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరక్టక్‌గా వున్న శిఖా గోయల్‌ను నియమించారు. హోంశాఖ తో పాటు సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరక్టక్‌గా ఆమెకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. హోం శాఖ ముఖ్య కార్యదర్శిగా తొలిసారిగా ఓ మ హిళా అధికారి నియమితులవడం తెలుగు రాష్ట్రాల్లో ఇదే తొలిసారి. కాగా మల్టీ జోన్ 2, పర్సనల్ విభాగం అదనపు డిజిగా వున్న దేవేంద్ర సింగ్ చౌహాన్‌ను విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిజిగా నియమించారు. డ్రగ్స్ కంట్రోల్ విభాగం డైరక్టర్‌గా వున్న షా నవాజ్ ఖాసీంను మల్టీ జోన్ 2 ఐజిగా నియమించారు. దీంతో పాటు పర్సనల్ విభాగం అదనపు డిజిగా ఆయనకు పూర్తి బాధ్యతలు అప్పగించారు. ఎసిబి డైరక్టర్‌గా వున్న డాక్టర్ తరుణ్ జోషిని కొత్తగా ఏర్పాటు చేసిన ఫ్యూచర్ సిటీ కమిషనర్‌గా నియమించారు. మల్కాజిగిరి పోలీసు కమిషనర్‌గా వున్న అవినాష్ మొహంతి డ్రగ్స్ కం ట్రోల్ విభాగం డైరక్టర్‌గా నియమించారు. దీంతో పాటు అబ్కారీ విభాగం డైరక్టర్‌గా కూడా ఆయన విధులు నిర్వహిస్తారు. నిఘా విభాగంలో ఎస్‌ఐ బి ఐజిగా వున్న బి.సుమతిని మల్కాజిగిరి పోలీసు కమిషనర్‌గా నియమించారు. ఆమె స్థానంలో నిఘా విభాగంలో ఐజిగా వున్న కార్తికేయకు పూ ర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

కాగా హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా వున్న సి.వి ఆనంద్‌కు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. డిజిపి శివ ధర్ రెడ్డి ఈ నెల 30వ తేదీన పదవీ విరమణ చేస్తుండడం తెలిసిందే. ఆయన తరువాత డిజిపి పోస్టు కోసం యుపిఎస్‌సి ఎంపిక చేసిన లిస్టులో వున్న ఇద్దరు అధికారుల్లో ఆనంద్ కూడా వుండడం గమనార్హం. కాగా ఈ నెల 30వ తేదీన పదవీ విరమణ చేస్తున్న ఫ్యూచర్ సిటీ కమిషనర్ గొట్టె సుధీర్ బాబును డిజిపి కార్యాలయానికి అటాచ్ చేశారు.

# ఉపాధిహామీ సిబ్బందికి బీమా సౌకర్యం రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం

**హైదరాబాద్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఉపాధి హామీ పథకంలో పని చేస్తోన్న సుమారు 3,800 మందికి పైగా ఎఫ్‌టిఈ, కాంట్రాక్టు ఉద్యోగుల కుటుంబాలకు ఆర్థిక భద్రత చేకూర్చేందుకు తెలంగాణ ప్రభుత్వం ముందడుగు వేసింది. ప్రతి ఉద్యోగికి వారి జీతం ఆధారంగా రూ.40 లక్షల నుంచి రూ.1.10 కోట్ల వరకు ఉచిత వ్యక్తిగత, ప్రమాద బీమా కల్పించాలని నిర్ణయించింది. ఈ మేరకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ)తో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ప్రకారం ప్రతీ ఉద్యోగికి వారి జీతం ఆధారంగా రూ.40 లక్షల నుంచి రూ.1.10 కోట్ల వరకు ఉచిత వ్యక్తిగత, ప్రమాద బీమా సౌకర్యం కల్పించనున్నారు. ఇందుకోసం ఉపాధి హామీ ఉద్యోగితో పాటు ప్రభుత్వం కూడా ఎలాంటి ప్రీమియం చెల్లించాల్సిన పని లేదు. ఎస్‌బిఐకార్పొరేట్ శాలరీ ప్యాకెజి పథకం, స్టేట్ గవర్నమెంట్ శాలరీ ప్యాకేజీ పథకం కింద ఈ ప్రయోజనాన్ని అందిస్తున్నది.

# హెజ్బొల్లాకు సాయం నిలిపివేస్తేనే ఇరాన్‌తో శాంతి ఒప్పందం..

## అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కొత్త మెలిక

## ద్వైపాక్షిక చర్చలకోసం పాకిస్థాన్‌కు ఇరాన్ విదేశాంగమంత్రి

**వాషింగ్టన్, ఏప్రిల్ 24:** ఇరాన్‌తో శాంతి ఒప్పందంపై కొత్త షరతు పెట్టారు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్. సీజ్‌ఫైర్‌ను పర్మనెంట్‌గా కొనసాగించాలంటే హెజ్‌బొల్లాకు ఇరాన్ ఫండింగ్ ఆపాలన్నారు. ఓవల్ ఆఫీసులో ఆయన రిపోర్టర్లతో మాట్లాడారు. ఇరాన్ కచ్చితంగా ఫైనాన్సింగ్ ఆపాలన్నారు. మొన్నటి వరకు ఇరాన్ అణ్వాస్త్ర సామర్థ్యంపై చర్చల్లో ఫోకస్ పెట్టిన ట్రంప్ ఇప్పుడు హెజ్‌బొల్లా వైపు మళ్లారు. ఇజ్రాయెల్, లెబనాన్ మధ్య త్వరలోనే శాంతి ఒప్పందం కుదిరే అవకాశాలు ఉన్నట్లు ఆయన చెప్పారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమన్ నెతన్యహూ, లెబనాన్ అధ్యక్షుడు జోసెఫ్ ఆవన్ రాబోయే కొన్ని వారాల్లో వాషింగ్టన్ రానున్నట్లు ట్రంప్ తెలిపారు. వైట్‌హౌజ్‌లో ఇద్దరూ కలుసుకుంటారని ఆయన చెప్పారు. అయితే నెతన్యహూతో లెబనాన్ అధ్యక్షుడు నిజంగా కలుస్తారా లేదా అన్న విషయంపై క్లారిటీ లేదు. ఇక ఇజ్రాయెల్, హెజ్‌బొల్లా మధ్య కాల్పుల విరమణను మరో మూడు వారాలు పొడిగిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడించారు. వైట్‌హౌజ్‌లో రెండు వర్గాలకు చెందిన ప్రతినిధులతో భేటీ అయిన తర్వాత ఆయన ఈ విషయాన్ని చెప్పారు. హెజ్‌బొల్లా, ఇజ్రాయెల్ మధ్య తొలి దశ చర్చలు ఏప్రిల్ 14వ తేదీన జరిగాయి. అయితే ఆ చర్చల తర్వాత 10 రోజుల పాటు సీజ్‌ఫైర్ ప్రకటించారు. మరోసారి వాషింగ్టన్‌లో ఇజ్రాయెల్, హెజ్బొల్లాలమధ్య అంటే లెబనాన్‌లమధ్య చర్చలుజరుగుతాయని ట్రంప్ వెల్లడించారు. ఉపాధ్యక్షుడు జెడివాన్స్ మాట్లాడుతూ ఇదొక చరిత్రాత్మక సంఘటన అని పేర్కొన్నారు. అధ్యక్షుడు ట్రంప్ నేరుగా రంగప్రవేశంచేసి ఇరుదేశాలను ఒకేవేదికపైకి తీసుకువచ్చారని, మూడువారాలు పొడిగించడం వల్ల ఇరుదేశాలకు దీర్ఘకాలిక ఒప్పందంపై చర్చించుకునేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. రెండుదేశాలు కూడా హెజ్బొల్లా సెక్యూరిటీపైనే ఆందోళన వ్యక్తంచేసారు. లెబనాన్ రాయబారి నదా హమాదే మోవాద్ అమెరికా మద్దతును స్వాగతించారు. మీ సాయం, మీ మద్దతుతో లెబనాన్‌ను మరింత సుస్థిరదేశంగా మార్చుకోగలమని ధీమా వ్యక్తంచేసారు. రెండుదేశాల సరిహద్దుల్లోనే హెజ్బొల్లా శక్తివంతంగాకొనసాగడంతో ఇపుడు కాల్పుల విరమణతో కొంతమేర ఉద్రిక్తతలు సదుమదమణుగుతాయని చెపుతున్నారు. ఇదిలా ఉంటే ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ ఆరాగ్చి అమెరికాతోజరిగే చర్చలకోసం పాకిస్తాన్‌కు చేరుకున్నారు. ద్వైపాక్షిక చర్చలతోపాటు ఇరాన్ అమెరికా చర్చల పురోగతిని కూడా ఈ సమావేశంలో సమగ్రంగా చర్చిస్తారని అంచనా. అమెరికా ప్రతినిధి బృందం కూడా ఇస్లామాబాద్‌కు చేరుకుంటుందని వైట్‌హౌస్ వర్గాలు స్పష్టంచేసాయి.

# 'ఆప్'కు భారీ షాక్

>> రాజ్యసభ ఛైర్మన్ సిపిరాధాకృష్ణన్‌కు అందచేసినట్లు రాఘవ్‌ఛద్దా తెలిపారు. బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్‌నబీన్‌ను ఐదుగురు ఎంపిలు కలిసారు. జాతీయ అధ్యక్షుడు వారిని సాదరంగా ఆహ్వానించారు. రాజ్యసభలో మూడింట రెండొంతుల మంది సభ్యులుగా ఉన్నామని అందువల్ల రాజ్యాంగంలోని ఉన్న మౌలిక సూత్రాలను అనుసరించి బిజెపిలో విలీనం చేసేందుకు నిర్ణయించామని, దీనివల్ల పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం తమకు వర్తించకుండా ఉంటుం దని రాఘవ్ తెలిపారు. పార్లమెంటులో రాఘవ్‌ఛద్దా చేసిన ప్రసంగాలకు మంచి స్పందన వచ్చింది. అయితే పార్టీ హైకమాండ్‌తో ఆయనకు విభేదాలు రావడంతో ఆయనకు మైకు ఇవ్వవద్దని, రాజ్యసభలో ఆప్ డిప్యూటీ నేతగా కూడా తొలగించి వేరొకరికి బాధ్యతలు అప్పగించడం వంటి చర్యలతో ఛద్దా విసిగిపోయారు. టైగర్ అభీ జిందాహై అన్న వ్యాఖ్యలతో సోషల్‌మీడియా పోస్టులతో ఆయన ఆప్ హైకమాండ్‌ను కూడా ఇరుకున పెట్టారు. అలాగే అప్పుడప్పుడూ పిక్చర్ అభీబాకీహై అంటూ కూడా ఆయన చేసిన సోషల్‌మీడియా పోస్టులు ఆప్ నాయకత్వాన్ని ఇరుకునపెట్టాయనే చెప్పాలి. ఈ పరిణామాలనేపథ్యంలో రాఘవ్ తనతోపాటు మరో ఇద్దరిని కలుపుకుని పార్టీకి రాజీనామాచేసి బిజెపిలో విలీనం కావాలని నిర్ణయికున్నట్లు ఆయన మీడియా మీట్‌తో వెల్లడి అయింది. ప్రస్తుతం రాజ్యసభలో ఆప్‌కు పదిమంది ఎంపిలున్నారు. ఆరుగురు ఎంపిలు పార్టీ మారటం ప్రస్తావించకుండా తమ గ్రూపును బిజెపిలో విలీనంచేసేందుకు రాజ్యాంగ ఉల్లంఘన కిందకు రాదని భావిస్తున్నారు. ఆప్ ఎంపిలు హర్భజన్‌సింగ్; స్వాతి మలివాల్, రాజేందర్‌గుప్తా, విక్రమ్ సాహ్నీ, అశోక్ మిట్టల్ సందీప్ పాఠక్‌లు రాఘవ్‌ఛద్దాతో కలిసి బిజెపిలో చేరేందుకు సిద్ధం అయ్యారు. రాఘవ్‌చద్దా మాట్లాడుతూ ఆమ్ ఆద్మీపార్టీకి 15 ఏళ్లపాటు తన జీవితం ఇచ్చానని ఆపార్టీ ఇపుడు నిజాయితీ రాజకీయాలను పక్కనపెట్టిందని, ఆ తప్పుడుపార్టీలో నేనొక్కడినే సరైన వ్యక్తిగా నిలిచానన్నారు. ప్రజలకు చేరువయ్యేందుకు తాను ఇపుడు ప్రత్యామ్నాయం ఆలోచిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడుగురు తర్వాత ఇపుడు రాజ్యసభలో కేవలం ముగ్గురే ఎంపిలుంటారు. సంత్ బల్‌బీర్‌సింగ్ సీచేవాల్, సంజయ్‌సింగ్; ఎన్‌డి గుప్తాలుంటారు. బిజెపిలో చేరిన తర్వాత రాఘవ్‌ఛద్దా బహుశా కేంద్ర మంత్రి అయ్యే అవకాశాలున్నాయి. పంజాబ్‌నుంచే వీరంతా రాజ్యసభ సభ్యులుగా ఎంపికయ్యారు. ఆప్ ఆవిర్భావంనుంచీ పార్టీలో ఉన్నారు. కేజ్రీవాల్‌కు నమ్మకస్తునిగా కొనసాగారు. 2015లో ఢిల్లీలో తుపానుతరహా విజయం సాధించిన తర్వాత పార్టీలోనే కొనసాగారు. గడచిన ఆరేడునెలల నుంచి తాను పార్టీకి రాజీనామాచేయాలని నిర్ణయించుకున్నట్లు సందీప్‌పాఠక్ సైతం చెప్పారు. చద్దా మీడియామీట్‌ను తెలుసుకున్న ఆప్ వెంటనే స్పందించింది. బిజెపి పంజాబ్ ఆప్‌ను ప్రలోభపెట్టిందని, మాజీనేత పార్టీవిద్రోహచర్యలకు పాల్పడుతున్నారని రాజ్యసభ ఎంపి సంజయ్‌సింగ్ వ్యాఖ్యానిం చారు. పంజాబ్‌లోని భగవంత్‌మాన్ సర్కారు మంచి పనులను బిజెపి అడ్డుకుంటున్నదని, ఇపుడు ఏడుగురు ఎంపిలను లాగేసుకుందని, పంజాబ్‌ప్రజలు వీరిని గుర్తుంచుకుంటారని, ఎప్పటికీ మరిచిపో రన్నారు. పార్టీ అధినేత కేజ్రీవాల్ ఒకే ఒక్క లైన్‌తో బిజెపిని విమర్శించారు. బిజెపి మరోసారి పంజాబీలకు ద్రోహంచేసిందని పోస్టుపెట్టారు. పంజాబ్‌ప్రభుత్వం రాఘవ్‌ఛద్దాకు జడ్‌ప్లస్ సెక్యూరిటీని కూడా ఉపసంహరించింది. వెనువెంటనే కేంద్ర హోంశాఖ స్పందించి రాఘవ్‌ఛద్దాకు సెక్యూరిటీ కవర్ ఏర్పాటు చేసింది.

# హైదరాబాద్‌లో మాజీ ఎంపి విజయసాయిరెడ్డి ఇంట్లో సోదాలు

**విజయవాడ,ఏప్రిల్ 24,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం కేసులో హైదరాబాద్‌లోని విజయసాయిరెడ్డి ఇంట్లో దాదాపు 13 గంటలపాటు సోదాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో ఈడీ సోదాల్లో నా వద్ద ఏమీ లభించలేదని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి అన్నారు. మా అమ్మ చికిత్స కోసం రూ.6 లక్షల ఉంచుకున్నానని ఈ సందర్భగా విజయసాయిరెడ్డి అధికారులకు వెల్లడించారు. ఈడీ అధికారులు నన్ను విచారణకు పిలిచే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. దీంతో పాటు జులైలో మళ్లీ రాజకీయాల్లోకి వస్తానని విజయసాయిరెడ్డి పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేయడం గమనార్హం. త్వరలో మీడియా రంగంలోకి వస్తానని ఆయన వివరించారు. ఏపీలో మరో రాజకీయపార్టీ ఆవిర్భవించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఎన్నికల్లో వైఎస్సార్సీపీకి ప్రజలు బుద్ధి చెప్పారని, వారు ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకోవాలని హితవు పలికారు. వైఎస్సార్సీపీ నేతలు ఇకనైనా ప్రజాసమస్యలపై దృష్టి పెట్టాలనే అభిప్రాయాన్ని విజయసాయిరెడ్డి వ్యక్తం చేశారు.

# ఆర్టీసీ చర్చలు సఫలం

>> అయ్యి తమ డిమాండ్లను తెలిపారు. జేఏసీ సంఘాలతో సీనియర్ ఐఏఎస్ కమిటీ సుదీర్ఘంగా చర్చలు జరిపింది. మధ్యాహ్నం లంచ్ బ్రేక్ తరువాత మరోసారి భేటీ అయ్యారు. ఆ తరువాత డిప్యూటీ సీఎం భట్టి, మంత్రుల బృందాన్ని కలిశారు. సచివాలయంలో జేఏసీ నేతలు 32 డిమాండ్లను మంత్రుల ముందుంచారు. 29 డిమాండ్లపై మంత్రుల బృందం సానుకూలంగా స్పందించింది. మూడు కీలక డిమాండ్లపై మంత్రులు, జేఏసీ నేతలు చర్చించారు. ఆర్టీసి ప్రభుత్వంలో విలీనం అంశంపై ప్రభుత్వం కమిటీ వేసేందుకు ముందుకు రాగా, అందుకు జేఏసీ నేతలు అంగీకరించినట్లు సమాచారం. ఆర్టీసి కార్మికుల సంఘాల ఎన్నిలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ఆర్‌టీసీ కార్మికుల సమ్మెలో ప్రభుత్వంతో జేఏసీ నాయకుల చర్చల్లో వేతన సవరణ కీలక అంశంగా మారింది. వేతన సవరణకు మూడు ప్రతిపాదనలతో ఆర్‌టీసీ యాజమాన్యం ముందుంచింది జేఏసీ. కార్మికుల 2021, 2025 వేతన సవరణ అమలు చేయాలని జేఏసీ కోరింది. 2021 సవరణపై మాత్రమే ఆర్‌టీసీ యాజమాన్యం మూడు రకాల ప్రతిపాదనలను రూపొందించింది. గరిష్ఠంగా 10 శాతం ఫిట్‌మెంట్‌తో, కనిష్ఠంగా 5శాతంతో, మధ్యస్తంగా 8 శాతంతో వేతన సవరణ చేయాలని తెలిపింది. ఈ ప్రతిపాదనలు ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి కార్యాలయానికి కూడా పంపించినట్టు తెలుస్తోంది. ఆర్థికపరమైన అంశాలతో పాటు ఉద్యోగ భద్రత, కొత్త బస్సుల కొనుగోలు, మహిళా ఉద్యోగుల టైమింగ్స్ వంటి 32 అంశాలను ఉన్నతాధికారుల కమిటీ ముందు కార్మిక సంఘాలు పెట్టాయి. వాటిలో ముఖ్యమైనవి .. 30 శాతం ఫిట్‌మెంట్‌తో 2021 కార్మికుల వేతన సవరణ బకాయిలు చెల్లించాలి. 2025 వేతన సవరణను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతాలు చెల్లించాలి. ప్రభుత్వ సర్వీసులో ఆర్‌టీసీ ఉద్యోగులందరినీ విలీనం చేయాలి. ప్రస్తుత కార్పొరేషన్‌లో అమలు చేస్తున్న సౌకర్యాల్ని కొనసాగించాలి. ఆర్‌టీసీ రుణాలను ప్రభుత్వమే టేకోవర్ చేయాలి. రోడ్డు రవాణా సంస్థను ఆధునికీకరించాలి. 2017 నుంచి అలవెన్సులు, ఫ్రింజ్ బెనిఫిట్లు పెంచి, వేతన సవరణ బకాయిల్ని వెంటనే చెల్లించాలి. రిటైర్డ్ ఉద్యోగులకు 2017 వేతన సవరణ అమలు చేయాలి. వారి బకాయిల్ని కూడా త్వరగా చెల్లించాలిఆర్టీసీ యాజమాన్యం వాడుకున్న కార్మికుల సీసీఎస్, పీఎఫ్, ఎస్ఆర్‌బీఎస్ నిధుల్ని తక్షణమే విడుదల చేయాలి. సీసీఎస్‌లో పాలకమండలి ఎన్నికల్ని నిర్వహించి నియమించాలి. అన్ని కేటగిరీల్లో ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలి. అర్హులకు ప్రమోషన్ ఇవ్వాలి వంటి పలు డిమాండ్లను జేఏసీ నేతలు ప్రభుత్వం, ఆర్‌టీసీ యాజమాన్యం ముందుంచింది. మొత్తంగా చర్చలు సానుకూలంగా కొనసాగాయి. ఆర్‌టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి చాలా బాధాకరమని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఇలాంటి విషాదకర సంఘటనలు పునరావృతం కాకుండా కార్మికులకు పిలుపునిద్దామన్నారు.

## వారం - వర్జ్యం

25-04-2026, శనివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
వైశాఖమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, శుక్లపక్షం, అశ్విని కార్తె
నవమి సా.6.32
ఆశ్లేష రా.8.08
వర్జ్యం : ఉ.9.01-ఉ.10.36
దు.తె.5.45-ఉ.7.24
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం:** ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. ఉద్యోగస్థులకు కార్యాలయంలో అధికారుల మెప్పు లభిస్తుంది.

**వృషభం:** ముఖ్యమైన బరువు బాధ్యతలు నెరవేర్చుకోగలుగుతారు. నూతనవ్యక్తులు పరిచయమై సాయం అందిస్తారు.

**మిథునం:** బంధువుల నుండి కీలక సమాచారం అందుకుంటారు. సభలు, సమావేశాలలో చురుకుగా పాల్గొంటారు.

**కర్కాటకం:** ప్రత్యర్థులు సైతం మిత్రులుగా మారతారు. జీవితభాగస్వామి సలహాతో కీలక నిర్ణయాలు తీసుకొంటారు.

**సింహం:** అదృష్టాన్ని బలంగా నమ్ముతారు. భార్య వైపు బంధువులకు సహాయము చేస్తారు. పెట్టుబడులకు తగిన లాభాలు.

**కన్య :** అధిక ధనవ్యయాన్ని సూచిస్తున్నప్పటికీ ఆర్థికపరమైన సరుబాట్లను చాకచక్యంగా చేయగలుగుతారు.

**తుల :** మీ సామర్థ్యాన్ని నిరూపించుకోవడానికిగాను కొత్త అవకాశాలు కలిసి వస్తాయి.వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.

**వృశ్చికం:** ఇప్పుడు చేస్తున్న ఉద్యోగాన్ని గాక మంచి హోదా కలిగిన మరో ఉద్యోగాన్ని చేయాలన్న ఆలోచనలు మనస్సులో మొదలుతాయి.

**ధనుస్సు:** ఆరోగ్యపరంగా అన్నివిధాల జాగ్రత్తలు తీసుకోవాలని మీరు భావించినప్పటికి కార్యచరణలో పెట్టరు.

**మకరం :** స్నేహితుల సహకారము పూర్తిగా లభించుటవలన కొన్ని కార్యక్రమములలో విజయమును చవిచూస్తారు.

**కుంభం:** అధికారుల అండదండలు లభించుటవలన వృత్తియందు రాణించగలుగుతారు. కుటుంబ పురోగతి బాగుంటుంది.

**మీనం:** భవిష్యత్తుకు సంబంధించి ఉపకరించే అతి కీలకమైన ఒప్పందాలు కుదుర్చుకునేటప్పుడు నిష్ణాతుల పర్యవేక్షణలో చేస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

వార్త

జీవితానికి విశ్వాసం పునాదిలా ఉండాలి. విశ్వాసం లేకుండా ఏ పని చేసినా వ్యర్థమే.

- మార్షల్

# చెదరిన 'డాలర్ డ్రీమ్స్'

భారతీయుల 'డాలర్ డ్రీమ్స్' నానాటికీ కరిగిపోతున్నాయి. ఎలాగైనా ఉన్నత చదువుల కోసం అమెరికాకి ఎగిరిపోవాలన్న భారతీయ విద్యార్థులకు అదే ఆశ, అదే శ్వాస, భారతీయ యువతలో ఉన్న విదేశీ ఆకాంక్షలు ప్రత్యేకించి అమెరికా పట్ల ఆకర్షణలను ఎంత సామాజిక, ఆర్థిక కోణాల్లో విశ్లేషించుకున్నా విదేశాలకు వెళ్లిన వారికి వెళ్లినంత సంపద మహదేవా? అని అనుకోవడం కద్దు. భారతదేశంలో ఏమోకానీ అమెరికాలో ఉపాధికి ఎన్నో అవకాశాలుంటాయని ప్రతీతి. అందుకేనేమో అక్కడకు విద్యార్థిగా వెళ్లినవారుఅక్కడే సెటిల్ అయిపోతుంటారు. కన్న తల్లిదండ్రులను ఊర్లోనే వారి కర్మకు వారిని వదిలిపెట్టి అమెరికా వంటి దేశాల్లోనే జీవితాంతం ఉండిపోయేవారి కథలెన్నో మనకు తెలుసు. తమకేదైనా తమ పిల్లలు బాగుగా బతుకుతున్నారు. నాలుగు రాళ్లు వెనకేసుకోగలుగుతున్నారు. పొలం పుట్రా జమ చేసుకుంటున్నారని ఉన్న ఊళ్లోనే కన్ను మూసేద్దాం. అదే తమ జీవనంలో తృప్తినిస్తుందని అనుకునే అమ్మానాన్నలూ ఉన్నారు. వారలా తయారవడానికి కారణం అమెరికా సంపద మీద ఆశ పుట్టడమే. ఎంత చదివినా స్వదేశంలో ఉంటే మనం చదివిన చదువులకు ఎలాగో తగిన జీతం రాదు కనుక విదేశానికి వెళ్లిపోయేవారే ఎక్కువ. ఇన్నాళ్లూ ఇలాంటి అంశాలను తర్కించుకుంటూ భారతీయులు కాలం గడిపేశారు. 'అమెరికా ఉద్యోగాలు అమెరికన్లకే'నంటూ గద్దెనెక్కిన శ్వేతసౌధాధినేత డోనాల్డ్ ట్రంప్ అధ్యక్ష పదవి ఎన్నికల్లో 'అమెరికా ఫస్ట్' నినాదంతో గట్టెక్కారనే విషయం అందరికీ తెలిసిందే. నిజానికి 'డాలర్ డ్రీమ్స్' అంటే ఒక్క అమెరికాకు మాత్రమే సంబంధం కాదు. భారతీయులు ఎంతో మంది అమెరికా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, సౌదీ అరేబియా, మలేషియా, యునైటెడ్ కింగ్‌డమ్, కెనడా, దక్షిణాఫ్రికా, కువైట్, ఖతార్, ఆస్ట్రేలియా దేశాలకు కూడా ఉన్నత చదువులకు, ఉత్తమ జీవితం గడిపేందుకని వలస వెళ్తున్నారు. కానీ ఒక్క అమెరికా విషయంలోనే భారతీయుల ఆలోచన భిన్నంగా ఉంది. అదొక భూతల స్వర్గమని అక్కడి జీవితం ఎంతో హాయిగా ఉంటుందని భావిస్తుంటారు. ఒకసారి అమెరికా దేశంలో అడుగుపెడితే అంతిమ క్షణాలు కూడా అక్కడే ఉండాలని ఆశిస్తారు. సొంత వూరికి తిరిగి రావడం గగనమే. చదువు, ఉద్యోగం, స్థిరనివాసం భావనలో అమెరికా పైనే అందరి కన్ను ఉంటుంది. అక్కడ వీలుండదని భావిస్తేనే మరోదేశం గురించి ఆలోచించేది. చెప్పాలంటే హైస్కిల్‌డు ప్రొఫెషనల్స్ అంతా అమెరికా వైపు చూస్తుంటారు. కానీ ట్రంప్ మాత్రం భారతీయులు అమెరికన్ల కన్నా తెలివైన వారు కనుక వారిలో హైస్కిల్‌డును మాత్రమే ఉంచుకోగలమని తేల్చి చెప్పేశారు. అప్పట్నించీ భారతీయుల్లో గుబులు బయలుదేరింది. ప్రధానంగా తెలుగు వారిలో తాజాగా వాషింగ్టన్ డిసి కేంద్రంగా పనిచేసే కార్నెగీ ఎండోమెంట్ అనే సంస్థ చేసిన సర్వేలో 40 మంది ప్రవాస భారతీయులు అమెరికాను వీడాలనే ఆలోచనలతో ఉన్నట్లు స్పష్టంచేసింది. ఆ సర్వే ఎలాంటి ప్రమాణికతతో చేసినా ఎంత మంది నమూనాలు ఆధారంగా ఫలితాలను విశ్లేషించినా వారినివేదికలో వాస్తవాలే ఉన్నాయి. విదేశాల్లో నిత్యం అసహనం వ్యక్తం చేస్తున్న వారి తల్లిదండ్రులు ఇండియా తదితర దేశాల్లోనేఉన్నారు. వారి అభిప్రాయాలు అడిగినా పై విశ్లేషణకు దగ్గరగానే ఉంటుంది. అమెరికాను వీడి స్వదేశాలకు తరలి వచ్చేద్దామనుకున్న వారిలో పది శాతం మంది తమను స్థానిక పరిస్థితుల కన్నా రాజకీయ కారణాలే ఇబ్బందిపెడ్తున్నట్లు చెప్పారు. ప్రధానంగా జీవన వ్యయం, వ్యక్తిగత భద్రత విషయంలో వారు ఆందోళనకరంగా ఉన్నారు. ఆదినుంచీ విదేశాల్లో స్థిరపడాలన్న ఆలోచన రావడానికి డాలర్లలో సంపాదన, ఉన్నత జీవన ప్రమాణాలు వంటి అంశాలే ప్రధాన కారణాలు. ట్రంప్ అధికారంలోకి వచ్చాక ఇమిగ్రేషన్ విధానాలు మారాయి. హెచ్1బి వీసా పరిమితులు, విదేశీ ఉద్యోగులపై కఠిన నిబంధనలు, అనుసరించని వారిపై తీవ్ర చర్యలు, అమెరికాలో స్థిరపడితే మంచిజీతం, జీవితం లభిస్తుందని ఆశించేవారి ఆశయాలను సవాల్ చేస్తున్నాయి. విదేశీ వలసవాదులకు విధం చెడ్డా ఫలితం దక్కలేదన్న విషయం అవగతమైంది. వారు గ్లోబల్ అవకాశాలను అన్వేషించడంలో తప్పులేదు. కానీ అప్పుడు స్వదేశాన్ని ఇప్పుడు విదేశాన్ని వదిలిపెట్టే ఆలోచనలు కాలానుగుణమే. ఎన్నాళ్లుగానో అమెరికాలో ఉండి గ్రీన్ కార్డు పొందడం కోసం పడిన శ్రమ అంతాఇంతా కాదు. వారిలో కూడా విభిన్న అభిప్రాయాలు వ్యక్తమౌతున్నట్లు ఆ నివేదిక చెబుతోంది. దీనికితోడు ట్రంప్ నోట మరి కొన్నిగందరగోళ వాక్యాలు బహిర్గతమవడం కూడా కొంత అసహనం కలిగిస్తోంది. ఇండియా, చైనాలు భూమిపై నరక కూపాలని విమర్శిస్తూ అమెరికన్ వీడియో హోస్ట్ మైఖేల్ సావేజ్ సోషల్ మీడియాలో షేర్ చేసిన లేఖను ట్రంప్ తన 'ట్రూత్' సోషల్ ఖాతాలో రీపోస్ట్ చేసి భారతీయులపై తనకున్న దుగ్ధను వెళ్లగక్కారు. ఆసియా దేశాలనుంచి మహిళలు గర్భవతిగా అమెరికాకు వచ్చి జన్మ నిచ్చిన బిడ్డకు పౌరసత్వం ఇచ్చేయాల్సివస్తోందన్న ఆందోళన ఆయనలో ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. ఆ వెంటనే తమ కుటుంబాన్ని మొత్తం అమెరికాలో దింపేస్తారు. ఇవీట్రంప్ రీపోస్ట్ నుంచి వచ్చిన ఆయన వాచాలత స్పష్టంగా కనబడుతోంది. 'జన్మతః పౌరసత్వం' పట్ల ఆయన ఆదినుంచీ వ్యతిరేకతలు వ్యక్తం చేస్తూనే ఉన్నారు. పశ్చిమాసియా యుద్ధం ముగిసాక ఆయన చేపట్టే ఘనకార్యం ఏదైనా ఉందా అంటే అది ఈ పౌరసత్వ చట్టానికి 'కొర్రీ'లు పెట్టడమే. ఈ వివాదాస్పదమైన వాగ్ధాటికు ఆయన మళ్లీ నాలుక్కరుచుకోవడం కొసమెరుపు. ఇలాంటి వ్యక్తి రాజ్యంలో మనగలగడం ఎవరికీ క్షేమమూ కాదు. సంక్షేమమూ ఒనగూరదు. తాజాసర్వేలో తేలిందేమిటంటే భారతీయుల్లో స్వదేశీ మోజు తగ్గుతోందని అర్థం చేసుకోవచ్చు.

చేయగలిగే శక్తి ఉన్నవాడికంటే, చేయాలనే కోరిక ఉన్నవాడు ఎక్కువ చేయగలుగుతాడు.



జి.ముర్రే

బలహీనతకి పరిష్కారం దాని గురించి చింతించడం కాదు, బలం పెంచుకోవడం గురించి ఆలోచించడం.



జార్జి ఎలియట్

# నిరాశానిస్పృహాల్లో యువజనం!

**చదివిన చదువుకు తగినట్టుగా ఉపాధి దొరక్కపోయినా జీవించేందుకు అవసరమైన కనీస సంపాదనకు సైతం నోచుకొని దుర్భర పరిస్థితుల్లో కొట్టుకమిట్టాడుతున్నారు. డిగ్రీ, పోస్టుగ్రాడ్యుయేషన్, ఇంజినీరింగ్ తదితర ప్రొఫెషనల్ కోర్సులు పూర్తిచేసి గ్రామాల్లో రోజువారీ వ్యవసాయ కూలీకి వెళ్లలేక, ఒకవేళ పరిస్థితుల ప్రభావంతో విధిలేక వెళ్లినా అలవాటు లేని కష్టం చేయలేక దేశవ్యాప్తంగా కోట్లాది మంది యువతీయువకులు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. పనిచేసే శక్తి ఉంది. ఉన్నంతలో కొద్దోగొప్పో మేధాశక్తి ఉంది. కష్టపడి పనిచేయాలన్న ఉత్సాహం ఉంది. సంఘంలో తమకు ఒకస్థానం కల్పించుకోవాలన్న తపన ఉంది. కానీ ఏ ఆధారం లేక నిరుత్సాహంగా, అర్థాకలితో అసంతృప్తితో అల్లాడిపోతున్నారు.**

దామెర్ల సాయిబాబ

## ఒక్క మాట

చేయబోయే పనిని గురించి తెలుసుకోవడం వివేకం. ఎలా చేయాలో తెలుసుకోవడం నైపుణ్యం. పూర్తి చేయడం సామర్థ్యం. ఈ మూడింటిలోనూ సాఫల్యం చెందితేనే పరిపూర్ణత లభిస్తుంది. అనుకున్న లక్ష్యాలు సాధించగలుగుతారు. దేశంలో కోట్లాది మంది యువతీ యువకులు నిరాశానిస్పృహాలతో నీరసించిపోతున్నారనేది పెద్దలకు తెలియందికాదు. వారిలో ఉత్సాహం నింపి జీవితం పట్ల ఆశలు రేకెత్తించి కార్యోన్ముఖున్ని చేసేందుకు తీసుకోవాల్సిన చర్యల గూర్చి పెద్దలకు క్షుణ్ణంగా తెలుసు. కానీ ఆ వైపు త్రికరణ శుద్ధిగా అడుగులు పడడం లేదేమోననిపిస్తున్నది. రాజకీయ నాయకులు రాబోయే ఎన్నికల గురించే ఆలోచిస్తే, రాజనీతిజ్ఞులు భావితరాల భవిష్యత్ గురించి మదన పడుతుంటారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి లక్షలాది కోట్ల రూపాయలు వెచ్చించారు. కానీ మారిన కాలానుగుణ పరిస్థితుల దృష్ట్యా ప్రధానంగా విద్యావిధానంలో మార్పు చేయాల్సిన అవసరం ఉందని స్పష్టంగా తెలిసినా, ఆ కోణంలో చర్యలు చేపట్టలేకపోతున్నారు. చాలా మంది విషయంలో చదువే చదువుకు జీవనోపాధికి సంబంధం లేకుండాపోతున్నది. ఈ పరిస్థితి రానురాను పెరిగిపోతుండడం ఆందోళన కలిగిస్తున్నది. ఎన్నో యేళ్లు కష్టపడి ఇంజినీరింగ్ విద్య అభ్యసించిన ఎందరో నిరుద్యోగులుహోంగార్డు పోలీసు ఉద్యోగాలకు వెళ్తున్నారు. ఏదో ఒకరిద్దరు కాదు, వేల సంఖ్యలో ఈనియామకాలకు హాజరవుతున్నారు. పోస్టుగ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారు కూడా చిన్నచిన్న ఉద్యోగాలకు క్యూ కడుతున్నారు. అంతేకాదు చిన్న చిన్న తాత్కాలిక ఉద్యోగాల కోసం లక్షలాది రూపాయలు ఖర్చు చేసేందుకు కూడా సిద్ధమవుతున్నారు. దళారుల చేతుల్లో మోసపోయినవారెందరో ఉన్నారు. అన్నిటికంటే ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగం అనేది ఒక బంగారు కొలువుగా మారిపోయింది. ఆ ఉద్యోగంలో చేరితే ఆ కుటుంబానికి ఆర్థిక, ఆరోగ్య, ఆర్థికసెక్యూరిటీ లభిస్తాయని ఆశలు పెరిగిపోయాయి. అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగాల నియామకాలకు సంబంధించి ప్రకటనలు ఇస్తూనే ఉన్నాయి. కొంత మేరకు నియామకాలు కూడా జరుగుతున్నాయి. ఈ ఉద్యోగాల కోసం గ్రామాల్లోని యువత పట్టణాలకు చేరుకొని కోచింగ్ సెంటర్ల బాటపడుతున్నారు. వేలాది రూపాయలు వ్యయం చేస్తున్నారు. దీన్ని సొమ్ము చేసుకునేందుకు కొన్ని కోచింగ్ సెంటర్లు తమ శక్తి కొలదీ ప్రయత్నాలు చేస్తున్నాయి. పరీక్షలు ఆలస్యమయ్యే కొద్దీ ఈ కోచింగ్ సెంటర్లకు అంతగా లక్ష్మీప్రసన్నం అవుతుంది. ఉన్నత విద్య, అత్యున్నత నైపుణ్యం కలిగిన వారు ఉన్నత స్థాయిలో ఉద్యోగాలు సంపాదించుకొని కళ్ల చెదిరే జీతాలు అందుకుంటుంటే అదే చదువులు చదివి నైపుణ్యత లేని యువకులు చాలీచాలని జీతాలతో ఎదుగూబొదుగూ లేని ఉద్యోగాలతో జీవనం సాగిస్తున్నారు. ఇటీవల కాలంలో పెరుగుతున్న స్విగ్గీ, బిగ్‌బాస్కెట్, జొమోటో, అమెజాన్ తదితర యాప్ ఆధారిత సర్వీస్ రంగంలో లక్షల సంఖ్యలో దేశవ్యాప్తంగా యువతీయువకులు పనిచేస్తున్నారు. నిర్ణీత పనిగంటలు లేని ఉద్యోగాలవి. అర్థరాత్రి కూడా పనిచేయాలి. వీరి జీవితాలకు భద్రత లేదు. ఎంత పనిచేస్తే అంత ఆదాయం అనేఆకర్షణ చూపి వీరిని ఉద్యోగాల్లోకిదింపుతున్నారు. సాంకేతిక పరిజ్ఞానం మాయాజాలంతో పనిచేసే కొద్దీ ఆదాయం తగ్గిపోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. చెప్పిన సమయానికి డెలివరీ ఇవ్వాలంటే ట్రాఫిక్ అధికంగా రోడ్లల్లో కూడా మితిమీరిన వేగంతో తమ వాహనాలను పరుగెత్తించాలి. ప్రాణాలకు ముప్పు జరిగిన సంఘటనలు కూడా ఉన్నాయి. మరోకపక్క పోలీసు ఛాలాన్లు కూడా చెల్లించాల్సి వస్తున్నది. డెలివరీ ఇచ్చే ఇళ్లకు వెళ్లినప్పుడు కనీస మర్యాదలు కూడా లభించడం లేదు. వీరిపట్ల కొందరు అమర్యాదకరంగా కఠినంగా ప్రవర్తిస్తున్నారు. అయినా ఏమీ చేయలేని నిస్సహాయస్థితి. ఇలా చెప్పుకోలేని, చెప్పలేని బాధలెన్నో వారు అనుభవిస్తున్నారు. ఇంకొక పక్క ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా, దళారుల ప్రమేయానికి ఆస్కారం లేకుండా ఈ ఉద్యోగాల ఎంపిక ప్రక్రియ పూర్తి చేసేందుకు ప్రభుత్వాలు ప్రయత్నించేస్తున్నా శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలన్నట్లు దళారులు ఏదో ఒక రూపంలో ఎక్కడో ఒక చోట చొచ్చుకుపోయేందుకు ప్రయత్నిస్తూనే ఉన్నారు. తెలంగాణలోనే కాదు అనేక రాష్ట్రాల్లో ప్రశ్నపత్రాల వ్యాపారం జోరుగా జరుగుతున్నట్లు వెలుగు చూస్తున్న సంఘటనలు చెప్పకనే చెబుతున్నాయి. ఇక దేశవ్యాప్తంగా కోట్లాది మంది ఉద్యోగాల కోసం ఎదురుచూస్తుంటే ప్రభుత్వాల పరిధిలోని పది, పన్నెండు లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కాదు. కోట్లాది మంది యువతీ యువకులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించడమనేది సాధ్యమయ్యే పనికాదు. అలా కోరుకోవడం కూడా ఏమాత్రం సమంజసం కాదు. యువత భవిష్యత్ గురించి పెద్దపెద్ద ప్రకటనలు ఇచ్చే నేతలు ఆచరణలో మొండిచూపు చూస్తున్నారు. యువజనశక్తులే దేశాభివృద్ధికి బాటలు అంటూ ఉపన్యాసాలు ఇస్తూ దేశవ్యాప్తంగా వేలాది కోట్ల రూపాయలు యువజన సంక్షేమంకోసం వెచ్చిస్తున్నట్లు ప్రకటిస్తున్నా ఆశించిన ఫలితాలు చేకూరడం లేదు. ఎవరు అంగీకరించినా, అంగీకరించకపోయినా యువజనంలో రోజురోజుకు నిరుత్సాహం పెరిగిపోతున్నది. నిరక్షరాస్యులైన యువకులే కాదు ఉన్నత చదువులు అభ్యసించిన వారు కూడా నిరాశానిస్పృహలకు లోనవుతున్నారు. దేశప్రగతికి పట్టుకొమ్మలైన గ్రామీణ ప్రాంతంలో ఉన్న యువత పరిస్థితి మరింత దారుణంగా తయారవుతున్నది. చదివిన చదువుకు తగినట్టుగా ఉపాధి దొరక్కపోయినా జీవించేందుకు అవసరమైన కనీస సంపాదనకు సైతం నోచుకొని దుర్భర పరిస్థితుల్లో కొట్టుకమిట్టాడుతున్నారు. డిగ్రీ, పోస్టుగ్రాడ్యుయేషన్, ఇంజినీరింగ్‌తదితర ప్రొఫెషనల్ కోర్సులు పూర్తిచేసి గ్రామాల్లో రోజువారీ వ్యవసాయ కూలీకి వెళ్లలేక, ఒకవేళ పరిస్థితుల ప్రభావంతో విధిలేక వెళ్లినా అలవాటు లేని కష్టం చేయలేక దేశవ్యాప్తంగా కోట్లాది మంది యువతీయువకులు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీకావు. పనిచేసే శక్తిఉంది. ఉన్నంతలో కొద్దోగొప్పో మేధాశక్తి ఉంది. కష్టపడి పనిచేయాలన్న ఉత్సాహం ఉంది. సంఘంలో తమకు ఒకస్థానం కల్పించుకోవాలన్న తపన ఉంది. కానీ ఏ ఆధారం లేక నిరుత్సాహంగా, అర్థాకలితో అసంతృప్తితో అల్లాడిపోతున్నారు. ఇకపోతే మెడికల్ ఇంజినీరింగ్‌లో అత్యంత ప్రతిభావంతులైన మెరికల్లాంటి యువతీయువకులు ఇప్పటివరకు విదేశాలకు వెళ్లిపోయి తమ విజ్ఞానాన్ని మరింతగా పెంపొందించుకొని అక్కడే సేవలు అందిస్తున్నారు. అయితే ఇప్పుడు వారి పరిస్థితి కూడా అయోమయంగా మారిపోయింది. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ రెండోసారి బాధ్యతలు స్వీకరించిన తర్వాత స్థానికులకే ఉద్యోగాల్లో ప్రాధాన్యత ఇవ్వాలంటూ గళమెత్తారు. ఒక దశలో విదేశీ విద్యార్థులను ఉద్యోగాల్లో నియమించుకోవద్దని బహిరంగంగానే హెచ్చరికలు జారీ చేస్తున్నారు. దీనికితోడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రవేశంతో అవకాశాలు బాగా దెబ్బతిన్నాయి. ఇప్పటికే ఎంతో మంది అమెరికా నుండి భారత్‌కు వచ్చేస్తున్నారు. అక్రమ వలసదారుల పేరుతో అమర్యాదకరంగా వారిని స్వదేశాలకు తరలిస్తున్నారు. ఇటీవల జరుగుతున్న ఇరాన్, అమెరికా యుద్ధ ప్రభావంతో పశ్చిమాసియా దేశాల నుండి విదేశీయులు తమతమ దేశాలకు తరలిపోయారు. ఆస్ట్రేలియాలో పరిస్థితి కూడా ఏ మాత్రం ఆశాజనకంగా లేదు. భారత సంతతికి సంబంధించిన యువకుడిని మొన్న హత్య చేయగా, దేశం నుంచి వెళ్లిపోవాలంటూ పోస్టర్లు పెడుతున్నారు. యుద్ధాలతో అతలాకుతలమవుతున్న ఆయా దేశం నుంచి ఉద్యోగస్తులనే కాదు, విద్యార్థులను సైతం పంపిస్తున్నారు. పాలకులకు ఈ విషయాలన్నీ తెలియనివి కావు. అయినా చర్యలు తీసుకునే సాహసం చేయలేకపోతున్నారు. అందుకు రాజకీయ కారణాలు ఎన్నో ఉన్నాయి. ఇదంతా లేత మనసులకు చెరగని ముద్ర వేస్తున్నది. సమాజంపై ప్రేమ, అభిమానం ఉన్న యువకులే పగ, ద్వేషంతో రగలిపోతున్నారు. మరి కొందరు నిస్సహాయక స్థితిలో ఏకంగా జీవనోపాధి దొరకదనే నిస్పృహతో ఆత్మహత్య చేసుకుంటున్నట్లు లేఖలు రాసి బలవంతపు మరణాలకు పాల్పడుతున్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర పాలకులు కళ్లు తెరవాలి. యువతీయువకుల్లో ఆత్మవిశ్వాసం పెంచాలి. ఇందుకు ముఖ్యంగా పాలకుల వైఖరిలో మార్పు రావాలి. యువతీయువకులు సంక్షేమ కార్యక్రమాలు, ఉద్యోగాల నియామకాల్లో త్రికరణశుద్ధిగా అవినీతికి ఆస్కారం లేకుండా వ్యవహరించగలిగితే కొంత మేరకైనా లక్ష్యాన్ని సాధించే అవకాశాలు ఉన్నాయి. ●

# సంక్షోభ పరిష్కారానికి గాంధీ సిద్ధాంతాలే కీలకం


సిహెచ్ వి ప్రభాకర్ రావు

ప్రస్తుతం భారతదేశం ఒక కీలక మలుపులో ఉంది. ఒక వైపు వేగంగా పెరుగుతున్న ఆర్థిక వ్యవస్థ, డిజిటల్ విప్లవం, గ్లోబల్ స్థాయిలో పెరుగుతున్న గుర్తింపు, మరో వైపు నిరుద్యోగం, ఆదాయ అసమానతలు, రాజకీయ విభజనలు, సామాజిక అసహనం. ఈ విరుద్ధ పరిస్థితుల్లో మహాత్మాగాంధీ ఆలోచనలు కేవలం చరిత్ర కాదు ప్రస్తుతం అవసరమైన దిశానిర్దేశం. ఇటీవలి సంవత్సరాల్లో దేశఆర్థిక వృద్ధి శాతం పెరిగినా, 'జాబ్స్ గ్రోత్' అనే సమస్య స్పష్టంగా కనిపిస్తోంది. పెద్దపెద్ద ప్రాజెక్టులు, కార్పొరేట్ పెట్టుబడులు పెరుగుతున్నప్పటికీ, సాధారణ యువతకు స్థిరమైన ఉపాధి అవకాశాలు తక్కువగా ఉన్నాయి. స్టార్టప్స్, గిగ్ ఎకానమీ వంటి కొత్త రంగాలు వచ్చినా, అవి ఎక్కువగా అస్థిర ఉపాధినే కల్పిస్తున్నాయి. గాంధీజీ ప్రతిపాదించిన 'గ్రామ స్వరాజ్యం' ఇక్కడ కీలకంగా మారుతుంది. గ్రామ స్థాయిలో చిన్న పరిశ్రమలు, వ్యవసాయ ఆధారిత వ్యాపారాలు, స్థానిక ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇస్తే ఉపాధి విస్తరణ సాధ్యమవుతుంది. 'లోకల్ ఫర్ వోకల్' వంటి నినాదాలు గాంధీ ఆలోచనలకు సమకాలీన రూపం మాత్రమే. సమకాలీన ఆర్థిక వ్యవస్థలో ధనిక, పేద, మధ్య అంతరం విపరీతంగా పెరుగుతోంది. కొద్దిమంది చేతుల్లో సంపద కేంద్రీకృతమవుతుండగా, పెద్ద జనాభా జీవన ప్రమాణాలు మెరుగుపడటం లేదు. గాంధీజీ ట్రస్టీషిప్ సిద్ధాంతం ఈ సమస్యకు ప్రత్యామ్నాయం చూపుతుంది. సంపదను వ్యక్తిగత స్వార్థం కోసంకాకుండా సమాజ ప్రయోజనాలకు ఉపయోగించాలనే భావనను కార్పొరేట్ ప్రపంచం స్వీకరించాలి. సిఎస్ఆర్ కార్యక్రమాలు, సామాజిక బాధ్యత భావన ఇవి గాంధీ ఆలోచనల ఆధునిక రూపాలు కావచ్చు. రాజకీయ ధోరణులు, విభజన నుంచి ధృవీకరణ వరకు ప్రస్తుత రాజకీయాల్లో మతం, కులం, ప్రాంతం ఆధారంగా విభజన పెరుగుతోంది. సోషల్ మీడియా ప్రభావంతోతప్పుడు సమాచారం వేగంగా వ్యాప్తి చెందుతూ, ప్రజల మధ్య అనుమానాలు, ద్వేషం పెరుగుతున్నాయి. ఎన్నికల రాజకీయాలు ఎక్కువగా భావోద్వేగాలపై నడుస్తున్నాయి. గాంధీజీ సర్వమత సమానత్వం, సత్యం ఆధారిత రాజకీయాలు ఈ పరిస్థితిలో అత్యవసరం. రాజకీయ నాయకత్వం ప్రజలను కలిపే దిశగా ఉండాలి. కానీ విభజించే దిశగా కాదు. ప్రజాస్వామ్యం బలపడాలంటే నైతిక విలువలు రాజకీయాల్లో తిరిగి స్థిరపడాలి. నేటి యువతకు అవకాశాలు ఎక్కువగా ఉన్నప్పటికీ, దిశానిర్దేశం లోపిస్తోంది. సమకాలీన అభివృద్ధి పట్టణాలకు మాత్రమే కేంద్రీకృతమవుతోంది. గ్రామాలుఇంకా మౌలిక సదుపాయాల కొరతతో బాధపడుతున్నాయి. ఫలితంగా వలసలు పెరుగుతున్నాయి, పట్టణాల్లో ఒత్తిడి పెరుగుతోంది. గాంధీజీ గ్రామ స్వరాజ్యం భావనను ఆధునిక సాంకేతికతతో కలిపి అమలుచేస్తే, గ్రామాలు కూడా అభివృద్ధి చెందవచ్చు. డిజిటల్ కనెక్టివిటీ, గ్రామీణపరిశ్రమలు, వ్యవసాయ ఆధునీకరణ. ఇవి గ్రామాభివృద్ధికి దోహదం చేస్తాయి. గ్లోబల్ పరిస్థితులు ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలు, ఆర్థిక అస్థిరత, పర్యావరణ సంక్షోభాలు పెరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో గాంధీజీ అహింసా సిద్ధాంతం మరింత ప్రాముఖ్యత పొందుతోంది. ఆయుధపోటీకి బదులుగాశాంతి, సంభాషణ మార్గం అనుసరించాల్సిన అవసరం ఉంది. సమకాలీన రాజకీయ ఆర్థికపరిస్థితుల్లో గాంధీజీ ఆలోచనలు కేవలం ఆదర్శాలు కాదు, ఆచరణలో పెట్టాల్సిన అవసరాలు. ఉపాధి సంక్షోభం, అసమానతలు, రాజకీయ విభజనలు, యువతలో నిరాశ ఈ సమస్యలకు గాంధీ సిద్ధాంతాలు సమగ్ర పరిష్కారం చూపగలవు. భారతదేశం నిజమైన అభివృద్ధి సాధించాలంటే, కేవలం ఆర్థికవృద్ధి కాకుండా సామాజిక న్యాయం, సమాన అవకాశాలు అవసరం. ●

# డీలిమిటేషన్ ఒక కీలక రాజ్యాంగ ప్రక్రియ

మేకిరి దామోదర్

భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో డీలిమిటేషన్ ఒక కీలక రాజ్యాంగ ప్రక్రియ. నియోజకవర్గాల సరిహద్దులను జనాభా ఆధారంగా పునర్విభజించడం ద్వారా ప్రతి పౌరుడికి సమాన ప్రాతినిధ్యం కల్పించాలనే ఉద్దేశంతో ఇది అమల్లోకి వచ్చింది. సిద్ధాంతంగా చూస్తే ఇది సమానత్వానికి ప్రతీక. కానీ ఆచరణలో ఇది రాజకీయ ప్రయోజనాలకు వేదికగా మారే అవకాశమూ అంతే బలంగా ఉంది. 1971 జనాభా లెక్కల ఆధారంగా 2026 వరకు డీలిమిటేషన్‌ను నిలిపివేయడం వెనుక ఒక స్పష్టమైన ఆలోచన ఉంది. జనాభా నియంత్రణలో ముందున్న రాష్ట్రాలు నష్టపోకుండా చూడటం, సమతుల్యతను కాపాడటం. అంటే ఇది కేవలం సాంకేతిక నిర్ణయం కాదు సామాజిక, ఆర్థిక, రాజకీయ సమన్వయానికి సంబంధించినది. కానీ ఇప్పుడు పరిస్థితులు మారాయి. జనాభా పెరుగుదలలో ప్రాంతాల మధ్య తీవ్ర అసమానతలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో డీలిమిటేషన్ మళ్లీ ప్రారంభమైతే, అది సమాన ప్రతినిధిత్వాన్ని కల్పించాలనే లక్ష్యాన్ని సాధిస్తుందా? లేకపోతే జనాభా ఆధారంగా కొన్ని రాష్ట్రాలకు అధిక ప్రాధాన్యం కల్పించి, మరికొన్ని రాష్ట్రాలను బలహీనపరుస్తుందా? అనే ప్రశ్నలు ముందుకు వస్తున్నాయి. ఇక్కడే ఇది రాజకీయ ఆయుధంగా మారే ప్రమాదం ఉంది. సీట్ల సంఖ్య పెంపు, తగ్గింపుల వెనుక రాజకీయ లెక్కలు దాగి ఉంటే, అది ప్రజాస్వామ్యాన్ని వక్రీకరించే దిశగా తీసుకెళ్తుంది. కాబట్టి డీలిమిటేషన్‌ను కేవలం సంఖ్యల వ్యాయామంగా కాకుండా, న్యాయపరమైన సమతుల్యతను కాపాడే ప్రక్రియగా చూడాల్సిన అవసరం ఉంది. డీలిమిటేషన్ చర్చల్లో అత్యంత కీలక అంశం దక్షిణ భారతదేశానికి కలిగే ప్రభావం. దక్షిణ రాష్ట్రాలు విద్య, ఆరోగ్యం, పరిశ్రమలు, కుటుంబ నియంత్రణ వంటి రంగాల్లో దేశానికి మార్గదర్శకంగా నిలిచాయి. జనాభా నియంత్రణలో సాధించిన విజయాలు, ఆర్థికంగా దేశానికి చేస్తున్న కృషి ఇవన్నీ ఈ ప్రాంతాల బలాన్ని చూపిస్తున్నాయి. అయితే, కొత్త డీలిమిటేషన్ ప్రక్రియలో జనాభానే ప్రధాన ప్రమాణంగా తీసుకుంటే, ఈ రాష్ట్రాలు నష్టపోయే అవకాశం ఉంది. ఎందుకంటే జనాభా నియంత్రణలో విజయంసాధించిన కారణంగా వారి సీట్ల సంఖ్య పెరగకపోవచ్చు, లేదా తక్కువ ప్రాతినిధ్యం దక్కవచ్చు. మరోవైపు జనాభా వేగంగా పెరిగిన రాష్ట్రాలకు అధిక సీట్లు లభిస్తాయి. ఇది ఒక విరోధ కుట్ర పూర్తి చర్య. అభివృద్ధి సాధించిన రాష్ట్రాలు శిక్షించబడుతున్నట్లే కనిపిస్తోంది. జనాభా పెంచితే ప్రోత్సాహం నియంత్రిస్తే తగ్గింపు' అనే సందేశం సమాజానికి వెళ్తే, అది దేశ అభివృద్ధి లక్ష్యాలను దెబ్బతీస్తుంది. కుటుంబ నియంత్రణ, విద్య, ఆరోగ్య రంగాల్లో చేసిన కృషికి ఇది ముమ్మాటికి ప్రతికూల సంకేతం. దీంతో పాటు రాజకీయ ప్రభావం కూడా గణనీయంగా మారుతుంది. పార్లమెంట్‌లో




దక్షిణాది రాష్ట్రాల స్వరం బలహీనపడే అవకాశం ఉంది. కేంద్ర విధానాలపై ప్రభావం తగ్గిపోవచ్చు. ఇది సమాఖ్య సూత్రానికి విరుద్ధంగా మారే ప్రమాదం ఉంది. అందుకే డీలిమిటేషన్ ప్రక్రియలో కేవలం జనాభానే కాకుండా, అభివృద్ధి సూచికలు, ఆర్థిక సహకారం, సామాజిక పురోగతి వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. ఇటీవల మహిళా రిజర్వేషన్ బిల్లు, డీలిమిటేషన్ మధ్య సంబంధం ఉన్నట్లు చూపించే రాజకీయ ప్రచారం కూడా చర్చకు దారితీసింది. మహిళలకు పార్లమెంట్‌లో రిజర్వేషన్ కల్పించడం ఒక చారిత్రాత్మక నిర్ణయం. ఇది సమానత్వానికి దారితీసే ముఖ్యమైన అడుగు. కానీ ఈ బిల్లును డీలిమిటేషన్‌తో అనుసంధానం చేసి, ఒకటి జరగకపోతే మరొకటి అమలు కాదనే అభిప్రాయం సృష్టించడం ప్రజల్లో గందరగోళాన్ని కలిగిస్తుంది. ఇది వాస్తవానికి భిన్నమైన రాజకీయ నారేటివ్‌గా మారే ప్రమాదం ఉంది. మహిళా బిల్లు అమలు ఒక విధాన నిర్ణయం. డీలిమిటేషన్ ఒక రాజ్యాంగ ప్రక్రియ. ఈ రెండింటిని కలిపి ప్రజలకు చూపించడం అనేది ఒక వ్యూహాత్మక ప్రచారంగా భావించవచ్చు. 'బిల్లు ఆగిపోయింది' అనే భావనతో ఓటు బ్యాంక్ రాజకీయాలను ప్రోత్సహించే ప్రయత్నం జరిగే అవకాశాన్ని విస్మరించలేం. మొన్న వీగిపోయింది మహిళా రిజర్వేషన్ బిల్లు కాదు. 2023లోనే మహిళా బిల్లు చట్టసభలో దాదాపు అన్ని పార్టీల మద్దతుతో ఆమోదం పొందింది. కానీ ఇన్నాళ్లు అమలు చేయకుండా రాజకీయ లబ్ధికోసం డీలిమిటేషన్ బిల్ మెలిక పెట్టిన వాస్తవాన్ని మీడియా బహిరంగ పరచలేకపోయింది. ఇక్కడ ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. వాస్తవాలను తెలుసుకోవడం, అంశాలను వేరువేరుగా అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. ఇలాంటి క్లిష్టమైన రాజకీయ, రాజ్యాంగ అంశాల్లో మీడియా పాత్ర అత్యంత కీలకం. డీలిమిటేషన్ వంటి అంశాల్లో లోతైనచర్చలు జరగాల్సిన అవసరం ఉన్నప్పటికీ, అవి పరిమితంగానే కనిపిస్తున్నాయి. డీలిమిటేషన్ ఒక అవసరమైన ప్రక్రియ. కానీ అదిన్యాయం, సమానత్వం, సమాఖ్య సూత్రాలను కాపాడే విధంగా అమలవ్వాలి. కేవలం జనాభా ఆధారంగా సీట్లను పునర్విభజించడం ద్వారా ప్రాంతీయ అసమానతలు పెరగకూడదు. దక్షిణ రాష్ట్రాలు సాధించిన అభివృద్ధి, దేశానికి చేస్తున్న ఆర్థిక సహకారం, సామాజిక పురోగతిని గుర్తించకుండా తీసుకునే నిర్ణయాలు సమాఖ్య వ్యవస్థను బలహీనపరుస్తాయి. అదే సమయంలో మహిళా సాధికారత వంటి కీలక అంశాలను రాజకీయ ప్రచారంగా మార్చడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం. ఈనేపథ్యంలో మీడియా తన బాధ్యతను గుర్తించి, ప్రజలకు నిజాలను తెలియజేయాలి. వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలి. ప్రజలుకూడా అవగాహనతో నిర్ణయాలు తీసుకోవాలి. ప్రజాస్వామ్యం సంఖ్యలమీద మాత్రమే కాదు, న్యాయం, సమతుల్యత, నిజాల మీద నిలబడాలి. సీట్లు మారవచ్చు కానీ సూత్రాలు మారకూడదు. రాజ్యాంగబద్ధంగా సమాఖ్య స్ఫూర్తికి భంగం కలగకుండా మీడియా స్వేచ్ఛను హరించకుండా, ఓటు బ్యాంక్ రాజకీయాలకు తావు లేకుండా మానవీయ విధానాలతో ప్రజాస్వామ్య పాలనందించాలి. ●

# ప్రజావాక్కు

### జలధార పథకం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రారంభించిన 'జలధార పథకం' నీటి వనరుల సమర్థ వినియోగం, భూగర్భ జలాల పరిరక్షణ దిశగా ఒక వినూత్న ప్రయత్నం. వర్షపు నీటిని నిల్వ చేయడం ద్వారా భూగర్భ జల మట్టాలను పెంచడమే ఈ పథక ప్రధాన లక్ష్యం. దీని కోసం చెక్‌డ్యాంలు, రీచార్జ్ పిట్‌లు, పర్కొలేషన్ ట్యాంకులు నిర్మిస్తున్నారు. ప్రతి నీటి బిందువును సద్వినియోగం చేస్తూ భవిష్యత్తు నీటి కొరతను అధిగమించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుంది. రైతులకు సాగునీటి భరోసా కల్పించడం ద్వారా పంటల ఉత్పాదకత, ఆదాయం పెరగడానికి ఈ పథకం తోడ్పడుతుంది. ముఖ్యంగా వర్షాభావ ప్రాంతాల్లో ఇది కీలకం కానుంది. కేవలం ప్రభుత్వ కార్యక్రమంగానే కాకుండా, స్థానిక ప్రజలను, రైతులను ఇందులో భాగస్వాములను చేస్తూ నీటిసంరక్షణపై అవగాహన కల్పిస్తున్నారు. జియో మ్యాపింగ్, డేటా విశ్లేషణ వంటి ఆధునిక సాంకేతికతను వినియోగించడం ద్వారా వనరుల నిర్వహణ మరింత సమర్థవంతంగా సాగుతోంది. నిర్మించిన సదుపాయాలనునిరంతరంపర్యవేక్షించడం, ప్రజల్లో చైతన్యాన్ని కొనసాగించడం అత్యవసరం.

- సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

### జీవితాన్ని అంచనా వేయలేం

నేటికాలంలో వాతావరణ పరిస్థితులు, ఆరోగ్యపు అలవాట్ల దృష్ట్యా సగటు మానవుడి ఆరోగ్యం పూర్తిగా క్షీణిస్తుంది. ఎప్పుడూ ఏం జరుగుతుందో తెలియని దీన పరిస్థితి. ఇలాంటి పరిస్థితుల్లో కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయి. చాలా మంది హఠాత్తుగా చనిపోతున్న సందర్భాలెన్నోఉన్నాయి. కావున వీలైనంతవరకు ఆరోగ్యంగాఉంటూ మనవంతుగా పదిమందికి ఆసరాగా ఉందాం.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### వయోజన విద్య అవసరం

తెలంగాణారాష్ట్రంలో వయోజన విద్యను ప్రవేశ పెట్టాలి. సమాజంలో వయోజనులకు విద్య ఎంతో అవసరం. మహిళా పొదుపు సంఘం సభ్యులకు, డబ్బులు పొదుపు చేయడం, బ్యాంకులలో జమచేయడం, తీర్మానం పుస్తకాలు రాయడం కోసం విద్యఅవసరం. కనుక మహిళలు, పురుషులకు వేరు వేరుగా రాత్రిపూట బడులను పూర్వ కాలం వలె తిరిగి ప్రారంభం చేయాలి. జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఈ పథకం పర్యవేక్షణ అవసరం.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

### యధాతథంగా కొనసాగించాలి

తెలుగు భాషా సాంస్కృతిక వికాసాలకు ప్రతీకగా నాడు స్వర్గీయ నందమూరి తారక రామారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎంతోరాజసంతో, కళాత్మక కట్టడంగా హైదరాబాదులో నెలకొల్పిన తెలుగువిశ్వవిద్యాలయం, తెలంగాణ ఏర్పడ్డ తరువాత సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంగా ఏర్పాటై బాచుపల్లిలో నూతనంగా నిర్మించినకొత్త ప్రాంగణంలోకి కొన్ని శాఖలు, విభాగాలు ఇటీవల మారినా నాంపల్లి ప్రాంగణంలోఇప్పటికీ పలుకోర్సులునిర్వహిస్తున్నారు. అలాగే విశ్వవిద్యాలయ పుస్తక విక్రయకేంద్రం ఇక్కడనే కొనసాగుతోంది. ఆధునీకరించిన ఆడిటోరియం కూడా ఇక్కడే ఉంది. కాగా, ఇటీవల ప్రభుత్వం విశ్వవిద్యాలయ శాఖలు దాని విభాగాలు అన్నీ బాచుపల్లి ప్రాంగణానికి మార్చి నాంపల్లి ప్రాంగణాన్ని పర్యాటక, సాంస్కృతిక శాఖకు అప్పగించాలన్న నిర్ణయం సరికాదు. హైదరాబాదు నడిబొడ్డున ఉన్ననాంపల్లి ప్రాంగణం ఎంతోమంది రాకపోకలకు అనుకూలం. తెలుగు భాష, సాహిత్యం, కళలు, సాంస్కృతిక పరిరక్షణకు కేంద్రంగా నిలిచిన ప్రాంగణాన్ని యథాతథంగా కొనసాగించాలి.

- కప్పగంతు వెంకట రమణమూర్తి, సికింద్రాబాద్

### డిప్యుటేషన్‌లను రద్దు చేయాలి

తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు అన్నిరకాల విభాగాలలో డిప్యుటేషన్‌లను రద్దు చేయాలి. సొంత స్థలానికి పంపాలి. విద్యా సంస్థలలో అదనపు ఉద్యోగులు ఉంటే పరిపాలన అడ్మినిస్ట్రేషన్ పనులను సమర్థవంతంగా పని చేసే విధంగా చూడాలి. 500 మంది కన్నా ఎక్కువ విద్యార్థులు ఉంటే కనీసం ఇద్దరు అదనపు టీచింగ్ స్టాఫ్ ఉండే విధంగా చూడాలి. అందుకే డిప్యుటేషన్‌లు రద్దు చేయాలి.

- రాపాక రవీందర్, జనగాం

### సైబర్ నేరాలను అరికట్టాలి

ప్రభుత్వరంగ బ్యాంకుల్లో ప్రజలు తమ కష్టార్జితాన్ని పొదుపు రూపంలో దాచుకుంటారు. అయితే సైబర్ నేరగాళ్లు ప్రజలకు తెలియకుండానే ఈ సొమ్మును దొంగిలిస్తున్నారు. ఇలాంటి మోసాలకు గురైన బాధితులు పోలీసులకు, బ్యాంకులకు, సైబర్ క్రైమ్ విభాగానికి ఫిర్యాదులు చేసినా అవి దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉండటం ఆందోళనకలిగించే విషయం. బ్యాంకులు తమ నిస్సహాయతను వ్యక్తం చేస్తూ, పోగొట్టుకున్న లేదా స్తంభింపజేసిన సొమ్మును తిరిగి పొందడం కేవలం సైబర్ సెక్యూరిటీ సిబ్బంది ద్వారానే సాధ్యమని చెబుతున్నాయి.

- కె.రామారావు, నల్గొండ

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# ఆర్థిక రంగానికి 'క్లాడ్ మిథోస్' ముప్పు!

**పలువురు బ్యాంక్ అధికారులతో భేటీ అయిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్**

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 24:** క్లాడ్ మిథోస్ అనే అత్యంత శక్తిమంతమైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మోడల్ వల్ల భారత బ్యాంకింగ్ రంగానికి ముప్పు పొంచి ఉందని కేంద్ర ఐటి శాఖ గుర్తించింది. వెంటనే అప్రమత్తం అయిన ఆర్థికశాఖరంగంలోకి దిగింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వివిధ బ్యాంకుల అధిపతులతో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కూడా పాల్గొన్నారు. ఆంత్రోపిక్ అనే ఎఐ స్టార్టప్ అభివృద్ధి చేసిన క్లాడ్ మిథోస్ సైబర్ భద్రత విషయంలో అత్యంత అధునాతనమైనదిగా పేరుపొందింది. మనుషులు గుర్తించడంలో విఫలమైన వేలాది సైబర్ భద్రతా లోపాలను ఇది గుర్తించినట్లు సమాచారం. కొన్ని ఆపరేటింగ్ సిస్టమ్స్‌లో 27 ఏళ్లుగా ఉన్న లోపాలను కూడా ఇది బయటపెట్టింది. అందుకే దీన్ని సాధారణ ప్రజలకు అందుబాటులోకి తీసుకురాలేదు. ఒకవేళ ఇది చెడు ఉద్దేశాలున్న వారి చేతికి చిక్కితే, అధునాతన హ్యాకింగ్ సామర్థ్యాలు పొందినట్లేనని ఆంత్రోపిక్ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో కొందరు అనధికారికంగా ఈ టి.ని యాక్సెస్ చేశారన్న వార్తలు ఆందోళన రేపుతున్నాయి. ఈ ముప్పు అసాధారణమైనదని, బ్యాంకులు, ఆర్థిక సంస్థల మధ్య అత్యంత జాగరూకత, సమన్వయం అవసరమని ఆర్థిక మంత్రిత్వ శాఖ ఎక్స్ వేదికగా పేర్కొంది. బ్యాంకులు తమ ఐటీ వ్యవస్థలను పటిష్ఠం చేసుకోవాలని, వినియోగదారుల డేటాను కాపాడేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని నిర్మలా సీతారామన్ ఆదేశించారు. ముప్పును నిజ సమయంలో గుర్తించి, దాని వివరాలను బ్యాంకులు, ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ వంటి సంస్థల మధ్య పంచుకోవడానికి ఒక బలమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. తక్షణమే స్పందించేందుకు వీలుగా ఒక సమన్వయ సంస్థాగత యంత్రాంగాన్ని అభివృద్ధి చేయాలని ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ ఐబిఎకు మంత్రి సూచించారు. కేవలం భారత్‌లోనే కాకుండా, అమెరికా ప్రభుత్వం కూడా మిథోస్ ముప్పుపై వాల్‌స్ట్రీట్ బ్యాంకులతో చర్చలు జరుపుతోంది. మరోవైపు, ఈ కొత్త ఎఐ వల్ల భారత ఆర్థిక రంగానికి ఎంత మేరకు ప్రమాదం ఉందనే అంశంపై ఆర్థిక మంత్రిత్వ శాఖ, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లుఅధ్యయనం చేస్తున్నాయి.

**కోర్టు కాంప్లెక్స్ ఐదో అంతస్తు నుంచి దూకి**

# న్యాయవాది ఆత్మహత్య

**తండ్రి అనుసరించిన కఠిన విధానాలే కారణమని సూసైడ్‌నోట్**



**కాన్పూర్, ఏప్రిల్ 24** యువ న్యాయవాది కోర్టు భవనం పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాల్యంలో తండ్రి అకృత్యాలే కారణమని సూసైడ్ నోట్‌లో ఆరోపించాడు. తన మృతదేహాన్ని తండ్రి తాకకూడదని అందులో పేర్కొన్నాడు. కాన్పూర్‌కు చెందిన 25 ఏళ్ల లాయర్ అయిన ప్రియాన్షు శ్రీవాస్తవ కాన్పూర్‌లోని కోర్టు భవనం ఐదో అంతస్తు పైనుంచి కిందకు దూకాడు. తీవ్రంగా గాయపడిన అతడ్ని వెంటనే ఆసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు డాక్టర్లు ప్రకటించారు. ఆత్మహత్యకు ముందు శ్రీవాస్తవ వివరణాత్మక సూసైడ్ నోట్‌ను వాట్సాప్‌లో పోస్ట్ చేశాడు. మితిమీరిన తండ్రి కఠినత్వం, బాధాకరమైన బాల్యం అనుభవాలు, ఇష్టం లేని చదువు వంటివి తన ఆత్మహత్యకు కారణాలని పేర్కొన్నాడు. ఆరేళ్ల వయసులో అనుమతి లేకుండా మామిడి రసం తాగినందుకు తండ్రి తన బట్టలు విప్పి ఇంటి నుండి బలవంతంగా బయటకు గెంటేశాడని ఆరోపించాడు. మరోవైపు 2025లో ఎల్ఎల్‌బీ పూర్తి చేసినప్పటికీ న్యాయ పరీక్షలలో ఉత్తీర్ణత సాధించడంలో ఇబ్బందులు, ఆర్థిక ఒత్తిడి, తండ్రి అనారోగ్యం వల్ల తలెత్తిన బాధ్యతలతో సహా, తన జీవిత పోరాటాన్ని సూసైడ్ నోట్‌లో శ్రీవాస్తవ ప్రస్తావించాడు. తనకంటూ సొంత, వృత్తిపరమైన గుర్తింపు లేకపోవడం, తండ్రి కింద పనిచేయడం పట్ల తీవ్ర నిరాశను వ్యక్తం చేశాడు. మా నాన్న నా శరీరాన్ని కనీసం తాకకూడదని పేర్కొన్నాడు. శ్రీవాస్తవ ఆత్మహత్యపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తామని పోలీస్ అధికారి తెలిపారు. సూసైడ్ నోట్ అంశాలతో పాటు సీసీటీవీ ఫుటేజ్‌ను కూడా పరిశీలిస్తున్నట్లు చెప్పారు. న్యాయవాది అయిన శ్రీవాస్తవ తండ్రి తీవ్ర దుఃఖంలో ఉన్నారని మరిన్ని వివరాలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

## ఇరాన్ బహిష్కృత యువరాజు పహ్లావీపై బెర్లిన్‌లో దాడి!



**బెర్లిన్, ఏప్రిల్ 24:** ఇరాన్ బహిష్కృత యువరాజు (క్రౌన్ ప్రిన్స్) రెజా పహ్లావీపై జర్మనీ రాజధాని బెర్లిన్‌లో ఓ వ్యక్తి ఎరుపు రంగా ద్రావణం చల్లడం కలకలం సృష్టించింది. దాదాపు 50 యేళ్లుగా స్వదేశం వెలుపలే నివసిస్తున్న పహ్లావీ.. బెర్లిన్‌లోని ఫెడరల్ న్యూస్ కాన్ఫరెన్స్ భవనంలో గురువారం మీడియా సమావేశంలో పాల్గొన్నారు. అమెరికా– ఇరాన్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని విమర్శించారు. టెహ్రాన్ ప్రభుత్వ ప్రవర్తన మారుతుందన్న భ్రమతో కాల్పులల విరమణను పొడిగించినట్లు కనిపిస్తోందని, అది సాధ్యమయ్యే పని కాదని పేర్కొన్నారు. అనంతరం ఆయన భవనం వెలుపలకు రాగానే.. ఓ వ్యక్తి ఎరుపు రంగు ద్రావణాన్ని చల్లాడు. అది పహ్లావీ కోటు, మెడ భాగంపై పడింది. ఈ ఘటనలో ఆయనకేమీ గాయాలు కాలేదు. ద్రావణం చల్లిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అది టమాటా రసం అయ్యుంటుందని భావిస్తున్నారు. పహ్లావీ వయసు 65 యేళ్లు. ఇరాన్ మాజీ షా అయిన మహమ్మద్ రెజా పహ్లావీ కుమారుడు ఈయన. 1979 నాటి ఇస్లామిక్ విప్లవంతో ఇరాన్‌లో మహమ్మద్ రెజా పహ్లావీ పదవీచ్యుతుదయ్యారు. తర్వాత ఆయన కుమారుడు పహ్లావీ దేశ బహిష్కారానికి గురయ్యారు. ఇరాన్‌లో తిరిగి అధికారాన్ని చేజిక్కించుకోవాలని పహ్లావీ ప్రయత్నిస్తున్నారు. ఆ దేశంపై అమెరికా–ఇజ్రాయెల్ మిలిటరీ చర్యను సమర్థిస్తున్నారు. పహ్లావీపై ఎరుపు ద్రావణంతో జరిగిన దాడిని నిరసిస్తూ.. ఆయన మద్దతుదారులు వందల మంది జర్మనీ పార్లమెంట్ భవనం సమీపంలో నిరసన ప్రదర్శన చేపట్టారు.

## ట్రంప్ 'నరకకూపాలు' వ్యాఖ్యలకు ఇరాన్ ఘాటైన కౌంటర్

**ముంబయి, ఏప్రిల్ 24:** భారత్, చైనాలను నరకకూపాలుగా అభివర్ణిస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ రీషేర్ చేయడంపై ఇరాన్ ఘాటుగా స్పందించింది. ట్రంప్‌నకు కొంత సాంస్కృతిక ప్రక్షాళన అవసరమని చెబుతూనే ఓసారి ఇండియా వచ్చి చూడంటూ ముంబైలోని ఇరాన్ కాన్సులేట్ జనరల్ సోషల్‌మీడియాలో పోస్టు చేసింది. ప్రస్తుతం ఈ పోస్టు వైరల్ అవుతూ అంతర్జాతీయంగా చర్చనీయాంశం అయింది. ముంబైలోని ఇరాన్ రాయబార కార్యాలయం తన అధికారిక ఎక్స్ ఖాతాలో మహారాష్ట్రలోని అద్భుతమైన సంస్కృతిని, భౌగోళిక అందాలను ప్రతిబింబించే ఒక వీడియోను షేర్ చేసింది. ఈ సందర్భంగానే ట్రంప్‌నకు చురకలు అంటిస్తూ ఎవరైనా మిస్టర్ ట్రంప్‌నకు భారత్‌లో అభివృద్ధి, సాంస్కృతిక విలువలు తెలిసేలా ఆయన్ను ఇక్కడకు తీసుకు వస్తే బాగుంటుంది. బహుశా అది ఆయన చేసే పనికిమాలిన వ్యాఖ్యలను తగ్గిస్తుందేమోనని పేర్కొంది. కభీ ఇండియా ఆకే దేఖో.. ఫిర్ బోల్నా (ఒక్కసారి భారత్ వచ్చి చూడు.. ఆప్పుడు మాట్లాడు) అంటూ హిందీలో సమాధానం ఇచ్చింది. అమెరికన్ రేడియో హోస్ట్ మైఖేల్ సావేజ్ తన పాడ్‌కాస్ట్‌లో భారత్, చైనాల నుంచి వచ్చే వలసదారులను ఉద్దేశించి జాత్యహంకార వ్యాఖ్యలు చేశారు. వీరు తొమ్మిదో నెలలో అమెరికాకు వచ్చి పిల్లలనుకంటారు.



# టిఎంసి గూండాలకు బెంగాల్‌లో చోటివ్వం

**రెండోదశ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోడీ**

**కోల్‌కత్తా, ఏప్రిల్ 24:** బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత తృణమూల్ కాంగ్రెస్ పార్టీ గూండాలకు దాక్కోవడానికి బెంగాల్‌లో ఎక్కడా చోటు దొరకదని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. రెండో దశ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మాట్లాడుతూ, పశ్చిమ బెంగాల్ తొలి దశ పోలింగ్‌లో పెద్ద ఎత్తున ఓటర్లు పాల్గొన్నారని, ఇది ప్రజాస్వామ్య విజయంగా అభివర్ణించారు. ఈ ఓటింగ్ శాతాన్ని చూసి టీఎంసీకి భయం పట్టుకుందని, ఎన్నికల ఫలితాల తర్వాత రాష్ట్ర ప్రజలకు జరిగిన ప్రతి అన్యాయానికి, దౌర్జన్యానికి సంబంధించిన ఫైల్స్‌ను బయటకు తీస్తామని హెచ్చరించారు. ఈ రాష్ట్రం విప్లవాల గడ్డ అని గుర్తుంచుకోవాలని అన్నారు. ఎన్నికల ఫలితాల తర్వాత టీఎంసీ గూండాలను ఎవరూ కాపాడలేరని అన్నారు. మమతా బెనర్జీ సాగిస్తున్న అటవిక పాలనకు చరమగీతం పాడే సమయం ఆసన్నమైందని అన్నారు. మొదటి దశలో పోలింగ్ రికార్డు స్థాయిలో నమోదు కావడం పట్ల మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని ఇది ప్రతిబింబిస్తోందని అన్నారు. తృణమూల్ కాంగ్రెస్ మహిళా వ్యతిరేక పార్టీ అని విమర్శించారు. బెంగాల్‌లో మహిళలకు గౌరవం, భద్రత, సాధికారత కల్పించడమే తమ లక్ష్యమని అన్నారు. బెంగాల్‌లో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత, మహిళలకు భద్రత కల్పిస్తాం. తప్పు చేసిన వారు శిక్షకు గురవుతారని, మే 4న బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత, ప్రతి అన్యాయం, ప్రతి అకృత్యంపై ఫైళ్లు తెరుస్తాం. ఇది మోదీ గ్యారెంటీ అని ప్రధాని అన్నారు. బెంగాల్‌లోని ప్రతి సోదరి, కుమార్తె కలలను నెరవేర్చడానికి, వారి జీవితాలను సులభతరం చేయడానికి బీజేపీ కట్టుబడి ఉంది. బీజేపీ మీకు భద్రత ఇస్తుంది. గౌరవం ఇస్తుంది. బీజేపీతోనే మీకు ఐశ్వర్యం లభిస్తుందని మోడీ అన్నారు. బీజేపీ ప్రభుత్వంలో ప్రతి మహిళ జీవితంలో సంతోషం వస్తుంది. పేద సోదరీమణులకు ఉచిత రేషన్ అందిస్తుంది. ఏ సిండికేట్ కూడా మీ హక్కులను లాక్కోలేదని మోడీపేర్కొన్నారు మహిళా శక్తిపై తనకు పూర్తి నమ్మకం ఉందని, వారు 21వ శతాబ్దపు బెంగాల్‌లో కొత్త చరిత్రను రాస్తారనిఅన్నారు.

ఇకపై మేము టీఎంసీ ప్రభుత్వాన్ని మార్చితీరుతాం, ఇకపై మేము సహించమని బెంగాల్‌లోని ప్రతి మహిళ చెబుతోంది. రాష్ట్రంలోని ప్రతి ఆడబిడ్డకు హామీ ఇస్తున్నామని బీజేపీ మీ కలలను కల్లలు కానీయబోదనిని ప్రధాని మోడీ పేర్కొన్నారు. మహిళలు రాత్రిపూట బయటకు రావద్దని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ చేసిన వ్యాఖ్యలను కూడా ప్రధాని మోడీ తప్పుబట్టారు. దేశాన్ని ఉలిక్కిపడేలా చేసిన ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజ్ హత్యాచారం ఉదంతాన్ని ప్రస్తావిస్తూ, ఆ ఘోరమైన నేరానికి టీఎంసీ పార్టీయే బాధ్యత వహించాలని అన్నారు. బాధితురాలి తల్లిని తమ పార్టీ అభ్యర్థిగా ప్రకటించినట్లు ఆయన గుర్తుచేసారు.

## బెంగాల్ తొలివిడతలో 110 సీట్లు మావే: అమిత్ షా

**కోల్‌కతా, ఏప్రిల్ 24:** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధిస్తుందని కేంద్రమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. మొదటి దశలో 152 స్థానాలకు పోలింగ్ జరిగిందని, ఇందులో 110కి పైగా స్థానాలను తాము గెలుచుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. కోల్‌కతాలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మొదటి దశలో రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదైందని, ఇది మోడీ నాయకత్వంలోని అభివృద్ధికి వేసిన ఓటు అన్నారు. అధిక ఓటింగ్ శాతం నమోదు కావడం చూస్తుంటే బెంగాల్ ప్రజలు భయాన్ని వీడి విశ్వాసం వైపు మొగ్గు చూపుతున్నట్లు అర్థమవుతోందని అన్నారు. బెంగాల్ ప్రజలు తమ భవిష్యత్తును తొలి దశలోనే నిర్ణయించుకున్నారని పేర్కొన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలోని అభివృద్ధి వైపు వారు మొగ్గు చూపారని అన్నారు. దీదీ దిగిపోయే సమయం వచ్చిందని, బీజేపీ అధికారం చేపట్టబోతోందని అన్నారు. బెంగాల్‌లో చట్టబద్ధమైన పాలనను పునరుద్ధరిస్తామని అమిత్ షా అన్నారు. చొరబాటు రహిత బెంగాల్‌గా మార్చడమే పెద్ద మార్పు అన్నారు. అవినీతి, బుజ్జగింపులు, దోపిడీ నుంచి స్వేచ్ఛ, యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పాటు తర్వాత మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు. బెంగాల్‌లో బీజేపీ అధికారంలోకి వస్తే పాలన బయటి నుంచి ఉంటుందని మమతా బెనర్జీ చేసిన విమర్శలపై అమిత్ షా స్పందించారు. బెంగాల్‌లోనే పుట్టి, బెంగాలీలో చదువుకుని, ఆ భాషను మాట్లాడగలిగేవారే బెంగాల్ తర్వాత ముఖ్యమంత్రిగా అవుతారని అన్నారు. కానీ ఆ అవకాశం మమతా బెనర్జీ మేనల్లుడికి రాదని, బీజేపీ కార్యకర్తకు వస్తుందని అన్నారు.

## పాకిస్థాన్‌లో చిన్నారులకు హెచ్‌ఐవి
## బిబిసి స్టింగ్ ఆపరేషన్‌లో చేదునిజాలు

**ఇస్లామాబాద్,ఏప్రిల్ 24:** పాకిస్థాన్‌లో ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యంకారణంగా పసిపిల్లలు హెచ్ఐవీ బారిన పడుతున్నారు. పంజాబ్ ప్రావిన్స్‌లోని ఒక ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సిబ్బంది కనీస నిబంధనలు పాటించకుండా వాడిన సిరంజీలు, కలుషితమైన మందులతో చికిత్స అందిస్తున్న వైనాన్ని ఒక అంతర్జాతీయ మీడియా సంస్థ రహస్యంగా చిత్రీకరించిన డాక్యుమెంటరీ బయటపెట్టింది. బీబీసీ ఇన్వెస్టిగేషన్స్ చేపట్టిన ఈ స్టింగ్ ఆపరేషన్‌లో తౌన్సాలోని తహసీల్ హెడ్ క్వార్టర్స్ (టీహెచ్‌క్యూ) ఆసుపత్రిలో నర్సులు, ఇతర సిబ్బంది పిల్లలకు బట్టల పైనుంచే ఇంజెక్షన్లు ఇవ్వడం, వాడిన సిరంజీలనే మళ్లీ వినియోగించడం, రక్తంతో కలుషితమైన మందుల సీసా నుంచి పలువురు పిల్లలకు మందు ఇవ్వడం వంటి దారుణాలు రికార్డయ్యాయి. సిబ్బంది కొరత, మందుల కొరత కారణంగానే ఈ పరిస్థితి తలెత్తినట్టు తెలుస్తోంది. 2024 నవంబర్ నుంచి 2025 అక్టోబర్ మధ్య కాలంలో తౌన్సాలోనే కనీసం 331 మంది చిన్నారులకు హెచ్ఐవీ సోకినట్లు బీబీసీ తన నివేదికలో పేర్కొంది. గతంలో ఈ ఆసుపత్రిపై ఆరోపణలు రావడంతో ప్రభుత్వం చర్యలు చేపడతామని ప్రకటించినా క్షేత్రస్థాయిలో పరిస్థితి మారలేదని ఈ డాక్యుమెంటరీ స్పష్టం చేసింది. మరోవైపు పాకిస్థాన్ వ్యాప్తంగా హెచ్ఐవీ కేసుల సంఖ్య పెరగడంపై వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 2025 అక్టోబర్ నుంచి ఇప్పటివరకు 189 కొత్త హెచ్ఐవీ పాజిటివ్ కేసులు నమోదయ్యాయని, ఏప్రిల్ మొదటి 20 రోజుల్లోనే 11 కొత్త కేసులు వచ్చాయని జాతీయ ఆరోగ్య సేవల మంత్రిత్వ శాఖ గణాంకాలు వెల్లడించాయి. బాధితుల్లో పురుషులతో పాటు చిన్నారులు కూడా ఉండటం ఆందోళనను రెట్టింపు చేస్తోంది. ప్రజల్లో అవగాహన పెరిగి పరీక్షల కోసం ముందుకు రావడం వల్లే కేసుల సంఖ్య పెరిగినట్లు కనిపిస్తోందని ఎయిడ్స్ కంట్రోల్ ప్రోగ్రామ్ మేనేజర్ జుబైర్ అబ్దుల్లా తెలిపారు. బీబీసీ విడుదల చేసిన వీడియో ఫుటేజ్‌పై ఆసుపత్రి అధికారులు స్పందిస్తూ ఆ ఆరోపణలను ఖండించారు. తాను బాధ్యతలు చేపట్టక ముందు ఈ ఫుటేజ్ తీసి ఉండవచ్చని లేదా దీన్ని ఎవరో కావాలనే సృష్టించి ఉండవచ్చని ప్రస్తుత మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఖాసిం బుజ్దార్ అన్నారు.

## ఇరాన్‌తో యుద్ధంలో 1,200 పేట్రియాట్ క్షిపణులు, వెయ్యి తోమాహాక్స్ వాడిన అగ్రరాజ్యం అమెరికా



**వాషింగ్టన్, ఏప్రిల్ 24:** ఇరాన్‌తో జరిగిన యుద్ధంలో అమెరికా భారీగా ఖర్చు చేసింది. వైట్‌హౌస్ అంచనాల ప్రకారం ఆ ఖర్చు సుమారు 28 బిలియన్ల డాలర్ల నుంచి 35 బిలియన్ డాలర్ల వరకు ఉంటుందని భావిస్తున్నారు. ప్రతిరోజూ అమెరికా ఆ యుద్ధం కోసం సుమారు వంద కోట్ల డాలర్లు ఖర్చు చేసింది. అయితే యుద్ధం ప్రారంభమైన మొదటి రెండు రోజుల్లోనే అమెరికా దాదాపు 5.6 బిలియన్ల డాలర్ల ఖరీదైన ఆయుధాలను వినియోగించినట్లు తెలుస్తోంది. డిఫెన్స్ డిపార్ట్‌మెంటన అంచనాల ప్రకారం అమెరికా సుమారు 1100 జాయింట్ ఎయిర్ టు సర్ఫేస్ క్షిపణులను ఇరాన్ మీదకు వదిలినట్లు తెలుస్తోంది. అమెరికా వద్ద సుమారు 1500 జెఎఎస్ఎస్ఎం–ఇఆర్ క్షిపణులు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మిస్సైల్ రేంజ్ దాదాపు 600 కి.మీ., శత్రువుల స్థావరాల్లోకి ఇది దూసుకెళ్తుంది. జెఎఎస్ఎస్ఎం మిస్సైల్ ధర ఒక్కటి సుమారు 11 లక్షల డాలర్లు ఉంటుంది. ఇరాన్‌పై సమరంలో అమెరికా సుమారు 1,000 తోమాహాక్ క్రూయిజ్ క్షిపణులు వాడినట్లు తెలుస్తోంది. ప్రతి యేడాది అమెరికా ఖరీదు చేసే వాటి కంటే పది రెట్లు ఎక్కువగా వాటిని వినియోగించినట్లు అంచనా వేస్తున్నారు. ఒక్కొక్క తోమాహాక్ క్షిపణి ఖరీదు 3.6 మిలియన్ల డాలర్లు ఉంటుంది. తోమాహాక్‌లు లాంగ్ రేంజ్ క్రూయిజ్ మిస్సైళ్లు. 1991లో జరిగిన పర్షియన్ గల్ఫ్ వార్ నుంచి అమెరికా వాటిని వాడుతోంది. అమెరికాకు చెందిన సిఎస్ఐసి ప్రకారం.. ఆ దేశం వద్ద సుమారు 3000 తోమాహాక్ క్షిపణులు ఉన్నట్లు నిల్వల ద్వారా తెలుస్తోంది. ఈ యుద్ధంలో 1200 పేట్రియాట్ ఇంటర్‌సెప్టార్ క్షిపణులను అమెరికా వినియోగించినట్లు ఓ కథనం ద్వారా తెలిసింది. ఒక్కొక్క పేట్రియాట్ మిస్సైల్ ఖర్చు సుమారు 4 మిలియన్ల డాలర్లు ఉంటుంది. 2025 సంవత్సరంలో అమెరికా దాదాపు 600 పేట్రియాల్ క్షిపణులను ఉత్పత్తి చేసింది. ఈ వార్‌లో మరో 1000 ప్రిసిషన్ స్ట్రయిక్ క్షిపణులను కూడా అమెరికా వాడింది. వీటిల్లో ఎటిఎసిఎంఎస్ గ్రౌండ్ బేస్డ్ మిస్సైల్స్ కూడా ఉన్నాయి. సీజ్‌ఫైర్ ఒప్పందం జరగకముందే.. యుద్ధం 38 రోజులపాటు సాగింది. ఈ వార్‌లో అమెరికా 13,000 లక్ష్యాలను ధ్వంసం చేసినట్లు తెలుస్తోంది.

# మంటల్లో పశ్చిమాసియా

## సమయం మించిపోతోంది: ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరికలు



**వాషింగ్టన్, ఏప్రిల్ 24:** ఇరాన్‌తో జరుగుతున్న యుద్ధంలో అణ్వాయుధాలు వాడబోమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా స్పష్టం చేశారు. ఈ క్రమంలో తమతో ఒప్పందానికి రావాలని.. సమయం మించిపోతోందని టెహ్రాన్‌కు ఆయన హెచ్చరికలు చేశారు. వైట్‌హౌస్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ట్రంప్ మాట్లాడారు. ఇరాన్‌తో యుద్ధంలో అణ్వాయుధాలు వాడే ప్రణాళిక తనకు లేదని ట్రంప్ పేర్కొన్నారు. 'నేను ఎందుకు అణ్వాయుధాన్ని ఉపయోగిస్తాను? అది లేకుండానే సంప్రదాయ యుద్ధ పద్ధతుల్ల మేము వారిని ఇప్పటికే నాశనం చేశాం. నేను దాన్ని ఉపయోగించను. అణ్వాయుధాన్ని ఉపయోగించడానికి ఎవరినీ, ఎప్పటికీ అనుమతించకూడదు' అని ట్రంప్ అన్నారు. ఈ సందర్భంగా టెహ్రాన్‌తో ఒప్పందానికి తాను తొందరపడటం లేదని ట్రంప్ పేర్కొన్నారు. త్వరిత పరిష్కారం కంటే స్థిరమైన, దీర్ఘకాలిక ఒప్పందంపైనే దృష్టి సారించినట్లు తెలిపారు. ఇటీవల ముగిసిన రెండు వారాల కాల్పుల విరమణలో ఇరాన్ తన ఆయుధ వ్యవస్థలను పునరుద్ధరించుకొని ఉండచవచ్చన్నారు. ఒప్పందం కుదుర్చుకునేందుకు ఇరాన్‌కు సమయం మించిపోతోందని హెచ్చరిస్తూ ట్రంప్ ట్రూత్ సోషల్‌లో ఓ పోస్టు పెట్టారు. 'నాకు చాలా సమయం ఉంది. కానీ ఇరాన్‌కు లేదు, సమయం మించిపోతోంది. ఇరాన్ సైన్యం కుప్పకూలిపోయింది. వారి నాయకులు ఇక మనతో లేరు. దిగ్బంధనం పటిష్టంగా ఉంది. ఇకనుంచి పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది' అని ఆయన ట్రూత్‌లో రాసుకొచ్చారు.

## మొజ్తబా ముఖం, పెదాలకు తీవ్రగాయాలు


**ఇప్పటికే మూడు శస్త్రచికిత్సలు :అమెరికా పత్రికల్లో ప్రత్యేక కథనాలు**



**టెహ్రాన్, ఏప్రిల్ 24:** ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ బతికే ఉన్నారని, స్పృహలోనే ఉన్నారని చెపుతున్న ఇరాన్ పాలకులు ఆయన తీవ్రంగా గాయపడిన వైనం మాత్రం దాచిపెడుతునానరు. ఒకానొక దాడిలో తీవ్రంగా గాయపడటంతో ఇప్పుడు అజ్ఞాతంలోకి వెళ్లారు. బయటి ప్రపంచానికి కనిపించకుండా, వినిపించకుండా పాలనలో చురుగ్గా ఉన్నప్పటికీ, దేశంలో అధికారం ఆయన చేతుల్లో నుంచి సైనిక జనరల్స్ వైపు మళ్లింది. ఈ సంచలన విషయాలనుఅమెరికా పత్రిక ఒకటి తన ప్రత్యేక కథనంలో వెల్లడించింది. మొజ్తబా ఖమేనీకి తీవ్ర గాయాలైనప్పటికీ, ఆయన మానసికంగా చాలా చురుగ్గా ఉన్నారు. ఆయన శరీరం తీవ్రంగా దెబ్బతింది. ఆయన కాలికి మూడుసార్లు ఆపరేషన్ జరిగిందని, ప్రస్తుతం కృత్రిమ కాలు కోసం ఎదురుచూస్తున్నారని రిపోర్ట్ పేర్కొంది. ఒక చేతికి కూడా శస్త్రచికిత్స జరగ్గా, అది నెమ్మదిగా కోలుకుంటోంది. అన్నింటికంటే ముఖ్యంగా ముఖం, పెదవులు తీవ్రంగా కాలిపోవడంతో మాట్లాడటం కష్టంగా మారిందని, భవిష్యత్తులో ప్లాస్టిక్ సర్జరీ అవసరమని అమెరికా పత్రిక వివరించింది. ఈ గాయాల వల్లే ఆయన ప్రజా జీవితానికి దూరంగా ఉంటున్నారు. బలహీనంగా కనిపించడం ఇష్టం లేకే ఈ నిర్ణయం తీసుకున్నారని తెలుస్తోంది. ఆయనకు సందేశాలు చేరవేయడానికి, ఆయన నుంచి ఆదేశాలు స్వీకరించడానికి ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశారు. చేతితో రాసిన లేఖలను సీల్డ్ కవర్లలో ఉంచి, కార్లు, మోటార్‌సైకిళ్లపై మానవహారంలా ఒకరి నుంచి ఒకరికి అందిస్తూ ఆయన రహస్య స్థావరానికి చేరవేస్తున్నారు. ఇజ్రాయెల్ తమను గుర్తించి దాడి చేయొచ్చనే భయంతో సీనియర్ అధికారులు కూడా ఆయన్ను కలవడం లేదని రిపోర్ట్ తెలిపింది.

## ఇరాక్ మిలీషియా లీడర్ ఆచూకీ ఇస్తే రూ.94 కోట్లు!

**నజరానా ప్రకటించిన అమెరికా**



**బాగ్దాద్, ఏప్రిల్ 24:** ఇరాక్‌లో ఇరాన్ మద్దతుతో పనిచేస్తున్న ఓ కీలక మిలీషియా నాయకుడిని పట్టిచ్చేందుకు అమెరికా భారీ నజరానా ప్రకటించింది. కతాయెబ్ సయ్యద్ అల్ షుహాదా అనే ఉగ్రవాద సంస్థకు నాయకుడైన హాషీమ్ ఫిన్యాన్ రహీమ్ అల్‌సరాజీ అలియాస్ అబూ వాలా అల్ వాయెలీని అరెస్ట్ చేయడానికి దారితీసే సమాచారం అందిస్తే 10 మిలియన్ డాలర్లు అంటే భారత కరెన్సీలో సుమారు రూ. 94 కోట్లు రివార్డుగా ఇస్తామని ప్రకటించింది. అమెరికా విదేశాంగ శాఖకు చెందిన రివార్డ్స్ ఫర్ జస్టిస్ కార్యక్రమం కింద ఈ ప్రకటన వెలువడింది. ఇరాక్, సిరియాలలో అమెరికా దళాలు, దౌత్య కార్యాలయాలపై దాడులకు, ఇరాకీ పౌరుల మరణాలకు వాయెలీ నేతృత్వంలోని గ్రూప్ బాధ్యత వహించాలని అమెరికా ఆరోపించింది. సమాచారం అందించిన వారికి పూర్తి రక్షణతో పాటు, అవసరమైతే పునరావాసం కూడా కల్పిస్తామని స్పష్టం చేసింది. ఇరాక్‌లో ఇరాన్ అనుకూల మిలీషియాలపై ఒత్తిడి పెంచి, వాటిని కట్టడి చేసే కొత్త ప్రధానమంత్రి నియామకాన్ని ప్రోత్సహించే వ్యూహంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అబూ వాలా అల్ వాయెలీ కేఎస్ఎస్ గ్రూప్‌లో చేరకముందు కతాయెబ్ హిజ్బుల్లా కెహెచ్ అనే మరో అమెరికా వ్యతిరేక షియా మిలీషియాలో సభ్యుడిగా ఉండేవాడు. ఆ సమయంలో ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడినందుకు అమెరికా దళాలకు పట్టుబడి 2010లో విడుదలయ్యాడు. సిరియా అంతర్యుద్ధం సమయంలో కేఎస్ఎస్ గ్రూప్‌లో చేరాడు. వాయెలీ నాయకత్వం వహిస్తున్న కేఎస్ఎస్ సంస్థ, ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ఐఆర్జీసీ భావజాలంతో, వారి మద్దతుతో పనిచేస్తుంది. ఈ సంస్థ యెమెన్‌లోని హౌతీలకు కూడా తన మద్దతు ప్రకటించింది.

విచిత్రమేమిటంటే, కేఎస్ఎస్ ఫైటర్లు ఇరాక్ అధికారిక భద్రతా దళాల్లో భాగమైన పాప్యులర్ మొబిలైజేషన్ కమిటీ లోని 14వ బ్రిగేడ్‌గా కూడా కొనసాగుతున్నారు. కేఎస్ఎస్ కార్యకలాపాలను గమనించిన అమెరికా, 2023 నవంబర్ 17న వాయెలీని అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించింది. గడిచిన దశాబ్ద కాలంలో ఈ గ్రూపు అమెరికా దళాలపై వెయ్యికిపైగా దాడులు చేసిందన్న నివేదికలున్నాయి.

# హెచ్‌వన్‌బి వీసాలను మూడేళ్లపాటు నిలిపివేయాలి!

## ప్రతినిధుల సభలో బిల్లు ప్రవేశపెట్టిన కాంగ్రెస్ సభ్యుడు ఎలీక్రేన్

**వాషింగ్టన్, ఏప్రిల్ 24:** అమెరికాలో అత్యంత ఆదరణ పొందిన హెచ్ 1బీ వీసా కార్యక్రమం భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తూ రిపబ్లికన్ పార్టీ సభ్యులు కాంగ్రెస్‌లో ఒక కొత్త బిల్లును ప్రవేశపెట్టారు. కాంగ్రెస్ సభ్యుడు ఎలీ క్రేన్ సభలో ప్రవేశపెట్టిన ఈ బిల్లు, హెచ్ 1బీ వీసా విధానంలో సమూల మార్పులను ప్రతిపాదించింది. కొత్తగా హెచ్1బీ వీసాల జారీని మూడేళ్లపాటు పూర్తిగా నిలిపివేయాలని ప్రతిపాదించారు. ఈ విరామ సమయంలో వీసా వ్యవస్థను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయవచ్చని బిల్లు మద్దతుదారులు చెబుతుండగా, ఇది అమెరికాలోని కంపెనీలు, విద్యార్థులు, ఉద్యోగులపై తీవ్ర ప్రభావం చూపుతుందని కార్పొరేట్ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఎండ్ హెచ్1బీ వీసా అబ్యూస్ యాక్ట్ ఆఫ్ 2026 పేరుతో ప్రవేశపెట్టిన ఈ బిల్లులో అత్యంత కఠినమైన నిబంధనలు ఉన్నాయి. ఈ బిల్లు చట్టంగా మారితే, 1952 నాటి ఇమిగ్రేషన్ అండ్ నేషనాలిటీ చట్టాన్ని సవరించాల్సి ఉంటుంది. కొత్తగా హెచ్1బీ వీసాల జారీని మూడేళ్ల పాటు నిలిపివేస్తారు. ఈ కాలంలో ఇప్పటికే వీసాపై ఉన్నవారు క్రమంగా దేశం విడిచి వెళ్లాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఏటా 65వేలకుపైగా వీసాలు జారీ చేస్తుండగా, ఆ సంఖ్యను 25వేలకు పరిమితం చేయాలి. ప్రస్తుతం ఉన్న మినహాయింపులను కూడా తొలగించాలని ప్రతిపాదించారు. ఇక కనీస వేతనం పరంగా హెచ్1బీ ఉద్యోగికి కనీస వార్షిక వేతనం 2 లక్షల డాలర్లు సుమారు రూ. 1.66 కోట్లు ఉండాలి. ప్రస్తుత లాటరీ విధానాన్ని రద్దు చేసి, అత్యధిక వేతనం ఉన్న వారికి ప్రాధాన్యత ఇచ్చే విధానాన్ని తీసుకురావాలి. హెచ్1బీ వీసాదారుల జీవిత భాగస్వాములు, పిల్లలకు ఇచ్చే డిపెండెంట్ వీసాలను నిషేధించాలి. వీసాదారులు శాశ్వత నివాసం (గ్రీన్ కార్డ్) కోసం దరఖాస్తు చేసుకోకుండా నిరోధించాలి. ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని కూడా రద్దు చేయాలి. ఈ బిల్లును ప్రవేశపెట్టిన ఎలీ క్రేన్ మాట్లాడుతూ విదేశీయులకు బదులు అమెరికన్లకే ఉద్యోగాల్లో తొలి ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రస్తుత హెచ్1బీ విధానం అమెరికన్ల ఉద్యోగ అవకాశాలను దెబ్బతీస్తోందని ఆరోపించారు. మా ప్రభుత్వం భారీ కార్పొరేషన్ల లాభాల కోసం కాకుండా కష్టపడి పనిచేసే పౌరుల కోసం పనిచేయాలని వ్యాఖ్యానించారు. ఇతర రిపబ్లికన్ సభ్యులు కూడా చౌకగా లభించే విదేశీ కార్మికులతో అమెరికన్లను భర్తీ చేస్తున్నారని, ఈ మోసాన్ని అరికట్టాలంటూ ఇదే విధమైన అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ప్రస్తుతానికి ఈ బిల్లు కేవలం సభలో ప్రవేశపెట్టారు. ఇది చట్టంగా మారాలంటే కాంగ్రెస్ ఉభయ సభల ఆమోదం పొంది, అధ్యక్షుడు సంతకం చేయాల్సి ఉంటుంది. అయితే ఈ ప్రక్రియకు చాలా సుదీర్ఘ సమయం పడుతుంది.



# పెరిగిన సౌర విద్యుత్ లభ్యత.. తగ్గిన విద్యుత్ ధరలు

### డిమాండ్ లేని సమయాల్లో ఎక్కువ సరఫరా
### టైమ్ ఆఫ్ ది డే కింద రాయితీలో కోత
### పీక్ సమయంలో రూ.1.50 వడ్డింపు

**హైదరాబాద్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** విద్యుత్ బహిరంగ మార్కెట్‌లో ధరలు గణనీయంగా తగ్గాయి. సౌర విద్యుత్ లభ్యత పెరగడం, డిమాండ్ లేని సమయాల్లో కరెంట్ సరఫరా ఎక్కువగా ఉండటంతో ఈ ధరలు తగ్గుముఖం పట్టాయి. బహిరంగ మార్కెట్‌లో ట్రేడింగ్ ధరల వివరాలను చూస్తే విద్యుత్ ధర యూనిట్‌కు 40 పైసలకు పడిపోయింది. దీనికి తగినట్లుగా ట్రైమ్ ఆఫ్ డే అమలు చేయడంతో విద్యుత్ నియంత్రణ కమిషన్ నిర్ణయం ప్రకారం, డిమాండ్ లేని సమయాల్లో ఉదయం 10 నుండి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్‌ను వినియోగిస్తే యూనిట్‌కు 50 పైసలు రాయితీ కూడా లభిస్తోంది. మరోపక్క ఓపెన్ మార్కెట్ కొనుగోళ్లు చూస్తే తెలంగాణ డిస్కంలు, పారిశ్రామిక వినియోగదారులు ఓపెన్ మార్కెట్ నుంచి సుమారు 1636 మెగావాట్ల విద్యుత్‌ను అధిక డిమాండ్ సమయంలో కొనుగోలు చేస్తున్నాయి. మార్చి, ఏప్రిల్ లో తెలంగాణలో విద్యుత్ వినియోగం రికార్డు స్థాయిలో 341 మిలియన్ యూనిట్లకు పైగా నమోదైంది, గరిష్ఠ డిమాండ్ 15,944 మెగావాట్లు దాటింది. గృహ వినియోగదారులకు రెగ్యులర్ టారిఫ్ చూస్తే 50 యూనిట్ల వరకు యూనిట్‌కు రూ.1.45 తో పాటు, కన్స్యూమర్ ఛార్జీలు మరో రూ.25గా ఉన్నాయి. అదే 51 నుండి 100 యూనిట్లు వరకూ యూనిట్ ధర రూ.2.60, కన్స్యూమర్ ఛార్జీల కింద రూ.30, 101 నుండి 200 యూనిట్లు వరకు రూ.3.30, రూ.4.30, కన్స్యూమర్ ఛార్జీలు మరో రూ.50, ఇక 200 యూనిట్లు వరకు యూనిట్ రూ.5 నుండి రూ.9.50 వరకు వినియోగ పరిమితిని బట్టి చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఈ ధరలు బహిరంగ మార్కెట్ సరళిపై ఆధారపడి మారుతూ ఉంటాయి. అలాగే రాష్ట్రంలో హెచ్‌టీ, వాణిజ్య వర్గాల వారికి డిమాండ్ లేని సమయంలో విద్యుత్తు వినియోగానికి ఇస్తున్న రాయితీలను ఎత్తివేయాలని ఇప్పటికే తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలు తెలంగాణ విద్యుత్తు నియంత్రణ కమిషన్‌కు ప్రతిపాదించాయి. కాగా, ప్రస్తుతం రాష్ట్రంలో ప్రధానంగా సౌర విద్యుత్తు అందుబాటులోకి వచ్చినప్పుడు ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల దాకా కరెంటును వినియోగిస్తే యూనిట్‌కు 50పైసల రాయితీ ఇస్తూ తెలంగాణ విద్యుత్ నియంత్రణ కమిషన్ నిర్ణయం తీసుకుంది. గతంలో ఈ రాయితీ రూ.1 ఉండగా కొన్ని నెలల కింద దాన్ని పంపిణీ సంస్థలు నిలిపివేశాయి. అయితే టైమ్ ఆఫ్ డే ప్రకారం డిమాండ్ లేని సమయంలో రాయితీ, డిమాండ్ ఉన్న సమయంలో అదనపు చార్జీల వసూలును పునరుద్ధరించింది. గతంలో రూ.1గా ఉన్న రాయితీని 50 పైసలు చేసింది. మరోవైపు డిమాండ్ అధికంగా(పీక్) ఉన్న సమయంలో ఉదయం 6 నుంచి 10 గంటల మధ్య, మళ్లీ సాయంత్రం 6 నుంచి రాత్రి 10 గంటల మధ్య విద్యుత్తు వినియోగానికి అదనంగా రూ.1.50 చార్జీ విధించింది. కాని గతంలో ఇది రూ.1గా ఉండేది. ఇక రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల దాకా సాధారణ చార్జీలను వర్తింపజేయనున్నారు. ఇవి హెచ్‌టీ, వాణిజ్య వర్గాల వారికి అమలు కానున్నాయి.



## భీమేశ్వర స్వామిని దర్శించుకున్న డిజిపి శివధర్‌రెడ్డి

**వేములవాడ, ప్రభాతవార్త:** వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి క్షేత్రం అనుబంధ ఆలమైన శ్రీ భీమేశ్వర స్వామి దేవాలయాన్ని రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి శుక్రవారం దర్శించుకున్నారు. డీజీపీ ఆలయ వసతి గృహానికి చేరుకున్న సందర్భంగా పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. అనంతరం ఆలయంలోకి ప్రవేశించిన ఆయనకు ఆలయ అర్చకులు, వేద పండితులు స్వస్తి వాచకంతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా భీమేశ్వర స్వామి వారిని డీజీపీ శివధర్ రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి మండపంలో అర్చకులు, వేద పండితులు తీర్థ ప్రసాదం అందజేసి, ఆశీర్వచనం చేశారు. ఆలయ డీఈఓ భాస్కర శర్మ స్వామివారి శేష వస్త్రం, లడ్డూ ప్రసాదం, చిత్ర పటాన్ని డీజీపీకి అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, జిల్లా ఎస్పీ మహేష్ బిగితే, వేములవాడ ఆర్డీఓ రాధాబాయి, వేములవాడ డిఎస్పీ శ్రీనివాసులు, ఆలయ ఏఈఓ జి.అశోక్‌కుమార్ తదితరులున్నారు.

## పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవ వ్యాసరచన పోటీల్లో విజేతలకు అవార్డులు

**హైదరాబాద్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** గత యేడాది అక్టోబరు 21న జరిగిన పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా పోలీసు సిబ్బం దికి నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు డిజిపి శివధర్‌రెడ్డి అవార్డులు అందజేశారు. డిజిపి కార్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో రెండు కేటగిరీలకు సంబంధించి అవార్డులను అందించారు. మొదటి కేటగిరి కింద కానిస్టేబుల్ నుంచి ఎఎస్ఐ వరకు జరిగిన పోటీల్లో పనిప్రదేశంలో లింగవివక్ష అనే అంశంపై వ్యాసరచనపై రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 17వ టిఎస్ఎస్‌పి బెటాలియన్‌కు చెందిన కానిస్టేబుళ్లు దాసరి ప్రశాంత్, కావేరి దీపికలకు డిజిపి మొదటి బహు మతి అందించారు. కరీంనగర్ పిటిసికి చెందిన కానిస్టేబుల్ రవికుమార్, ఇబ్ర హీంపట్నం మూడో బెటాలియన్‌కు చెందిన ఎ.రాజుకు ద్వితీయ బహుమతిని డిజిపి అందించారు. కరీంనగర్ జిల్లా చొప్పదండి పోలీసుస్టేషన్‌కు చెందిన స్వర్ణలత, గద్వాల జిల్లాకు చెందిన శ్రీలతకు తృతీయ బహుమతిని అందించారు. రెండో కేటగిరిలో ఎస్ఐ అంతకు పైస్థాయి అధికారులకు నిర్వహించిన పోటీల్లో ములుగు జిల్లా ఆర్ఐ వెంకట నారాయణ, హైదరాబాద్, చార్మినార్ జోన్ మహిళా ఎస్ఐ మౌనిక మొదటి బహుమతి అందుకున్నారు. వరంగల్ పిటిసికి చెందిన ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్, ఇబ్రహీంపట్నం మూడో బెటాలియన్ ఆర్ఎస్ఐ విఆర్ చౌదరి ద్వితీయ బహుమతి, సిఐడి ఎస్ఐ ఖాజా హఫీజున్నీసా బేగం, గద్వాల జిల్లా భరోసా కేంద్రం ఎస్ఐ తారక తృతీయ బహుమతి గెలుపొందారు. విజేతలకు డిజిపి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సంక్షేమ విభాగం ఐజి గజారావు భూపాల్, డిఎస్‌పి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎక్కడ చదవాలి?.. సందిగ్ధంలో హార్టికల్చర్ విద్యార్థులు

### ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ నిర్ణయంపై ఆగ్రహం

**హైదరాబాద్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త :** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోనూ హార్టికల్చర్ కోర్సులను ప్రారంబించాలన్న ప్రయత్నాలు సరికావని రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయ విద్యార్థులు స్పష్టం చేస్తున్నారు. ఈ నిర్ణయం విధానపరంగా సరైనది కాదని తేల్చి చెబుతున్నారు.
ప్రస్తుతం బిఎస్సి హార్టికల్చర్ కోర్సులు కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోనే నిర్వహించబడుతున్నాయని గుర్తు చేస్తున్నారు. ఉద్యాన విద్యకు ప్రత్యేకంగా విశ్వవిద్యాలయం ఉన్నప్పటికీ, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా హార్టికల్చర్ కోర్సులను ప్రారంభించడం ఉద్యాన విద్య స్వతంత్రతను దెబ్బతీయడమేనని ప్రభుత్వానికి స్పష్టం చేస్తున్నారు. హార్టికల్చర్‌కు సంబంధించిన అన్ని కోర్సులు, పరిశోధన, విద్యా కార్యక్రమాలు పూర్తిగా సంబంధిత ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోనే కొనసాగాలని డిమాండ్ చేస్తున్నారు.
ఈ విషయమై విద్యార్థులు కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం విసికి ఇప్పటికే వినతిపత్రం అందించారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత అధికారులు ఈ విషయంపై తక్షణమే స్పందించి హార్టికల్చర్ కోర్సుల నిర్వహణను కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధికే పరిమితం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదివరకే ప్రకటించిన నిర్ణయాలను పునః సమీక్షించాలని కోరుతున్నారు.

# నకిలీలకు అడ్డుకట్ట.. రైతుకు భరోసా!

### నాణ్యమైన విత్తనం అందించడమే లక్ష్యం
### పంట మార్పిడితోనే పసిడి లాభాలు
### రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** రైతులకు నమ్మకమైన, అధిక దిగుబడిని ఇచ్చే నాణ్యమైన విత్తనాలను అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో కల్తీ విత్తనాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఈ పరిస్థితుల్లో వారిని నాణ్యమైన విత్తనాల వినియోగం వైపు మళ్లించాల్సి న బాధ్యత అందరిపై ఉందని అన్నారు. ఈ విషయమై శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణలో పత్తి సాగు అధికంగా ఉందని, ఏటా నకిలీ పత్తి విత్తనాల వల్ల రైతులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, కట్టడి చేసేందుకు కఠిన చర్యలు తీసుకో వాలని అధికారు లకు సూచించారు. వరి సాగుపైనే కాకుండా, రైతులు లాభదాయకమైన ఇతర పంటల వైపు రైతులు మొగ్గు చూపాలని ఆయన సూచించారు. వరికి ప్రత్యామ్నాయంగా పెసర, కంది, మినుము, శనగ, వేరుశనగ, నువ్వులు వంటి పంటలను సాగు చేయడం ద్వారా ఆదాయాన్ని పెంచుకో వచ్చని తెలిపారు. విత్తనాభివృద్ధి సంస్థ నేరుగా రైతులతో అనుసంధానమై విత్తన ఉత్పత్తి చేపడుతోందని, కఠినమైన ప్రమాణ పరీక్షల తర్వాతే వాటిని ధ్రువీకరించి రైతులకు అందజేస్తున్నామని భరోసా ఇచ్చారు. రానున్న ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జిల్లాల్లో విత్తనాల కొరత లేదని వెల్లడించారు. సన్న రకాలు బీపీటీ 5204, ఆర్ఎన్ఆర్ 15048, కెఎన్ఎం 1638 అందుబాటులో ఉన్నాయని చెప్పారు. అలాగే దొడ్డు రకాలు కెఎన్ఎం 118, ఎమ్‌టియు 1010 కూడా రైతులకు అందించేందుకు సిద్ధంగా ఉన్నాయని వివరించారు. ప్రభుత్వం సూచించిన ఈ రకాలను మాత్రమే డీలర్లు విక్రయించాలని, విత్తనాభివృద్ధి సంస్థ విత్తనాలను ప్రతి విత్తన డీలర్ అమ్మాలని స్పష్టం చేశారు. అలాగే పచ్చిరొట్ట ఎరువులైన జీలుగ, జనుము విత్తనాలను సకాలంలో అందజేస్తామని పేర్కొన్నారు.

# రేషన్‌కార్డు ఇకెవైసి అప్‌డేట్ చేయండి

**హైదరాబాద్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** రేషన్ కార్డుదుర్వినియోగాన్ని అడ్డుకు నేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రేషన్‌కార్డు వినియోగదారు లందరూ ఇకెవైసి ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసింది. అర్హులైన లబ్ధిదారులు తమ కార్డు వివరాలను అప్‌డేట్ చేసుకోవాలి. అలా చేయకపోతే కార్డును రద్దు చేస్తారు. ఇప్పటికే లక్షలాది రేషన్ కార్డులను ఈకెవైసి నిబంధ నలు పాటించలేదనే కారణంతో రద్దు చేశారు. ప్రభుత్వం అందించే ఉచిత రేషన్‌తో పాటు ఇతర పథకాలను పొందాలంటే.. రేషన్ కార్డు ఇకెవైసి తప్పనిసరి. అందుకని ప్రతి కార్డుదారుడు తమ ఆధార్ వివరాలను రేషన్ కార్డుతో అనుసంధానించి.. వేలిముద్రల ద్వారా ధృవీకరణ పూర్తి చేసుకోవా ల్సిందే. రేషన్ కార్డులో పేరున్న వారంతా ప్రస్తుతం జీవించే ఉన్నారా, వారి పేరు మీద ఒక్కటే కార్డు ఉందా, అనేక ప్రాంతాల్లో కార్డు జారీ చేశారా అనే విషయాలను నిర్ధారించుకోవడానికి ఈ ప్రక్రియ ఉపయోగపడుతుంది.
ఇకెవైసి ప్రక్రియ ద్వారా పారదర్శకత పెరుగుతుంది. రేషన్ కార్డుదారులు తమ సమీపంలోని రేషన్ దుకాణానికి వెళ్లి, అక్కడి డీలర్ వద్ద ఉన్న ఈపోస్ యంత్రం ద్వారా తమ వేలిముద్రలను వేయాలి. దీనినే బయో మెట్రిక్ అథెంటికేషన్ అంటారు. ప్రభుత్వం నిర్ణ యించిన గడువులోగా ఈ ప్రక్రియ పూర్తి చేయని వారి పేర్లను కార్డు నుంచి తొలగించే అవకాశం ఉంది. కొన్ని సందర్భాల్లో మొత్తం కార్డునే రద్దు చేసే అధికారం అధికారులకు ఉంటుంది. ఇప్పటికే క్షేత్రస్థాయి పరిశీలనలో ఈకేవైసీ అప్‌డేట్ చేయని కారణంతో దేశవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో బోగస్ కార్డులను అధికారులు గుర్తించి తొలగించారు. వన్ నేషన్-వన్ రేషన్‌కార్డ్ పథకం ద్వారా మీరు ఉన్న దగ్గరలోని రేషన్‌షాపులో ఇకెవైసి పూర్తి చేసుకునే అవకాశం ఉంది.

# ఆధార్‌కార్డు లేక ఉన్నత చదువులకు అడ్డంకి

### కార్డు మంజూరుకు చిన్నారెడ్డి హామీ

**హైదరాబాద్ (బేగంపేట) ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** తల్లిదండ్రుల బర్త్ సర్టిఫికెట్‌లో ఉన్న లోపాల కారణంగా చిన్నారి సాయికృపకు ఆధార్‌కార్డు జారీకి సంకటంగా మారింది. ఉన్నత చదువు, హాస్టల్‌లో అడ్మిషన్, బ్యాంకు సహా ఇతర అవసరాలకు ఆధార్‌కార్డు తప్పనిసరి కావడంతో చిన్నారి సాయి కృప భవితవ్యం ఆధార్‌కార్డు లేక ప్రశ్నార్థకంగా మారింది. దీంతో చిన్నారి ఆధార్‌కార్డు కోసం శుక్రవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌కు వచ్చి సిఎం ప్రజావాణిలో దరఖాస్తు అందించింది. చిన్నారి సాయికృప కర్మన్‌ఘాట్ నందనవనం ప్రభుత్వ పాఠశాలలో నాలుగవ తరగతి చదువుతున్నది. చిన్నారి తల్లిదండ్రులు భవన నిర్మాణ కార్మికులు కావడంతో పాపకు ఆధార్ అత్యవసరమైంది. దీంతో బాలిక శుక్రవారం ప్రజావాణిలో సిఎం ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌ఛైర్మన్ డా.జి.చిన్నారెడ్డిని కల్సి తన సమస్యను వివరించింది. స్పందించిన డా.చిన్నారెడ్డి ఆధార్ మంజూరు చేసేలా చూస్తానంటూ హామీ ఇవ్వడంతో పాప ఆనందాన్ని వ్యక్తం చేసింది.




సిఎం ప్రజావాణిలో చిన్నారి నుంచి దరఖాస్తు స్వీకరిస్తున్న డా.జి.చిన్నారెడ్డి

**సిఎం ప్రజావాణిలో అందిన దరఖాస్తులు 248**

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో శుక్రవా రం నిర్వహించిన 216వ సిఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 248 దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 79 దరఖాస్తులు, రెవెన్యూ శాఖకు సంబంధించి 31 దరఖాస్తులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం 78 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబం ధించి 60 దరఖాస్తులు అందాయి. సిఎం ప్రజా వాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌ఛైర్మన్ డా.జి. చిన్నారెడ్డి దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలు పరిష్కరిం చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సూర్య ప్రకాష్, ఏసీపీ ఉమేందర్, ఎన్ఆర్ఐ సలహా మం డలి వైస్‌ఛైర్మన్ మంద భీంరెడ్డి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఆత్మహత్యలు వద్దు.. ఉద్యమాలతోనే హక్కులు సాధించుకుందాం: ఎంపి ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్ ఏప్రిల్ 24, ప్రభాతవార్త :** ఆత్మహత్యలు సమస్యలకు పరిష్కారం కావని, చర్చలు మరియు పోరాటాల ద్వారానే డిమాండ్లు సాధించుకోవాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య ఉద్యమకారులకు పిలుపునిచ్చారు. నర్సంపేటలో జరిగిన ఆత్మహత్య ప్రయత్నాలు, కార్మికుడు శంకర్‌గౌడ్ మరణం పట్ల ఆయన తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శుక్రవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆవేశంలో తీసుకునే నిర్ణయాల వల్ల విలువైన ప్రాణాలు కోల్పోవడమే కాకుండా, వారిపై ఆధారపడ్డ భార్యాపిల్లలు, కుటుంబ సభ్యులు అనాథలవుతారని కృష్ణయ్య ఆవేదన వ్యక్తం చేశారు. 'బతికి పోరాడి సాధించాలి తప్ప, ప్రాణాలు తీసుకోవద్దు' అని ఆయన హితవు పలికారు. ఆర్టీసీ కార్మికుల సమ్మె వల్ల రాష్ట్రవ్యాప్తంగా జనజీవనం స్తంభించిందని, ముఖ్యంగా పరీక్షల సమయం, పెళ్లిళ్ల సీజన్ కావడంతో సామాన్యులు, గ్రామీణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారని పేర్కొన్నారు. పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసినట్లుగానే, తెలంగాణలో కూడా సాధ్యమేనని, దీనిపై ప్రభుత్వం వెనక్కి తగ్గకూడదని అన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకముందే, అసాంఘిక శక్తులు ఈ ఉద్యమాన్ని తప్పుదోవ పట్టించకముందే ప్రభుత్వం కార్మికుల న్యాయమైన డిమాండ్లను అంగీకరించాలని కృష్ణయ్య స్పష్టం చేశారు.

# జూన్ 2 నాటికి పూర్తిస్థాయిలో సేవలు

### ఉద్యోగుల కేటాయింపుపై ఎవరికీ అపోహాలు వద్దు
### రైతు డిస్కం సిఎండి ముషారఫ్ ఫరూఖీ

**హైదరాబాద్, ఏప్రిల్ 24,ప్రభాత వార్త:** రాష్ట్ర ప్రభుత్వం రైతులకు, నీటి పారుల, ఇతర కీలక రంగాలకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించే లక్ష్యంతో "తెలంగాణ రైతు విద్యుత్ పంపిణీ సంస్థ "(రైతు డిస్కం)'ను ఏర్పాటు చేసిందని ఈ సంస్థకు అవసరమైన అన్ని అనుమతులు దశలవారీగా పొందుతూ, ఈ ఏడాది జూన్ 2 నాటికి పూర్తి స్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించేందుకు సిద్ధమవు తున్నామని రైతు డిస్కం చైర్మన్ సిఎండీ ముషారఫ్ ఫరూఖీ అన్నారు. ఈమేరకు శుక్రవారం విద్యుత్ ఉద్యోగులు కార్మిక సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సిఎండీ మాట్లాడుతూ రైతు డిస్కం నిర్మాణం సమగ్రంగా, సమర్థవంతంగా ఉండేలా ప్రభుత్వం దృష్టి సారిస్తోందని ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా సంస్థ రూపకల్పన జరుగుతుందన్నారు. ప్రస్తుతం ఉన్న దక్షిణ-ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థలతో పాటు రైతు డిస్కం కూడా తెలంగాణ విద్యుత్ వ్యవస్థలో కీలక భాగంగా పనిచేస్తుందని తెలిపారు. ప్రాథమికంగా సుమారు 2000 మంది ఉద్యోగులతో రైతు డిస్కం కార్యకలాపాలు ప్రారంభించనున్నామని, అవసరాన్ని బట్టి ఈ సంఖ్యను మరింత పెంచే అవకాశముందని తెలిపారు. ఉద్యోగుల జీతభత్యాలు, నియమ, నిబంధనలు ఇతర విద్యుత్ సంస్థల మాదిరిగానే కొనసాగుతాయని స్పష్టం చేశారు. అధికారులు, ఉద్యోగుల నియామకాలు, విధుల కేటాయింపులపై యూనియన్, అసోసియేషన్ నాయకులతో సవివరంగా చర్చించారు. రైతు డిస్కం ఏర్పాటు ద్వారా విద్యుత్ సంస్థల ఉద్యోగులకు మరింత ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. ఉద్యోగుల కేటాయింపులపై ఎలాంటి అపోహాలు లేకుండా, గందరగోళం తలెత్తకుండా పారదర్శకంగా ప్రక్రియను నిర్వహించడమే ఈ సమావేశం ముఖ్య ఉద్దేశ్యమని పేర్కొన్నారు. ప్రస్తుతం దక్షిణ, ఉత్తర డిస్కంల నుండి ఉద్యోగులను డిప్యూటేషన్‌పై సమకూర్చుకున్నామని, భవిష్యత్తులో ట్రాన్స్‌కో జెన్‌కో సంస్థల నుండి కూడా మానవ వనరుల సమీకరణపై నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. ఈ సమావేశంలో వివిధ విద్యుత్ ఉద్యోగ సంఘాలు, కార్మిక సంఘాలకు చెందిన దాదాపు 65 మంది నాయకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిఎండి ముషారఫ్ ఫరూఖీ



## పరిరక్షణ కమిటీల ఏర్పాటుతోనే చెరువులకు రక్షణ

### మంత్రి ఉత్తమ్‌కు రైతు కమిషన్ నివేదిక

**హైదరాబాద్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** చిన్నపాటి సాగునీటి వనరుల పునర్వ్యవస్థీకరణ, చెరువుల పరిరక్షణ కమిటీల ఏర్పాటు, చెరువుల మట్టి తొలగింపు అంశాలపై రూపొందించిన సమగ్ర నివేదికను రాష్ట్ర సాగునీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి రైతు కమిషన్ సమర్పించింది. చెరువుల పరిరక్షణకు కఠిన చర్యలు తీసుకోవాలని కోరింది. ఈ మేరకు శుక్రవారం రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి నేతృత్వంలో మంత్రి ఉత్తమ్‌ను కమిటీ కలిసింది. నివేదిక రూపొందించే క్రమంలో కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి నాయకత్వంలో సాగునీటిశాఖ, వ్యవసాయశాఖ అధికారులు, వలంతరి ప్రతినిధులు, నిపుణులతో పలు సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాల్లో చెరు వుల పరిరక్షణకు స్థిరమైన వ్యవస్థ అవసరమని, నీటినిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు (పూడికతీత) డిసిల్టింగ్ ప్రాముఖ్యత తదితర అంశాలపై సవివరంగా చర్చించారు. సమావేశాల్లో జరిగిన చర్చల ఆధారంగా చెరువుల పరిరక్షణ కమిటీల ఏర్పాటు, డిసిల్టింగ్ కార్యక్రమాల అమలుకు సంబంధించిన సమగ్ర నివేదికను కమిషన్ రూపొందించింది. మంత్రిని కలిసిన వారిలో కమిషన్ సభ్యులు కెవి నర్సింహా రెడ్డి, భవాని మరికంటి, గడుగు గంగాధర్, సునీల్,రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, సభ్య కార్యదర్శి గోపాల్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చెరువుల పరిరక్షణ, సమర్థవంతమైన నీటి వినియోగం ద్వారా రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనం కలిగించడమే లక్ష్యంగా ప్రభుత్వం కట్టుబడి ఉందని కమిషన్ పేర్కొంది.

## పెండింగ్ బిల్లులు చెల్లించండి

### తెలంగాణ సర్పంచ్‌ల సంఘం జెఏసి డిమాండ్

**హైదరాబాద్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** పెండింగ్ బిల్లులు చెల్లించాలని తెలంగాణ సర్పంచ్‌ల సంఘం జెఏసి ప్రజాభవన్‌లో నిరసన తెలిపింది. పంచాయతీ రాజ్ జాతీయ దినోత్సవం సందర్భంగానైనా మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేసింది. గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసిన పెండింగ్ బిల్లులు చెల్లించాలని ప్రజాభవన్ ముందు నిరసన తెలిపామని తెలంగాణ సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ శుక్రవారం తెలిపారు. ప్రభుత్వం ఏర్పడి 30 నెలలు పూర్తయినా మాజీ సర్పంచుల బిల్లుల చెల్లింపు విషయంలో ప్రభుత్వం కక్షసాధింపు దోరణితో ముందుకు వెళుతోందని మండిపడ్డారు. అనేకమంది మాజీ సర్పంచులు ఆర్థిక ఇబ్బందులకు తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకున్నారని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం జెఏసి కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుంటి మధుసూదన్‌రెడ్డి, కార్యదర్శి కేశబోయిన మల్లయ్య యాదవ్,బొట్ల రవీందర్, అరవింద్‌రెడ్డి, గౌరేటి శ్రీధర్‌రెడ్డి, వెంకటరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు స్టేషన్‌లో న్యాయవాదికి బ్రీత్ అనలైజర్ పరీక్షపై హైకోర్టులో విచారణ

**హైదరాబాద్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** గాయని మంగ్లీపై ఫిర్యాదు చేసిన కేసులో న్యాయవాది సుబ్బారావుకు పంజాగుట్ట పోలీసు స్టేషన్‌లో బ్రీత్ అనలైజర్ పరీక్ష చేయడంపై హైకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. దీనిపై న్యాయవాదులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయడంతో పాటు ఇదే అంశంపై హైకోర్టులో ఫిర్యాదు చేయడం తెలిసిందే. ఈ ఫిర్యాదుపై హైకోర్టు కూడా పోలీసుల వ్యవహార శైలిపై ఆగ్రహం వ్యక్తం చేయడం విదితమే. కాగా దీనిపై శుక్రవారం విచారణ చేబట్టిన హైకోర్టు పోలీసుల తీరును తప్పుపట్టడంతో పాటు ఈ ఘటనపై పోలీసు స్టేషన్‌లోని సిసి ఫుటేజిని భద్రపరి చారా...? అని జిపిని ప్రశ్నించింది. హైకోర్టు ప్రశ్నకు బదులిస్తూ సిసి టివి ఫుటేజిని భద్రపరచినట్లు జిపి తెలిపారు. మంగ్లీ వల్ల ప్రాణహాని వుందని డిజిపికి ఫిర్యాదు చేస్తే ఎలాంటి చర్యలు తీసుకోలేదని న్యాయవాది సుబ్బారావు హైకోర్టు తెలపగా దీనిపై సమాధానం చెప్పాలని ధర్మాసనం జిపిని ప్ర శ్నించగా విచారణ చేస్తానని జిపి తెలిపారు. న్యాయవాదికి బ్రీత్ అనలైజర్ పరీక్షపై కౌంటర్ దాఖలుకు సమయం కావాలని జిపి కోరగా దీనికి అంగీ కరించిన హైకోర్టు దీనిపై విచారణను వాయిదా వేసింది.

# కౌమార బాలికల సాధికారతకు స్నేహా సమ్మర్ ప్రోగ్రామ్

### బాలికల మొబిలిటీ, ఉన్నత విద్య, నైపుణ్య శిక్షణ, భద్రతకు పెద్దపీట

**హైదరాబాద్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటూ కౌమర బాలికల సాధికారత, విద్యా కొనసాగింపు, ఆరోగ్య పరిరక్షణ, భద్రత, నాయకత్వ లక్షణాల అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం 'స్నేహా సమ్మర్ ప్రోగ్రామ్'ను సిద్ధం చేసింది. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు సెర్ప్, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అన్ని విభాగాలను సమన్వయం చేస్తూ కార్యాచరణ రూపొందించారు. వేసవి కాలంలో పాఠశాలలు మూతపడడంతో బాలికలు విద్య, నైపుణ్యాల అభి వృద్ధి నుంచి దూరమవడం, బాల్య వివాహాలు, కూలీలకు పోవడం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. గ్రామ స్థాయిలో చైతన్యం కల్పించి బాలికల వ్యక్తిత్వ వికాసానికి అనుకూల వాతావరణం కల్పించడమే లక్ష్యంగా స్నేహా సమ్మర్ ప్రోగ్రామ్‌ను డిజైన్ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతీ గ్రామంలో స్నేహా సంఘాలను ఏర్పాటు చేసి, 15-18 ఏళ్ల మధ్య ఉన్న కౌమర బాలికలను సమీకరి స్తారు. ఇప్పటివరకు రాష్ట్రంలో సుమారు 9 వేలకు పైగా స్నేహా సంఘాలు ఏర్పాటు కాగా..90 వేలకు పైగా బాలికలు సభ్యులుగా చేరారు. ఈ వేసవిలో సభ్యుల సం ఖ్యను రెట్టింపు చేయడమే లక్షంగా స్త్రీశిశు సంక్షేమశాఖ పెట్టుకుంది. బాలికల భద్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తూ సేఫ్టీ ప్లాన్‌ను రూపొందించనున్నారు. ఈవ్‌టీజింగ్, వేధింపుల వంటి సమస్యలను అరికట్టేందుకు పోలీస్ శాఖతో సమన్వయం కల్పించి చర్యలు తీసుకుంటారు. గ్రామాల్లో వీధి దీపాల కొరత వంటి సమస్యలను సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు చేపడతారు. స్థానిక సమస్యల పరిష్కారంలో స్నేహా సంఘాల ద్వారా అధికారులకు వినతిపత్రాలు ఇవ్వాలని ప్రోత్సహిస్తారు.
బాల్యవివాహాలు, టీనేజ్ గర్భధారణల నివారణ కోసం బాలికలు, వారి తల్లిదండ్రులతో ప్రమాణాలు చేయించడమే కాకుండా, గ్రామ స్థాయిలో ప్రమాదాలను గుర్తించి తక్షణ చర్యలు తీసుకునే విధంగా పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయనున్నారు. అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది, స్వయం సహాయక సంఘాల సభ్యులు కలిసి బృందాలుగా పనిచేసి కార్యక్రమాన్ని గ్రామస్థాయికి తీసుకెళ్తారు. జిల్లా స్థాయిలో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు, బడ్జెట్ కేటాయింపులు సిద్ధం చేసి, యాప్ ఆధారిత ట్రాకింగ్ వ్యవస్థ ద్వారా ప్రతి బాలికకు అవసరమైన సేవలు అందే లా పర్యవేక్షణ చేస్తారు. వారానికి ఒకసారి క్రీడలు, అవ గాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, సమ్మర్ క్యాంప్‌లను కొనసాగించి చివర్లో రాష్ట్రస్థాయి బాలల పార్లమెంట్ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా కౌమర బాలికల విద్య, ఆరోగ్యం, భద్రత, ఆర్థిక స్వావలంబన, నైపుణ్య శిక్షణ, భద్రత విషయాల్లో గణనీయమైన మార్పులు తీసుకురావడమే లక్ష్యంగా స్నేహా సమ్మర్ ప్రోగ్రామ్ మంచి ఫలితాలు సాధించనుంది. ఈ కార్యక్రమంపై జిల్లాల డిఆర్డీఓ, సంక్షేమశాఖ అధికారులతో సెర్ప్‌సిఈవో దివ్యా దేవరాజన్ వీడియో కాన్ఫరెన్ నిర్వహించారు. స్నేహా సమ్మర్ ప్రోగ్రామ్‌పై అవగాహన కల్పించారు. కౌమర బాలికల స్వేచ్ఛ, ఆత్మ విశ్వాసానికి మొబిలిటీ ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రతి గ్రామీణ బాలిక సైకిల్ తొక్కడం నేర్చుకోవాలని, ఇది భవిష్యత్తులో టూవీలర్ నేర్చుకునేందుకు దోహదపడుతుందని తెలిపారు. ఈ క్రమంలో సైకిల్ శిక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ కోచ్‌లను నియమించి వారికి గౌరవ వేతనం చెల్లిస్తామన్నారు. అలాగే ఈ సమ్మర్ ప్రోగ్రా మ్‌లో ఆరోగ్య పరీక్షలు, హెల్త్ ప్రొఫైల్ కార్డులు, విద్యా కొన సాగింపు ప్రణాళికలు, ఓపెన్ స్కూల్ అవకాశాలు, బ్యాంక్ ఖాతాల ప్రారంభం, కుల, ఆదాయం, నివాస, ఆధార్ వంటి అవసరమైన ధృవపత్రాల పొందడం వంటి అంశాలను అమలు చేయాలన్నారు. బాలికల ఉన్నత విద్య కొనసాగించేందుకు అవసరమైన పత్రాలను వేసవిలోనే సిద్ధం చేయాలని అధికారులను ఆమె ఆదేశించారు. స్నేహా సంఘాల బ్యాంక్ ఖాతాల ప్రారం భంలో ఉన్న ఇబ్బందులను పరిష్కరించేందుకు స్టేట్ లెవల్ బ్యాంకర్స్ కమిటీకి ఇప్పటికే ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.

## ఆర్టీసీ సమ్మెకు జనసేన మద్దతు

**హైదరాబాద్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** ఆర్టీసీ కార్మికులు తమ డిమాండ్ల సాధన కోసం చేస్తున్న సమ్మెకు జనసేన పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. తమ హక్కులను సాధించుకునేందుకు పోరాడే తప్ప ప్రాణత్యాగాలకు పాల్పడవద్దని తెలంగాణ జనసేన శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చింది. ఈ మేరకు నటుడు, ఆ పార్టీ నేత ఆర్.కె. సాగర్ ఒక వీడియో విడుదల చేశారు. సమ్మెలో భాగంగా నర్సంపేట డిపోకు చెందిన కార్మికుడు శంకర్ గౌడ్ ఆత్మహత్యకు పాల్పడటం పట్ల జనసేన తీవ్ర దిగ్భ్రాంతిని, విచారాన్ని వ్యక్తం చేస్తోందన్నారు. శంకర్ గౌడ్ మరణం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారని, ఆయన ఆత్మహత్యతో ఆ కుటుంబం పెద్దదిక్కును కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా తెలంగాణ ఉద్యమ సమయంలో ఎంతో మంది యువకులు, విద్యార్థులు బలిదానాలు చేసినా ఏ ప్రభుత్వమూ వారిని పట్టించుకున్న దాఖలాలు లేవని గుర్తుచేశారు. కాబట్టి ప్రాణాలు వదలడం సమస్యకు పరిష్కారం కాదని, ధైర్యంగా పోరాడి డిమాండ్లను సాధించుకుందామని పిలుపునిచ్చారు.

# వేగంగా ఎస్ఎల్‌బిసి సొరంగ మార్గం తవ్వకం

### కార్మికుల భద్రతకే పెద్దపీట:
### మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి
### భద్రతా ఏర్పాట్లపై ఎన్‌జిఆర్ఐ సమగ్ర సర్వే నివేదిక

**హైదరాబాద్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** శ్రీశైలం ఎడమ గట్టు కాలువ సొరంగ మార్గం తవ్వకాలలో అనుసరించాల్సిన భద్రతా ఏర్పాట్లపై నేషనల్ జియో ఫిజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ సమగ్రంగా రూపొందించిన నివేదికను రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాలశాఖమంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి ఎన్.జి.ఆర్.ఐ ప్రధాన శాస్త్రవేత్త సత్యనారాయణ అందించారు. ఈ మేరకు శుక్రవారం సచివాలయంలో నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.ఎల్.బి.సి పునరుద్ధరణ పనుల పురోగతితోపాటు కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుండిళ్ల బ్యారేజ్ పునరుద్ధరణలోనూ ఎన్.జి.ఆర్.ఐ ఆధ్వర్యంలో భూభౌతిక (సాయిల్ టెస్ట్) నిర్వహించాలన్నారు. ఎస్.ఎల్.బి.సి సొరంగ మార్గం తవ్వకాల సమయంలో జరిగిన దురదృష్టకర సంఘటన పునరావృతం కాకుండా ఉండేందుకే తవ్వకాల సమయంలో అనుసరించాల్సిన భద్రతా ప్రమాణాలపై ఎన్.జి.ఆర్.ఐతో సమగ్రంగా సర్వే నిర్వహించినట్లు తెలిపారు. తవ్వకాల సమయంలో ముందస్తుగా ప్రమాదవశాకాలను గుర్తించేందుకు వీలుగా ఈ సంస్థ సీస్మిక్ ఇమేజింగ్, ఎలక్ట్రికల్ రెసిస్టివిటి టోమోగ్రఫీ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించినట్లు ఆయన వివరించారు. సొరంగ మార్గం తవ్వకాల్లో కార్మికుల భద్రతను రాష్ట్ర ప్రభుత్వం మొదట ప్రాధాన్యతాంశంగా పెట్టుకుందన్నారు. ఇకపై ఎన్.జి.ఆర్.ఐ శాస్త్రవేత్తల మార్గదర్శనానికి అనుగుణంగానే సొరంగ మార్గం తవ్వకాలు ఉంటాయని పేర్కొన్నారు. ఎన్.జి.ఆర్.ఐ రూపొందించిన నివేదికలో ట్రైన్ జోన్ లు, నీటి ఊటలతో పాటు సొరంగమార్గం పై భాగం తదితర అంశాల పై వి.జి.ఆర్.ఐ శాస్త్రవేత్తలు సమగ్రంగా అధ్యయనం జరిపారని తెలిపారు. ఎస్.ఎల్.బి.సి పనుల పునరుద్ధరణ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయన్నారు. ఎలక్ట్రిక్ లోడర్లు, భారీ డంపర్ల తోడ్పాటుతో ఇప్పటి వరకు 151.50 మీటర్ల తవ్వకం పూర్తయిందన్నారు. దేశీయ, అంతర్జాతీయంగా సంస్థల నుండి ఆధునిక పరిజ్ఞానంతో కూడిన యంత్రాంగాన్ని సమీకరించి రెండు వైపులా నెలకు 200 మీటర్ల వరకు తవ్వకాలు చేయాలన్నది ప్రభుత్వ సంకల్పమని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు. ఈ సమీక్షలో ఇఎన్‌సి రమేష్‌బాబు, సొరంగ మార్గం తవ్వకాల నిపుణులు పరిక్షి త్ మెహ్రా, ఎన్.జి. ఆర్.ఐ శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.



### ప్రేమ పేరుతో కుమార్తెను తీసుకుపోయాడని..

## యువకుడి తండ్రి కిడ్నాప్.. ఆపై మూత్రపానం!

### ఘటనపై పోలీసులు కేసు నమోదు

**భోపాల్, ఏప్రిల్ 22:** తమ కుమార్తెను ప్రేమ పెళ్లి చేసుకుని తీసుకెళ్లి పోయాడన్న కోపంతో యువతి కుటుంబసభ్యులు 70 యేళ్ల వృద్ధుడైన యువకుడి తండ్రిని కిడ్నాప్ చేసి, దారుణంగా కొట్టి, మద్యం సీసాలో మూత్రం పోసి బలవంతంగా తాగించారు. ఈ అమానుషాన్ని వీడియో తీసి సోషల్ మీడియాలో వైరల్ చేయడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. మధ్యప్రదేశ్‌లో రైసెన్ జిల్లాకు చెందిన ఓ యువకుడు, విదిశ జిల్లాకు చెందిన యువతి మార్చి 5న ప్రేమ వివాహం చేసుకుని ఇళ్ల నుంచి వెళ్లిపోయారు. మరుసటి రోజే దీనిపై కేసు నమోదైంది. మార్చి 7న యువతి కుటుంబ సభ్యులు సుమారు 12 మంది రెండు వాహనాల్లో రైసెన్‌కు చేరుకున్నారు. యువతి ఆచూకీ చెప్పాలంటూ ఆమె ప్రియుడి తండ్రి అయిన వృద్ధుడిపై దాడి చేశారు. అనంతరం, ప్రేమజంటను వెతుకుదామనే నెపంతో వృద్ధుడిని బలవంతంగా తమ వాహనాల్లో ఎక్కించుకుని రాజ్‌గఢ్ జిల్లాలోని మోతీపుర గ్రామంలోని నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లారు. అక్కడ వారి ఆచూకీ చెప్పకపోవడంతో, వృద్ధుడిని తీవ్రంగా కొట్టి, మద్యం సీసాలో మూత్రం పోసి బలవంతంగా తాగించారు. ఈ మొత్తం ఘటనను వీడియో తీసి ఆన్‌లైన్‌లో పోస్ట్ చేశారు. ఈ ఘటన గత నెలలో జరగ్గా బుధవారం వీడియో వైరల్ కావడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన రాజ్‌గఢ్ పోలీసులు, బాధితుడి ఇంటికి వెళ్లి వివరాలు సేకరించారు. ఫిర్యాదు మేరకు ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నామని, ఎఫ్ఐఆర్ నమోదు చేస్తున్నా మని తెలిపారు. వీడియో ఆధారంగా మిగిలిన నిందితులను గుర్తించి, వారిని అరెస్ట్ చేసేందుకు గాలిస్తున్నామని పోలీసులు వివరించారు.


# గాయని మంగ్లీయే మైక్రో ఫైనాన్స్ మోసానికి బాధ్యురాలు

### బాధితుల ఆరోపణ

**హైదరాబాద్, ఏప్రిల్ 24,ప్రభాతవార్త:** మంగ్లీనే మైక్రోఫైనాన్స్ మోసానికి భాద్యురాలని ఉమ్మడి నల్గొండ బాదితులు ఆరోపించారు. కాయాకష్టం చేసుకుని జీవించేవాళ్లం, బందువుల వద్ద అప్పులు చేసి మరీ మంగ్లీ పై భరోసాతో మైక్రోఫైనాన్స్ లో పెట్టుబడులు పెట్టామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు శుక్రవారం ఉమ్మడి నల్గొండ నుండి వచ్చిన 20 మంది భాదితులు హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. చిన్న పాటి పనులు చేసుకునే వాళ్లం అధికవడ్డీ ఆశకు మోసపోయామన్నారు. బంజారా నాయకులు సంపత్ నాయక్ మాట్లాడుతూ మోసం చేసిన మంగ్లీ తాను గిరిజన బిడ్డను అంటూ వ్యాఖ్యానించడం సరికాదన్నారు. మంగ్లీ గిరిజన కార్డును ఉపయోగించి తనను తాను రక్షి ంచుకునే పనిలో ఉందని, అయితే ఆమె చేత బాదింపబడిన వారు కూడా గిరిజనులే అన్న విషయాన్ని గుర్తించాలని గుర్తు చేశారు. మంగ్లీ బాదితులు ఒక్కొక్కరు కాదు..వందల సంఖ్యలో ఉన్నారని..జాతి పేరు చెప్పుకుని స్వంత జాతి ప్రజలను మోసం చేయడం మంగ్లీకి ఉన్న విచక్షణ జ్ఞానానికి నిదర్శనమన్నారు. మైక్రోఫైనాన్స్లో పెట్టుబడులు కేవలం మంగ్లీ తమ్ముడు ,రమావత్ మధు, మంగ్లీలను చూసి మాత్రమే పెట్టామని .. మరిన్ని వాస్తవాలు త్వరలోనే బయటకు వస్తాయని పేర్కొన్నారు. ప్రభుత్వం మైక్రోఫైనాన్స్ విషయంలో జోక్యం చేసుకుని బాదితులకు న్యాయం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో ఓయూ జాక్ నేత సంపత్ నాయక్, విప్లవ్, రేణు నాయక్, శ్రీనివాస్ నాయక్, రంజా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## కాళేశ్వరం నివేదికలోని లోపాలు సరిదిద్దే యోచన

**హైదరాబాద్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవకతవకలపై నియమించిన జస్టిస్ ఘోష్ కమిషన్ రిపోర్టుపై హైకోర్టు ఇచ్చిన తీర్పులో పేర్కొన్న లీగల్ ప్రొసీజర్ లోపాలను సరిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నట్టు సమాచారం. ఈ మేరకు ప్రభుత్వానికి న్యాయ, నీటిపారుదలరంగ నిపుణులు కీలక సూచనలు చేసినట్టు తెలుస్తోంది. నివేదికలో న్యాయపరమైన లోపాలను సరిదిద్దకుండా సుప్రిం కోర్టును ఆశ్రయించినా ఊరట దక్కదని ప్రభుత్వానికి పేర్కొన్నట్లు తెలిసింది. హైకోర్టు కమిషన్ ఏర్పాటు, నివేదికను తప్పుబట్టలేదని, అదే సమయంలో కమిషన్ రిపోర్టులోని న్యాయపరమైన లోపాలను ఎత్తి చూపిందని నిపుణులు ప్రభుత్వానికి సూచించినట్టు సమాచారం.




## దృఢమైన యువతే వికసిత్ భారత్‌కు బలం

### క్రీడలతో జాతీయ ఐక్యత: గవర్నర్ శివప్రతాప్ శుక్లా
### మహబూబ్‌నగర్‌లో అట్టహాసంగా ప్రధానమంత్రి ఖేలో సంసద్ మహోత్సవ్ ముగింపు వేడుకలు

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఏప్రిల్ 24, ప్రభాతవార్త :** జాతీయ విద్యా విధానం-2020లో క్రీడలను ప్రధాన స్రవంతి విద్యలో భాగం చేయడం ద్వారా భవిష్యత్ విజేతలను తీర్చిదిద్దే దిశగా ముందడుగు పడిందని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల అన్నారు. యువతే బలమైన, ప్రగతిశీల దేశ నిర్మాణానికి నిజమైన శక్తి అని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. యువతలో క్రీడాస్ఫూర్తి పెంపొందించడం ద్వారా బలమైన భారతదేశ నిర్మాణం సాధ్యమని పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా స్టేడియం గ్రౌండ్ లో పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన 'ప్రధానమంత్రి సంసద్ ఖేల్ మహోత్సవ్-2026' బహుమతి పంపిణీ కార్యక్రమంకు గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ క్రీడలు వ్యక్తిత్వ వికాసానికి, టీమ్ స్ఫూర్తినీ పెంపొందించడానికి, ఓర్పు , క్రమశిక్షణను అభివృద్ధి చేయడానికి కీలకమని పేర్కొన్నారు. యువతలో ఉన్న ఉత్సాహం, పట్టుదల దేశ అభివృద్ధికి బలమైన పునాది వేస్తాయని అన్నారు. ఖేలో ఇండియా, ఫిట్ ఇండియా వంటి కార్యక్రమాలు క్రీడా రంగాన్ని బలోపేతం చేయడంతో పాటు క్షేత్రస్థాయిలో ప్రతిభను గుర్తించడంలో ముఖ్య పాత్ర పోషిస్తున్నాయని గవర్నర్ తెలిపారు.

# విద్యుత్ వినియోగదారులకు ప్రోత్సాహకంలో సడలింపు

### కొత్త పథకాన్ని ప్రకటించిన కేంద్ర కుకింగ్ కోల్ సంస్థ

**హైదరాబాద్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** ప్రస్తుత 2026-27 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో విద్యుత్ రంగ వినియోగదారుల కోసం పనితీరు ప్రోత్సాహకం (పిఐ) సడలింపుతో పాటు, నగదు తగ్గింపు పథకాన్ని కేంద్రం ప్రకటించింది. ఈ మేరకు భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో ఈ పథకం ఫ్లెక్సీ-లింకేజ్ పథకం కింద ఉన్న వారితో సహా, ఇంధన సరఫరా ఒప్పందాల (ఎఫ్ఎస్ఎ) పరిధిలోకి వచ్చే అర్హత గల విద్యుత్ రంగ వినియోగదారులందరికీ వర్తిస్తుందని తెలిపారు. ఈ ప్రోత్సాహకాలు రైలు, రోడ్డు, ఆర్‌సిఆర్ రవాణా మార్గాల ద్వారా జరిగే వాస్తవ బొగ్గు వినియోగానికి అనుసంధానించబడతాయని వెల్లడించారు. అంతేకాకుండా నిర్దేశిత స్లాబుల కింద త్రైమాసిక పరిమాణం ( క్వార్టర్లీ క్వాంటిటీ (క్యూక్యూ))కు అనుగుణంగా వినియోగ నిష్పత్తి ఆధారంగా అమలు చేయబడతాయని తెలిపారు. ఈ పథకం కింద, త్రైమాసిక పరిమాణం లో 120 శాతం కంటే తక్కువ బొగ్గు వినియోగానికి, ప్రస్తుత ఎఫ్ఎస్ఎ నిబంధనల ప్రకారం ముడి బొగ్గుపై మాత్రమే పనితీరు ప్రోత్సాహకం వర్తిస్తుందని పేర్కొన్నారు. ఇదే సమయంలో ఎటువంటి నగదు తగ్గింపు అనుమతించబడదని స్పష్టం చేశారు. క్యూక్యూలో 120 నుండి 140 శాతం మధ్య ఆఫ్టేక్ కోసం, 90 శాతం మించిన పరిమాణాలపై ప్రోత్సాహకం వర్తించదని తెలియచేశారు. అయితే అదనంగా క్యూక్యూలో 100 శాతం మించి రవాణా చేయబడిన బొగ్గుపై 5 శాతం నగదు తగ్గింపు అందించబడుతుందని వివరించారు. ఈ తగ్గింపు నాణ్యత నిర్ధారణకు లోబడి, ముడి కోకింగ్ బొగ్గు, వాష్డ్ పవర్ కోల్‌కు మాత్రమే వర్తిస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్ సరఫరాలకు సర్దుబాటు కోసం క్రెడిట్ ద్వారా జారీ చేయబడుతుందని తెలిపారు. అర్హులైన వినియోగదారులందరూ, ముఖ్యంగా రైలు మార్గం ద్వారా అధిక బొగ్గు రవాణాను ప్రణాళిక చేసుకోవడం, అలాగే రోడ్డు, ఆర్‌సిఆర్ మార్గాల ద్వారా కూడా తగినంత వినియోగాన్ని నిర్ధారించుకోవడం ద్వారా ఈ పథకం కింద ప్రయోజనాలను గరిష్ఠంగా పొందాలని సూచించింది. ఈ చొరవ అధిక బొగ్గు వినియోగాన్ని ప్రోత్సహించడం, లాజిస్టిక్స్ సామర్థ్యాన్ని మెరుగుపరచడం, విద్యుత్ రంగానికి వ్యయ ఉపశమనం కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఇంధన సరఫరా గొలుసులో కొనసాగుతున్న ప్రపంచ సవాళ్ల మధ్య, ఇది ఆత్మనిర్భర్ భారత్ దార్శనికతకు అనుగుణంగా ఉంటూ, దేశంలో బొగ్గు సరఫరా గొలుసును బలోపేతం చేయడమే కాకుండా స్థిరమైన విద్యుత్ ఉత్పత్తికి మద్దతు ఇస్తుందని కోల్ సంస్థ పేర్కొంది.

### హెచ్‌సిఎ అవకతవకలపై దర్యాప్తునకు హైకోర్టు ఆదేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఏప్రిల్24:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌హెచ్‌సీఏలో అవకతవకలపై హైకోర్టు దర్యాప్తునకు ఆదేశించింది. సీబీసీఐడీలోని సిట్‌తో దర్యాప్తు చేయాలని జస్టిస్ నగేశ్ భీమపాక తీర్పు చెప్పారు. హెచ్‌సీఏ అధికారులు, సిబ్బంది దర్యాప్తునకు సహకరించాలని ఆదేశించారు. హెచ్‌సీఏ అధికారులు, సిబ్బంది జస్టిస్ నవీన్‌రావు పర్యవేక్షణలో పనిచేయాలని తీర్పులో సూచించారు. హెచ్‌సీఏలో అక్రమాలు జరిగాయంటూ సఫిల్‌గూడ క్రికెట్ క్లబ్ పిటిషన్ వేసింది.



సిద్ధరామయ్యకు వినతిపత్రం ఇస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్, కేశనశంకర్‌రావు, ప్రొఫెసర్ బబన్‌రావ్ తదితరులు

## కర్ణాటక సిఎం సిద్ధరామయ్యతో బిసి సంఘాల నేతల భేటీ

**హైదరాబాద్, ఏప్రిల్ 24,ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా ఓబీసీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడం కోసం కర్ణాటక ప్రభుత్వం తరపున కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని, ఆగస్టు 7న బెంగళూరులో జరిగే జాతీయ ఓబీసీ మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరుకావాలని కర్ణాటక సీఎం సిద్ధరామయ్య ను బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. ఈమేరకు శుక్రవారం బెంగళూరులోని సిఎం నివాసంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రలకు చెందిన బీసీ సంఘాల నేతలు కలిశారు. ఈ సందర్భంగా పది డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ దేశ జనాభాలో 60 శాతం పైగా ఉన్న బీసీలకు కేంద్ర ప్రభుత్వం అన్యాయం చేస్తున్నదని, మహిళా బిల్లులు బీసీ మహిళకు సబ్ కోట కల్పించకుండా, జాతీ జన గణనలో బీసీ కుటుంబాల లెక్కింపు చేపట్టకుండా, అగ్రవర్ణాలకు లేని 50 శాతం పరిమితిని కేవలం బీసీ ఎస్సీ ఎస్టీ సామాజిక రిజర్వేషన్లపై విధించి తీవ్రని అన్యాయం చేస్తుందని జాజుల శ్రీనివాస్ గౌడ్ సీఎం దృష్టికి తీసుకెళ్లారు.

# మూడో రోజు కొనసాగిన ఆర్టీసీ సమ్మె

### ఇబ్బందులు పడుతున్న ప్రజలు
### సమ్మెకు ప్రజాసంఘాలు, టిజిఇజెఎసి మద్దతు
### సమ్మెకు మద్దతు తెలపడానికి ప్రయత్నించిన బిఆర్ఎస్, బిజెపి నేతల అరెస్టు
### బస్సులను అడ్డుకున్న ఆర్టీసీ జెఎసి నేతల అరెస్టు

**హైదరాబాద్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** తెలంగాణలో మూడోరోజు ఆర్టీసీ సమ్మె కొనసాగింది. ఆర్టీసీ కార్మికుల సమ్మె కారణంగా బస్సులు డిపోలకే పరిమితం కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సమ్మె మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకు నలుగురు ఆత్మహత్యాయత్నం చేశారు. గురువారం ఒక్కరోజే నర్సంపేట బస్ స్టాండ్‌లో శంకర్‌గౌడ్.. నల్లగొండ డిపో ఎదుట వెంకన్న.. ఖమ్మంలో లింగారెడ్డి.. ఆత్మహత్యకు యత్నించారు. వారిలో శంకర్ గౌడ్ చికిత్స పొందుతూ మరణించాడు. శుక్రవారం భూపాలపల్లి ఆర్టీసీ డిపోకు చెందిన రవీందర్ అనే డ్రైవర్ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన తోటి సిబ్బంది అతన్ని వెంటనే వరంగల్ ఎంజీఎం ఆస్పత్రతికి తరలించారు. ప్రజా రవాణా లేకపోవడంతో ప్రజల ఇబ్బందులను తీర్చేందుకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటోంది. హైదరబాద్‌లో సెట్విన్ బస్సులను ఎక్కువ సమయంలో తిప్పుతున్నారు. సమ్మె చేస్తున్న ఆర్టీసీ కార్మికులకు మద్ధతు తెలపడానికి వెళ్లిన బీఆర్ఎస్, బీజేపీ నేతలను పోలీసులు అడ్డుకొని అరెస్టు చేశారు. ఆర్టీసీ బస్సులను డిపోల నుంచి బయటికి రాకుండా ఆందోళనలు చేస్తున్న ఆర్టీసీ కార్మికులు, జేఏసీ నేతలను సైతం పోలీసులు అడ్డుకొని అరెస్టు చేశారు.

ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ అంతిమ యాత్రలో పాల్గొనడానికి వరంగల్ జిల్లా నర్సంపేట వెళ్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్‌ను స్టేషన్ మార్గ మధ్యలో అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అంతకుముందు మాజీ హోంమంత్రి సబితా ఇంద్రా రెడ్డి, మాజీ ఎంపీలు వినోద్ కుమార్, మాలోతు కవితను జనగామ జిల్లా రఘునాథపల్లి టోల్ గేట్ వద్ద పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఆర్టీసీ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు డిపోల ఎదుట బైఠాయింపు నిరసన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాష్ట్రంలో శుక్రవారం నుంచి పాఠశాలలకు సెలవులు ఇవ్వడంతో వసతిగృహాల్లో చదువుకున్న విద్యార్థులు తమ స్వస్థలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడ్డారు.=భారీ వాహనాల లైసెన్సులు, పెద్ద వాహనాలను నడపడంలో ముందస్తు అనుభవం ఉన్న వారికి ప్రైవేట్ డ్రైవర్ల డ్రైవింగ్ నైపుణ్యాలను రోడ్డు రవాణా శాఖ అధికారులు నేరుగా డిపో ప్రాంగణంలోనే పరిశీలించి అనంతరం వారికి బస్సులు నడపడానికి అనుమతించారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారికి కండక్టర్లుగా పనిచేసే అవకాశాలు కల్పించడంతో వందలాది మంది అభ్యర్థులు డిపోలకు తరలివచ్చారు. కార్మికులు ఉదయం నుంచే డిపోల వద్దకు చేరుకొని బస్సులు బయటికి రాకుండా అడ్డుకున్నారు. ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్, రోజువారీ కార్మికులు బస్సులు తీసే క్రమంలో జేఏసీ నేతలతో వాగ్వాదం జరిగింది. పోలీసులు అడ్డుకొని అరెస్టు చేశారు.

## కెయు డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు వాయిదా

**ఎడ్యుకేషన్ కేయూ, ఏప్రిల్ 24 ప్రభాతవార్త :** ఆర్టీసీ బస్సులబంద్ నేపథ్యంలో కాకతీయ విశ్వవిద్యాలయ పరిధిలో ఈనెల24, 25న నిర్వహించాల్సిన అన్ని పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు, వాటి కొత్త తేదీలను త్వరలో ప్రకటిస్తామని, మిగతా పరీక్షలు యథావిధిగా కొనసాగుతాయని విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య రాజేందర్ కట్ల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.



అవార్డుల అధికారిక పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రవికుమార్, మహేశ్వరి, శ్రీనివాస్, ప్రేమ్‌చంద్ తదితరులు

## ఎఫ్‌టిసిసిఐ ఎక్సలెన్స్ అవార్డ్స్-2026కు దరఖాస్తుల ఆహ్వానం

**హైదరాబాద్ (నాంపల్లి), ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** గత 108 సంవత్సరాల చరిత్రగల దేశంలోని ప్రముఖ ప్రాంతీయ వాణిజ్య సంస్థలలో ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఎఫ్‌టిసిసిఐ తన ప్రతిష్టాత్మక వార్షిక ఎక్సలెన్స్ అవార్డ్స్-2026కు దరఖాస్తులకు ఆహ్వానించింది. ఈమేరకు ఎఫ్‌టిసిసిఐ అధ్యక్షుడు ఆర్.రవికుమార్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కె.కె.మహేశ్వరి, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ గరిమెళ్ల, కమిటీ ఛైర్మన్ ప్రేమ్‌చంద్ కంకారియా, సెక్రటరీ వీణ, డైరెక్టర్ సంగీతలు రెడ్‌హిల్స్‌లోని ఎఫ్‌టిసిసిఐ ఫెడరేషన్ హౌస్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. మొత్తం 21 విభాగాల్లో ఈ అవార్డులకు ఎంట్రీలను ఆహ్వానిస్తూ దరఖాస్తుల సమర్పణకు చివరితేదీగా మే 10, 2026 నిర్ణయించినట్లు సవివరపరిచారు. ఈ సందర్భంగా అవార్డుల అధికారిక పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ అవార్డులు రాష్ట్రంలో అత్యంత విశ్వసనీయమైనవి, ప్రతిష్టాత్మకమైనవిగా గుర్తింపు పొందాయని తెలిపారు. విజేతలను జస్టిస్ చల్లా కోదండరామ్, డా. ఎం.గోపాలకృష్ణ, బీపి ఆచార్య, అజయ్‌మిశ్రా, ఐఐటీ హైదరాబాద్ స్థాపక డైరెక్టర్ డా. ఉదయ్ బి.దేశాయ్‌లతో కూడిన స్వతంత్ర జ్యూరీ ఎంపిక చేస్తుందని మొత్తం ఎంపిక ప్రక్రియ పూర్తిగా డిజిటలైజ్డ్, పారదర్శకంగా, స్వతంత్రంగా నిర్వహించబడుతుందని నిర్వాహకులు తెలిపారు. ఔత్సాహికులు తెలంగాణలో కార్యకలాపాలున్న సంస్థలు డబ్ల్యుడబ్ల్యు డబ్ల్యు. ఎఫ్‌టిసిసిఐఅవార్డ్స్.ఇన్ వెబ్‌సైట్‌లో వివరాలు తెలుసుకుని దరఖాస్తులు సమర్పించవచ్చునని, పూర్తిచేసిన దరఖాస్తులను ఎఫ్‌టిసిసిఐ అవార్డ్స్ఎట్‌దరేట్‌ఎఫ్‌సిసిఐకు పంపాలని, నామమాత్రపు ఫీసు వర్తిస్తుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 9121000199, 8008804529 నంబర్లను సంప్రదించవచ్చునని సూచించారు. విజేతలకు అవార్డులను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి తదితర అతిథుల చేతులమీదుగా అందజేస్తారని వారి విశదీకరించారు.

### త్రైమాసిక ఫలితాలు ప్రకటించిన రిలయన్స్

## లాభంలో క్షీణత అయినా రూ.6 డివిడెండ్

**ముంబయి, ఏప్రిల్ 24:** భారత్‌లో అతిపెద్ద పారిశ్రామికగ్రూప్ రిలయన్స్ ఇండస్ట్రీస్ శుక్రవారం తన త్రైమాసిక ఫలితాలుప్రకటించింది. గ్రూపు సమిష్టి నికరలాభం రూ.16,971 కోట్లుగా ఉందని తెలిపింది. అయితే గతం కంటే 12.5శాతం క్షీణించినట్లు తేలింది. పన్నులచెల్లింపులకుముందు లాభాలు రూ.48,588 కోట్లుగా ఉంది. రిలయన్స్ బోర్డు ప్రతి ఈక్విటీ వాటాకు ఆరురూపాయలు డివిడెండ్‌ప్రకటించింది. జియో నికరలాభం 13శాతంపెరిగి 7935కోట్లుగా ఉంది. రాబడులు కూడా 12.5శాతంపెరిగి రూ.38,259 కోట్లుగా ఉంది. రిలయన్స్ రిటైల్ వెంచర్స్ నికరలాభం 3563 కోట్లుగా ఉంటే రాబడులు రూ.87,344కోట్లుగా ఉంది. నిర్వహణలాభాలు 6921కోట్లుగా ఉంది. ఎబిడిటా మార్జిన్ 7.9శాతంగా ఉంది. రిలయన్స్ ఆయిల్ అండ్‌గ్యాస్ రాబడులు 5867 కోట్లుగా ఉంది. ఎబిడిటా 18.1శాతం తగ్గి 4195 కోట్లుగా ఉంది. ఇక రిలయన్స్ ఆయిల్‌టు కెమికల్స్ రాబడులు రూ.1,84,944కోట్లుగా ఉంది. 12.4శాతంపెరిగాయి. ఎబిడిటా మార్జిన్ 7.9శాతంగా ఉంది. 14,520 కోట్లుగా ఉన్నట్లు రిలయన్స్‌ప్రకటించింది. జియోలో ఒక వినియోగదారుడినుంచి వచ్చే సగటు రాబడి రూ.206.2నుంచి రూ.213కి పెరిగింది.

## శంకర్ గౌడ్‌ది ఆత్మహత్య కాదు.. అది రేవంత్ సర్కారు చేసిన హత్యే: కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఏప్రిల్24:** వరంగల్ జిల్లా నర్సంపేటలో ఆర్టీసి డ్రైవర్ శంకర్ గౌడ్‌ది ఆత్మహత్య కాదు. అది ముమ్మాటికీ రేవంత్ సర్కారు చేసిన హత్యే అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు వ్యాఖ్యానించారు. రెండున్నరేళ్లుగా సీఎం రేవంత్ ఆర్టీసి కార్మికులకు చేస్తున్న తీరని ద్రోహాన్ని తట్టుకోలేకే శంకర్ గౌడ్ బలవన్మరణానికి పాల్పడ్డారు. ఆర్టీసి సంస్థ పరిరక్షణకు, తోటి కార్మికుల హక్కుల సాధనకు ప్రాణత్యాగానికి సిద్ధపడ్డ శంకర్ గౌడ్ పార్థివదేహాన్ని నర్సంపేట డిపో వద్దకు తీసుకెళ్లి నివాళులు అర్పించేందుకు కూడా అనుమతించకపోవడం అత్యంత దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు. పుట్టెడు దుఖంలో ఉన్న శంకర్ గౌడ్ కుటుంబ సభ్యులకు అండగా నిలిచిన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డితోపాటు, బీఆర్ఎస్ నేతలు, ఆర్టీసి కార్మికులు, కార్మిక సంఘాల నేతలను నర్సంపేటలో అరెస్టుచేయడం చాలా దారుణమన్నారు.. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో అక్రమంగా అరెస్టు చేసిన వారందరినీ బేషరతుగా విడుదల చేయలని కోరారు.

# డీమ్డ్ టుబి వర్సిటీలు తప్పకుండా ప్రభుత్వ అనుమతి పొందాలి

### నిబంధనల్లో మార్పులు చేసిన యుజిసి
### స్వాగతించిన తెలంగాణ ఉన్నత విద్యామండలి

**హైదరాబాద్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** ఇకపై రాష్ట్రాల్లో కొనసాగు తున్న డీమ్డ్ టు బి యూనివర్సిటీలపై రాష్ట్ర ప్రభుత్వాల అజమాయిషీ రానుంది. డీమ్డ్ టు బీ యూనివర్సిటీలుగా ఏర్పాటు చేసుకోవాలనుకునే వారు తప్పనిసరిగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) తీసుకోవాల్సి ఉంటుందని. అలాగే యూనివర్సిటీల్లో భద్రత, అడ్మినిస్ట్రేషన్‌పై ప్రభుత్వ అజమాయిషీ ఉండేలాగా నిబంధనలను మార్చుతూ యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యుజీసీ) నిబంధనలను మార్చింది. డీమ్డ్ టు బీ విశ్వవిద్యాలయాలలో రాష్ట్ర ప్రభుత్వ పాత్రను బలోపేతం చేసే యూజీసీ సవరణ నిబంధనలు- 2026ను తెలంగాణ ఉన్నత విద్యా మండలి స్వాగతిస్తున్నట్టు మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి సెక్రటరీ ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేష్ తెలిపారు. ఉన్నత విద్యలో సహకార సమాఖ్యవాదాన్ని బలోపేతం చేయడానికి విద్యార్థుల విద్యా ప్రయోజనాలను పరిరక్షి ంచడానికి ఒక నిర్మాణాత్మక చర్యగా భావిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని డీమ్డ్ టుబి విశ్వవిద్యాలయాల పనితీరు, విస్తరణలో ఉన్న నియంత్రణాపరమైన లోపాలపై ఉన్నత విద్యా మండలి, తెలంగాణ ప్రభుత్వంతో కలిసి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ)కి పలుమార్లు విజ్ఞప్తి చేసినట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వంతో తగినంత సంప్రదింపులు జరపకుండా సంస్థలను స్థాపించడం, కార్యక్రమాలు, ప్రవేశాలను చేపట్టడం, రిజర్వేషన్లు, విద్యార్థుల భద్రతకు సంబంధించిన ప్రమాణాలను పాటించడం లేదు. సవరించిన నిబంధనల ప్రకారం, ఇప్పటికే ఉన్న విశ్వవిద్యాలయాలు, వాటి అనుబంధ విభాగాలతో సహా సంస్థలు, డీమ్డ్‌టుబి విశ్వవిద్యాలయాలుగా లేదంటే ఆఫ్‌క్యాంపస్ కేంద్రాలుగా ప్రకటించబడటానికి ముందు రాష్ట్ర ప్రభుత్వం నుండి నిరభ్యంతర పత్రం (ఎన్‌వోఈసీ) పొందడంతోపాటు అధికారికంగా డీనోటిఫికేషన్ చేయించుకోవాలి. దీంతో పరిపాలనలో మెరుగైన పాత్ర రాష్ట్ర ప్రభుత్వానికి లభించనుంది. ఛాన్సలర్ వంటి కీలక అధికారుల నియామకంలోనూ, ప్రభుత్వ నిధులు పొందే సంస్థలలో వైస్‌ఛాన్సలర్ల అన్వేషణఎంపిక కమిటీలలో పాల్గొనడంలోనూ రాష్ట్ర ప్రభుత్వం, రాజ్యాంగ అధికార సంస్థల పాత్రను ఈ సవరణలు గుర్తిస్తున్నాయన్నారు. మారిన నిబంధనల మేరకు జవాబుదారీతనం, పారదర్శకతను బలోపేతం చేయడం ప్రభుత్వానికి సులువుకానుందన్నారు.

## నాదెండ్ల మనోహార్‌ను పరామర్శించిన కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఏప్రిల్24:** ఇటీవల మరణించిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్ రావు చిత్రపటానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. హైదరాబాద్‌లోని నాదెండ్ల నివాసానికి వెళ్లి ఏపీ మంత్రి నాదెండ్ల మనోహార్‌ను, కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే వివేకానంద, ఎమ్మెల్సీ రాజు శంభీపూర్, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్, బీఆర్ఎస్ నాయకులు నాదెండ్ల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించిన వారిలో ఉన్నారు. నాదెండ్ల మనోహార్ గారిని మరియు ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# క్లైమాక్స్‌కు ప్లే ఆఫ్ రేస్




(వార్తా క్రీడా విభాగం)

ఐపీఎల్ 2026 ప్లే ఆఫ్ రేసు ఉత్కంఠభరితంగా మారిం ది. పంజాబ్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్, ఆర్సీబీ, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లు ముందంజలో ఉండగా... చెన్నై, గుజరాత్ వంటి జట్లు పుంజుకుని రేసులో నిలుస్తు న్నాయి. మరోవైపు ముంబై, కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్లు తీవ్ర ఒత్తిడిలో ఉన్నాయి. లీగ్ తొలి దశలో నిరాశజనక ఆటతీరు కనబరిచాయి. ఇకపై ప్రతి మ్యాచ్ ప్లే ఆఫ్ సమీ కరణాలను మార్చే కీలకఘట్టంగా మారనుంది.

**కాసుల క్రికెట్ ఇండియన్ ప్రీమియర్ లీగ్ ఉత్కంఠ దశకు చేరుకుంది. ఈ ఐపీఎల్ సీజన్ లీగ్ దశ సగానికి చేరు కుంది. దాదాపు అన్ని జట్లు ఏడేసి మ్యాచ్ లు ఆడాయి. ఓవరాల్‌గా ఒక్కో జట్టు 14 మ్యాచ్‌లు ఆడుతుంది. అంటే మరో ఏడు మ్యాచ్‌లు మిగిలాయి. లీగ్ దశ సగం దాటడంతో ప్లే ఆఫ్ సమీకరణాలు ఆసక్తి కరంగా మారాయి. టాప్ ఫోర్‌లో చోటు కోసం జట్లు తీవ్రంగా పోటీపడుతు న్నాయి. ఇక్కడివరకు ఓ లెక్క.. ఇక ముం దుంది మరో లెక్క అన్నట్లుగా ఐపీఎల్ లోని పది జట్లకు మారింది.**

### దాదాపు ప్లే ఆఫ్ ఖాయం

పంజాబ్ కింగ్స్ స్థిరమైన ప్రదర్శనతో ఆడిన ఆరు మ్యాచ్‌ల్లో అజేయంగా కొనసాగుతోంది. అయిదు మ్యాచ్ ల్లో గెలుపొందగా, ఒక మ్యాచ్ వర్షం వల్ల రద్దయింది. 11 పాయింట్లతో పట్టికలో అగ్రస్థానంలో ఉంది. ప్రస్తుత ఫామ్ చూస్తే శ్రేయాస్ సేన ప్లే ఆఫ్ స్థానం గ్యారంటీగా మారిం ది. ఆడాల్సిన 8 మ్యాచ్‌ల్లో ఓ మూడు మ్యాచ్‌లు నెగ్గినా ప్లే ఆఫ్‌కు ఢోకా ఉండదు. 2025 సీజన్‌లోనూ టాప్ ప్లేస్‌తో ప్లే ఆఫ్ చేరిన పంజాబ్ కింగ్స్... ఈసారి కప్ అందుకోవడమే లక్ష్యంగా కొనసాగుతోంది.

### రాయల్‌దీ అదే రూట్

స్వదేశీ యంగ్ గన్స్ రాజస్థాన్ రాయల్స్ ఆడే మ్యాచ్‌ల్లో 5 విజయాలు, 2 ఓటములు.. మొత్తం పది పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. చక్కని నెట్‌రన్‌రేట్ కలిగి ఉంది. ప్రస్తుతం బెటర్ పొజిషన్‌లో ఉన్నా... లీగ్ రెండో స్టేజ్‌లో కూడా ఇదే తరహా ఆటతీరు కనబరిస్తే ప్లేఆఫ్‌కు చేరవచ్చు. వరుసగా నాలుగు విజయాల తర్వాత అనూహ్యంగా రెండు ఓటములు ఎదుర్కొన్న రాజస్థాన్ రాయల్స్... చివరి మ్యాచ్‌లో గెలిచి పుంజుకుంది.

### కమాండింగ్ పోజిషన్‌లో ఆర్సీబీ

డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగ ళూర్... పాయింట్ల పట్టికలో మూడో స్థానంలో ఉంది. ప్లే ఆఫ్ రేసులో బలమైన కంటెండర్‌గా ఉంది. ఆడిన ఆరు మ్యాచ్‌ల్లో 4 విజయాలు, 2 ఓటములు.. మొత్తం 8 పాయింట్లతో ఉంది. టాప్ ఫేవరెట్‌గా ఐపీఎల్ ఆరంభిం చినా.. అనూహ్యంగా ఢిల్లీ క్యాపిటల్స్ చేతిలో ఓడింది. ఎంతవేగంగా బౌన్స్ బ్యాక్ అవుతుండనడం పైనే ప్లే ఆఫ్ అవకాశాలు ఉంటాయి.

### దూసుకొచ్చిన సన్‌రైజింగ్

సొంతగడ్డపై జోరు చూపిన సన్ రైజర్స్ హైదరాబాద్ హ్యాట్రిక్ విజయాలతో ప్లే ఆఫ్ రేసులో దూసుకొచ్చింది. ఆడిన 7 మ్యాచ్‌ల్లో నాలుగు విజయాలతో 8 పాయింట్లతో టాప్-4లో ఉంది. లీగ్ రెండో స్టేజ్‌లో గెలుపు ట్రాక్ కొన సాగిస్తే ప్లే ఆఫ్ చేరుకోవడం ఖాయం. ఆడాల్సిన 7 మ్యాచ్‌ల్లో కనీసం 5 మ్యాచ్‌లు నెగ్గితే ఈజీ. లేదంటే సమీ కరణాలపై ఆధారపడాల్సి ఉంటుంది.

### హాట్ రేస్.. ఒక్క ఓటమీ డేంజరే

అయిదు నుంచి 7 స్థానాల్లో ఉన్న చెన్నై సూపర్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్, గుజరాత్ టైటాన్స్‌కు సెకండ్ స్టేజ్‌లో ప్రతి మ్యాచ్ డూ ఆర్ డై లాంటిదే. గెలిస్తేనే ప్లే ఆఫ్ రేసు లో నిలుస్తారు. చెన్నై ఆరంభంలో వరుస పరాజయాలు వెక్కిరించినా సంజూ జోరుగా గెలుపు ట్రాక్‌లో పడింది. గత నాలుగు మ్యాచ్‌ల్లో మూడు విజయాలు అందుకుంది. ఇదే జోరు కొనసాగిసేనత ప్లే ఆఫ్ అవకాశాలుంటాయి. ఇక ఢిల్లీ క్యాపిటల్స్, గుజరాత్ టైటాన్స్ ఆడిన 6 మ్యాచ్‌ల్లో మూడు విజయాలు, మూడు పరాజయాలతో ఉన్నాయి. ప్లే ఆఫ్ రేసులో ఉండాలంటే మిగతా మ్యాచ్‌ల్లో మెరుగైన ఆటతీరు కనబరచాల్సి ఉంటుంది.

### ఆ జట్లకు క్రిటికల్ స్టేజ్

ముంబై ఇండియన్స్, లక్నో సూపర్ జెయింట్స్ జట్లది క్రిటికల్ స్టేజ్. ఆడిన ఏడు మ్యాచ్‌ల్లో రెండేసి విజయాలతో దిగువన ఉన్నాయి. ప్రస్తుతానికి ఈ రెండు జట్ల ప్లే ఆఫ్ చేరడం చాలా కష్టం. ప్లే ఆఫ్ చేరాలంటే 7 మ్యాచ్‌ల్లో కనీసం ఆరు మ్యాచ్‌ల్లో గెలవాలి. అలాగే ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడాల్సిన పరిస్థితి. హాట్ ఫేవరెట్‌గా దిగి తొలి మ్యాచ్‌లోనే గెలుపొందిన ముంబై ఆ తర్వాత వరుస విజయాలతో ఢీలా పడింది. లక్నోది కూడా ఇదే పరిస్థితి. వరుసగా నాలుగు మ్యాచ్‌ల్లో ఓడింది. ఇక కోల్ కతా నైట్‌రైడర్స్ పరిస్థితి మరీ దారుణం. ఆడిన 7 మ్యాచ్ ల్లో ఒకే ఒక విజయంతో పాయింట్ల పట్టికలో అట్టడుగున ఉంది. ఇంచుమించు ప్లే ఆఫ్ రేసు నుంచి ఔటయినట్లే. అయితే కోల్‌కతా నెగ్గే మ్యాచ్‌ల్లో ప్రత్యర్థి జట్ల ప్లే ఆఫ్ ఆశలను గండిపడే ప్రమాదం ఉంది.

12 నుంచి 15 పాయింట్ల సాధించిన జట్లు ప్లే ఆఫ్‌కు చేరే అవకాశం ఎక్కువ. నెట్ రన్‌రేట్ కీలకపాత్ర పోషి స్తుంది. టాప్-2లో నిలిచే జట్లకు ఫైనల్ చేరేందుకు అదనపు ఛాన్స్ ఉంటుంది. సాంకేతికంగా చూస్తే ఐపీఎల్ లోని పది జట్లకూ ప్లే ఆఫ్ అవకాశాలు ఉన్నాయి. టాప్ జట్ల మధ్య జరిగే మ్యాచ్‌లు నేరుగా సమీకరణాలను మార్చే అవకాశం ఉంది. మధ్యస్థ జట్లు ఒకదానితో ఒకటి ఆడే మ్యాచ్‌లు ఎలిమినేషనన తరహాలో మారనున్నాయి. దీంతో ఐపీఎల్ లీగ్ రెండో స్టేజ్ ఉత్కంఠగా మారింది. ముందంజలో ఉన్న జట్లు తమ ఆధిపత్యాన్ని కనబరు స్తాయా? లేక మధ్యలో ఉన్న జట్లు చివరి దశలో అద్భు తంగా రాణిస్తాయా? అన్నది ఆసక్తిగా మారింది.

**POINTS TABLE**

| RANK | TEAM | P | W | L | PTS | NRR |
|---|---|---|---|---|---|---|
| 1 | PBKS | 6 | 5 | 0 | 11 | 1.42 |
| 2 | RR | 7 | 5 | 2 | 10 | 0.79 |
| 3 | RCB | 6 | 4 | 2 | 8 | 1.17 |
| 4 | SRH | 7 | 4 | 3 | 8 | 0.82 |
| 5 | CSK | 7 | 3 | 4 | 6 | 0.12 |
| 6 | DC | 6 | 3 | 3 | 6 | -0.13 |
| 7 | GT | 6 | 3 | 3 | 6 | -0.82 |
| 8 | MI | 7 | 2 | 5 | 4 | -0.74 |
| 9 | LSG | 7 | 2 | 5 | 4 | -1.28 |
| 10 | KKR | 7 | 1 | 5 | 3 | -0.88 |

**డబుల్ ధమాకా**
**ఐపీఎల్‌లో నేటి మ్యాచ్‌లు**

| ఢిల్లీ అరుణ్ జైట్లీ స్టేడియం | |
|---|---|
| పంజాబ్ కింగ్స్ V/S ఢిల్లీ క్యాపిటల్స్ | మధ్యాహ్నం 3.30 గం.లకు |
| **జైపూర్ మాన్‌సింగ్ స్టేడియం** | |
| సన్‌రైజర్స్ హైదరాబాద్ V/S రాజస్థాన్ రాయల్స్ | రాత్రి 7.30 గం.లకు |

## రాయల్స్‌పై సన్‌రైజర్స్ రిపీట్ చేసేనా?

**జైపూర్:** ఐపీఎల్‌లో నేడు మరో ఆసక్తికర పోరు జరగనుం ది. జైపూర్‌లోని సవాయ్ మాన్‌సింగ్ స్టేడియంలో జరిగే మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్‌తో సన్‌రైజర్స్ హైదరాబాద్ తలపడుతుంది. తమ అద్భుతమైన ప్రదర్శనను కొనసాగిం చాలని ఉవ్విళ్లూరుతోంది.ముఖ్యంగా సొంతగడ్డపై రాజస్థాన్ రాయల్స్‌పై నెగ్గిన ఆరేంజ్ ఆర్మీ... జైపూర్‌లోనూ రిపీట్ చేయాలని చేస్తోంది. ఈ సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ అన్ని విభాగాల్లోనూ నిలకడైన ప్రదర్శనలు ఇస్తూ అత్యుత్తమ జట్లలో ఒకటిగా నిలిచింది. వరుసగా మూడు మ్యాచ్‌లు నెగ్గింది. ముఖ్యంగా డాషింగ్ ఓపెనర్ అభిషేక్ శర్మ ఫామ్ లోకి రావడం సన్‌రైజర్స్‌కు కలిసివచ్చే అంశం. ఇషాన్ కిషన్ తో పాటు ట్రావిడ్ హెడ్, హెన్రిచ్ క్లాసెన్, నితిష్ కుమార్ రెడ్డి పరుగుల వేటలో ఉన్నారు. పాట్ కమిన్స్ జట్టులోకి రావడంతో బౌలింగ్ మరింత పటిష్టంగా మారింది.



ఇక రాజస్థాన్ రాయల్స్‌కు వస్తే.. రెండు ఓటముల తర్వాత తిరిగి విజయాల గాడిలో పడింది. గత ఓటమికి రివేంజ్ తీర్చుకోవాలని చూస్తోంది. యువ ఓపెనర్లు వైభవ్ సూర్యవంశీ, యశస్వీ జైశ్వాల్‌ల సంచలనాత్మక ఫామ్ బలా న్ని చేకూరుస్తోంది. అయితే మిగతా బ్యాట్స్‌మెన్ విఫల మవడం రాయల్స్‌ను ఆందోళన పరుస్తోంది. జోఫ్రా ఆర్చర్ నేతృత్వంలోని బౌలింగ్ దళం కీలక సమయాల్లో రాణించిం ది. లక్నో సూపర్ జెయింట్స్‌పై 40 పరుగుల తేడాతో ఘన విజయం సాధించిన రాజస్థాన్, తమ జోరును కొనసాగిం చగలమని ఆత్మవిశ్వాసంతో ఉంది. రెండుజట్లు మంచి ఫామ్ లో ఉండి, పాయింట్ల పట్టికలో కీలక పాయింట్లపై కన్నేసి ఉండటంతో, జైపూర్‌లో జరిగే ఈమ్యాచ్ ఉత్కంఠరేపుతోంది.

**రాజస్థాన్ రాయల్స్ :** యశస్వీ జైస్వాల్, ధృవ్ జురెల్(వికెట్ కీపర్), రియాన్ పరాగ్(కెప్టెన్), హెట్మైర్, ఫెరీరా, రవీంద్ర జడేజా, జోఫ్రా ఆర్చర్, రవి బిష్ణోయ్, బ్రిజేష్ శర్మ, బర్గర్, సందీప్ శర్మ; **ఇంఫాక్ట్ ప్లేయర్:** వైభవ్ సూర్యవంశీ

**సన్‌రైజర్స్ హైదరాబాద్:** అభిషేక్, హెడ్, ఇషాన్, క్లాసెన్, అంకిత్, నితిష్ కుమార్, కమిన్స్(కెప్టెన్), శివాంగ్, దూబే, సాకిబ్ హుస్సేన్, మలింగ; **ఇంఫాక్ట్ ప్లేయర్:** సలీల్ అరోరా



## సాయి సుదర్శన్ సెంచరీ మోత

**బెంగళూర్:** చిన్నస్వామి స్టేడియంలో గుజరాత్ టైటాన్స్ ఓపెనర్ సాయి సుదర్శన్(58 బం తుల్లో 100) శతకంతో గర్జించాడు. గత మ్యాచ్‌లో గోల్డెన్ డక్ అయిన సుదర్శన్... ఆ కసి నంతా ఆర్సీబీ బౌలర్లపై చూపెట్టాడు. ఎడాపెడా ఉతికేసిన సాయి ఈ ఐపీఎల్ సీజన్‌లో తొలి సెంచరీ, ఓవరాల్‌గా మూడోసెంచరీ సాధించాడు.తొలి ఫిఫ్టీకి 33బంతులు తీసుకున్న సాయి.. రెండో ఫిఫ్టీని 24 బంతుల్లోనే పూర్తిచేశాడు. అతని ఇన్నింగ్స్‌లో 11ఫోర్లు, 5 సిక్స్‌లు ఉన్నా యి. సింగిల్‌తో ఖాతా మొదలు పెట్టిన సాయి... భువీ నాలుగో బంతికి బౌండరీ బాదాడు. ఇక అక్కడినుండి వేగం పెంచాడు.భువీ మరో ఓవర్లో రెండు ఫోర్లు.. రసిఖ్ బౌలింగ్‌లో రెండు ఫోర్లు.. హాజిల్‌వుడ్‌కైతే 4, 6, 4తో 14 రన్స్ ఇచ్చేసిన సాయి సుదర్శన్ షెఫర్డ్ బంతిని స్టాండ్స్‌లోకి పంపి ఫిఫ్టీ నమోదుచేశాడు. ఆ తర్వాత కృనాల్ ఓవర్లో రెండు సిక్స్‌లతో 16 రన్స్ పిండుకున్న సాయి.. ఎడాపెడా ఫోర్లు, సిక్స్‌లతో శతక్కొట్టాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (32)తో కలిసి తొలివికెట్‌కు 128రన్స్, బట్లర్(25)తో కలిసి రెండో వికెట్‌కు 32 రన్స్ అందిం చాడు. సాయి సుదర్శన్ తన ఇన్నింగ్స్‌తో ఐపీఎల్‌లో అత్యంత వేగంగా 2వేల పరుగులు పూర్తి చేసిన ఆటగాడిగా నిలిచాడు. సుదర్శన్ శతకం.. ఈ ఐపీఎల్‌లో అయిదో సెంచరీ.

గుజరాత్ టైటాన్స్ 205/3 స్కోరు సాధించగా... లక్ష్య చేధనలో కోహ్లి(44 బంతుల్లో 81), పడిక్కల్(27 బంతుల్లో 55) రాణించడంతో ఆర్సీబీ 5 వికెట్ల తేడాతో గెలుపొందింది.

## 4 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరి




### నష్టాల్లో ముగిసిన
# సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబయి, ఏప్రిల్ 24:** దేశీయ స్టాక్ మార్కెట్లు వారాం తపురోజు భారీ నష్టాల్లో ముగిసాయి. సుమారుగా నాలుగు లక్షలకోట్లు ఇన్వెస్టర్ల సంపద ఆవిరి అయినట్లుట్రేడింగ్ ధోర ణులు చెపుతున్నాయి. మూడురోజుల నష్టాల్లోనే సుమారు 8నుంచి రూ.10లక్షలకోట్లు ఆవిరి అయినట్లు డేటా స్పష్టం చేస్తోంది. బిఎస్ఇ సెన్సెక్స్ 9999.79పాయింట్లు క్షీణించి 76,664.21 పాయింట్లవద్దముగిస్తే నిఫ్టీ 50 సూచీ 275.10 పాయింట్లు క్షీణించి 23,897.95 పాయింట్ల వద్ద ముగిసింది. మూడు సెషన్లలోను సెన్సెక్స్ నిఫ్టీలు వరుసగా 3.29శాతం, 2.76శాతం చొప్పున నష్టపోయా యి. ఐటిస్టాక్స్‌లో అమ్మకాలజోరు సాగింది. అన్ని విభాగ సూచీలు కూడా ఎన్ఎస్ఇలో ప్రతికూలంగానే ముగిసాయి. ట్రేడర్లు నాలుగోత్రైమాసిక వివరాలను పరిశీలిస్తూ, మరో పక్క గ్లోబల్ ధోరణులపైనా నజర్ వేసారు. ముడిచమురు కూడా బ్యారెల్‌కు 107 డాలర్లకుపైబడింది. ఇక బిఎస్ఇలో మిడ్‌క్యాప్0.94శాతం,స్మాల్‌క్యాప్‌సూచీ 1.17శాతం క్షీణిం చాయి.మార్కెట్లపరంగా బిఎస్ఇలో 1326 కంపెనీల షేర్లు పెరిగితే 2905 కంపెనీలషేర్లు క్షీణించాయి. 165 కంపె నీలషేర్లుమాత్రం యధాతథంగా కొనసాగాయి.

విదేశీ కరెన్సీ మార్కెట్‌లో భారత్‌రూపాయి దిగువస్థాయి లోనే ముగిసింది.94.23వద్ద ట్రేడింగ్ ముగించింది. ఎంసి ఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు జూన్ ఐదోతేదీ సెటిల్‌మెంట్లు 0.20శాతం క్షీణించి రూ.151,450గా కొనసాగాయి. కమొడిటీ మార్కెట్లపరంగా బ్రెంట్ ముడిచమురు రెండు డాలర్లుపెరిగి బ్యారెల్‌కు 107.07 డాలర్లుగా కొనసాగింది. ఇక నిఫ్టీలో అయితే ఐటి సూచీ ఐదుశాతం దిగజారింది. ఇన్ఫోసిస్, హెచ్‌సిఎల్‌టెక్ సంస్థలషేర్లుకూడా క్షీణించాయి. బ్యాంకింగ్, ఆటోమొబైల్స్, ఎఫ్ఎంసిజి రంగాల్లో భారీ క్షీణతను ఎదుర్కొన్నట్లు ట్రేడర్లు వెల్లడించారు.

వారం మొత్తంగాచూస్తే సెన్సెక్స్,నిఫ్టీలు రెండూ కూడా నష్టాలే చవిచైసాయి. వచ్చేవారం కూడా కార్పొరేట్ ఫలితాలు, ముడి చమురుధరలు, భౌగోళిక ఉద్రిక్తతలు, డాలర్ రూపాయి మారకం విలువలు కూడా సెన్సెక్స్, నిఫ్టీలను ప్రభావితంచేస్తాయని ట్రేడింగ్ నిపుణులు అంచనావేస్తున్నారు.

### భారత్, న్యూజిలాండ్ మధ్య
## 27న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 24:** భారత్ న్యూజిలాండ్‌లమధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఈనెల 27వ తేదీ జరుగు తుందని ఇరువైపులా ప్రతినిధులు ప్రకటించారు. వాణిజ్య సంబంధాలు పెరగడంతోపాటుమరింతగా మార్కెట్లకు చేరువయ్యేందుకు ఈ వాణిజ్య ఒప్పందం తోడవుతుందని న్యూజిలాండ్ ప్రధానమంత్రి క్రిస్టఫర్ లక్సన్ వెల్లడించారు. భారత్‌తో మేం స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఈనెల 27వ తేదీ సోమవారం సంతకాలు చేయనున్నట్లు తెలిపారు. న్యూజిలాండ్ ఎగుమతిదారులకు మెరైన్ జెట్ వ్యవస్థలు 70 దేశాలకు ఎగుమతిచేసేందుకు కూడా వీలవుతుందని ఆయన తెలిపారు.

ఈ ఒప్పందం వల్ల వాణిజ్యపరమైన అడ్డంకులన్నింటినీ అధిగమించడంతోపాటు రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం మరింత పెరుగుతుందని అన్నారు. బిజినెస్ కార్యకలాపాలు పెరగడంతోపాటు ఉపాధి అవకాశాలను కూడా పెంచుతుందని అన్నారు. ఎక్కువ వేతనాలతో మరిన్ని ఉపాధి కొలువులు వచ్చే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని ఎఫ్టీయేతో మరిన్ని అవకాశాలు, వాణిజ్య సంబంధాలు పటిష్టం అవుతాయన్నారు.

ఈనెల తొలివారంలోనే న్యాయపరంగా అన్నింటినీ పరిశీలన పూర్తిచేసారు. ఈనెల 27వ తేదీ న్యూజిలాండ్ ప్రతినిధి బృందంతోపాటు వాణిజ్య పెట్టుబడుల మంత్రి టాడ్ మెక్‌క్లే కూడా ఉంటారు. భౌగోళిక ఉద్రిక్తతలు ఒపక్క ఎక్కువ ఉన్నప్పటికీ వాణిజ్య ఒప్పందం ఖరారు అవు తుండటం గొప్ప విశేషమని, రెండు దేశాలకు అందివచ్చిన మంచి అవకాశంగా చెప్పారు. మెక్‌క్లే ఎఫ్‌టిఎకారణంగా న్యూజిలాండ్‌కు పార్లమెంటరీ ఒప్పంద పరిశీలన వీలవుతుందని దీనివల్ల రెండుదేశాలు కూడా ఎఫ్టీయేను స్క్రూటినీ చేసుకుంటాయని అన్నారు.



### ఒక్క యేడాదిలోనే 23.4 లక్షల కార్లు
## మారుతి ఉత్పత్తి రికార్డు

**ముంబయి, ఏప్రిల్ 24:** భారత ఆటోమొబైల్ రంగంలో అగ్రగామిగా ఉన్న మారుతి సుజుకి ఇండియా లిమిటెడ్ రికార్డుసాధించింది. ప్రతి 14 నిమిషాలకు ఒక కారును ఉత్పత్తి చేస్తూ కొత్త రికార్డును నెలకొల్పింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ ఏకంగా 23.4 లక్షల కార్లను ఉత్పత్తి చేసింది. ఈ ఆర్థిక సంవత్సరంలో డిజైర్, ఫ్రాంక్స్, స్విఫ్ట్, ఎర్టిగా, బాలెనో మోడల్స్ అత్యధికంగా ఉత్పత్తి అయ్యాయి. ఈ ఐదు మోడళ్లలో ప్రతి ఒక్కటీ 2 లక్షలకు పైగా యూనిట్లుగా తయారయ్యాయి. సుజుకి మోటార్ కార్పొరేషన్‌కు చెందిన ప్రపంచవ్యాప్త తయారీ కేంద్రాలలో కూడా ఈ స్థాయి ఉత్పత్తిని సాధించిన ఏకైక కంపెనీగా మారుతి సుజుకి నిలిచింది. ఈ అద్భుత రికార్డుపై మారుతి సుజుకి ఎండీ, సీఈఓ హిసాషి తకేయుచి స్పందించారు. ఒకే దేశంలో ఇంత పెద్ద సంఖ్యలో వాహనాలు తయారు చేయడం మాకు గర్వ కారణం. నాలుగున్నర దశాబ్దాలుగా మేం నిర్మించిన ఆటోమొబైల్ పర్యావరణ వ్యవస్థ, మా ఉద్యోగులు, భాగస్వాముల సమష్టి కృషి, ప్రభుత్వం తెచ్చిన జీఎస్టీ 2.0 వంటి విధానాల వల్లే ఇది సాధ్యమైందని ఆయన వివరించారు. భవిష్యత్తులో ఉత్పత్తి సామర్థ్యాన్ని సుమారు 40 లక్షల యూనిట్లకు పెంచాలని, భారతదేశాన్ని కీలకమైన ఎగుమతి హబ్‌గా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తకేయుచి తెలిపారు. ఈ విజయం మారుతి సుజుకి పటిష్ఠమైన సరఫరా వ్యవస్థ, డీలర్ నెట్‌వర్క్‌కు నిదర్శనంగా నిలుస్తోందని అన్నారు.

## దేశంలో చెలామణిలో రూ.41.6 లక్షల కోట్ల కరెన్సీ

**ఎస్‌బిఐ రీసెర్చి నివేదిక**



**ముంబయి, ఏప్రిల్ 24:** దేశంలో చెలామణిలో ఉన్న కరెన్సీ ఈ ఏడాది 11.9శాతం పెరిగి రూ.41.6 లక్షల కోట్లకు చేరిందని ఎస్‌బిఐ రీసెర్చి నివేదిక ప్రస్తావించింది. 2016లో పెద్దనోట్ల రద్దునుంచి శరవేగంగా కరెన్సీ చెలామణి పెరిగిందని నిర్ధారించింది. అలాగే డిజిటల్ చెల్లింపులు కూడా పెరిగాయి. యుపిఐ లావాదేవీల విలువలు 20.6 శాతం పెరిగి రూ.314 లక్షలకోట్లకు చేరాయి. లావాదేవీల సంఖ్య పరంగా కూడా 30శాతంపెరిగి 241.6 బిలియన్ లావాదేవీ లు జరిగినట్లు వెల్లడించింది. యుపిఐల్లో ఎక్కువగా చిన్న మొత్తాల లావాదేవీలే అధికంగా న్నాయి. మొత్తం 86శాతం యుపిఐ లావాదేవీల్లో ఇవే ఉన్నాయి. పర్సన్‌టు మర్చంట్ అంటే పీ2ఎం 60శాతంగా ఉన్నాయి. అలాగే 500 లోపు అలాగే వ్యక్తులుక స్టమర్లు తమవద్ద కొంత నగదును కూడా స్థిరంగా ఉంచుకుంటున్నారు. తలసరి ఆదాయం తేడా కూడా 2024లో 1804నుంచి ప్రస్తుతం 9127కి పెరిగింది. ఎక్కు వ మొత్తం ఉన్న కరెన్సీనోట్ల లావాదేవీలే 86శాతం వరకూ ఉన్నట్లు ఎస్‌బిఐ రీసెర్చి చేసింది. రూ.100 నోట్లు 2025లో 6.2శాతం ఉంటే ఈఏడాది మార్చి చివరినాటికి 8.2శాతానికి చెలామణీలో పెరిగింది. ఇక సెంట్రల్‌బ్యాంకు డిజిటల్ కరెన్సీ సిబిడిసి కూడా తొలిదశలోనే ఉంది. చెలామణి కేవలం రూ.1016 కోట్లుమాత్రమే ఉంది. మొత్తం చెలామణిలో ఉన్న కరెన్సీతో పోలిస్తే 0.02శాతం మాత్రమే. డిజిటల్ చెల్లిం పులు శరవేగంగా విస్తరించినప్పటికీ నగదు నిల్వల వ్యవస్థ అనేది భారత ఆర్థిక వ్యవస్థకు కీలకంగానే మారింది.

### 703.308 బిలియన్ డాలర్లకు పెరిగిన రిజర్వులు
## విదేశీ కరెన్సీ ఖజానా కళకళ



**ముంబయి, ఏప్రిల్ 24:**భారత్ విదేశీ కరెన్సీ ఖజానా కళకళలాడింది. ఈనెల 17వతేదీతో ముగిసిన వారంలో విదేశీ కరెన్సీ నిల్వలు 2.362 బిలియన్ డాలర్లుపెరిగి 703.308 బిలియన్ డాలర్లకు పెరిగినట్లు ఆర్‌బిఐ ప్రకటించింది అంతకుముందు వారంలో కూడా విదేశీ కరెన్సీ 3.825 బిలియన్ డాలర్లుపెరిగి 700.946 బిలియన్ డాలర్లకు చేరాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 27వ తేదీతోముగిసిన వారంలో ఒక్కసారిగా ఆల్‌టైమ్ రికార్డుస్థాయికి పెరిగాయి. తొలిసారిగా ఈ ఏడాది 728.494 బిలియన్ డాలర్లవరకూ వచ్చాయి. పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ మేఘాలతో రానురాను క్షీణించాయి. ఫిబ్రవరి 28వ తేదీనుంచి ఇరాన్, అమెరికా ఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభించిన సంగతి తెలిసిందే. దీనివల్ల భారత రూపాయిపైనా భారంపడింది. దిగుమతులకు డాలర్ల చెల్లింపులు పెరిగి అటు డాలర్ పటిష్టం కావడం, ఇటు రూపాయి క్షీణించడం వంటివి జరిగాయి. ఇక ఈ వారంలో విదేశీ కరెన్సీ ఆస్తులపరంగా చూస్తే 1.481 బిలియన్ డాలర్లుపెరిగి 557.463 బిలియన్ డాలర్లకు చేరాయి. విదేశీ కరెన్సీ ఆస్తులు అంటే యూరో, పౌండ్, యెన్ వంటి డాలరేతర ఆస్తుల మారకం విలువల్లో ఉన్న తేడాలను కరెన్సీ ఆస్తులుగా గుర్తిస్తారు. ఇక బంగారం రిజర్వులు 790 మిలియన్ డాలర్లుపెరిగి 122.133 బిలియన్ డాలర్లకు చేరాయి. ఇక స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ అంటే ఎస్డీఆర్‌లు కూడా 78 మిలియన్ డాలర్లుపెరిగి 18.841 బిలియన్ డాలర్లకు చేరాయి.

## మెటాలో 8వేలమందికి ఉద్వాసన




**కాలిఫోర్నియా, ఏప్రిల్24:** సోషల్ మీడియా దిగ్గజం, ఫేస్‌బుక్ మాతృ సంస్థ మెటా మరోసారి భారీ లేఆఫ్స్ తప్పవని ప్రకటించింది. మే 20న తమ ఉద్యోగుల్లో 10 శాతం మంది దాదాపు 8వేల మందిని తొలగించను న్నట్లు ప్రకటించింది.ప్రస్తుతం ఖాళీ గా ఉన్న 6వేల పోస్టులను కూడా ఇకపై భర్తీ చేయబోమని వెల్లడించిం ది. కంపెనీ చీఫ్ పీపుల్ ఆఫీసర్ జానెల్ గేల్ ఉద్యోగులకు ఒక మెమో పంపారు. వాస్తవానికి ఈ లేఆఫ్స్ ప్రణాళికకు సంబంధించిన వివరాలు మీడియాకు లీక్ కావడంతో, తాము ముందుగానే ఈ విషయాన్ని వెల్లడిస్తున్నట్లు ఆమె తెలిపారు. కంపెనీని మరింత సమర్థవం తంగా నడపడం, ఇతర పెట్టుబడులను భర్తీ చేసుకోవడం కోసమే ఈ కఠిన నిర్ణయం తీసు కుంటున్నట్లు వివరించారు. తొలగింపునకు గురయ్యే ఉద్యోగులకు అండగా ఉంటామని, వారికి భారీ సివరెన్స్‌ప్యాకేజీ అందిస్తామని మెటా హామీ ఇచ్చింది. అమెరికాలోని ఉద్యోగులకు 16 వారాల బేసిక్ వేతనంతో పాటు, ప్రతి ఏడాది సర్వీస్‌కు రెండు వారాల చొప్పున అదనపు వేతనం, 18 నెలల పాటు ఆరోగ్య బీమా అందిస్తామని తెలిపింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ భారీగా పెట్టుబడులు పెడుతున్న తరుణంలో ఈ నిర్ణయం వెలువడింది. కంపెనీని ఏఐ టెక్నాలజీ చుట్టూ పునర్నిర్మించే ప్రయత్నాల్లో భాగంగానే ఈ లేఆఫ్స్ జరుగుతున్నాయని టెక్‌నిపుణుల అంచనా. వచ్చే మే 20న ప్రభావిత ఉద్యోగులందరికీ వారి వర్క్, వ్యక్తిగత ఈమెయిళ్లకు సమాచారం అందుతుందని కంపెనీ స్పష్టం చేసింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.